ప్రణాళికా సప్తాహ ప్రత్యేక సంచిక

Regd. No. H. 373



ఆంధ్రప్రదేశ్


సంపుటి 4 సంచిక 9

జూలై, 1960

ఆషాఢ, 1882 శక



తంగెడ సమీపంలో 1960 మే 12వ తేదీన జరిగిన పడవ ప్రమాదంలో తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా ముగ్గురు పిల్లలను రక్షించిన ముత్యాలంపాడు గ్రామస్థురాలు శ్రీమతి గొట్టిముక్కల మట్టమ్మ.



రామప్ప దేవాలయం, వరంగల్.

ఆంధ్ర ప్రదేశ్

సంపుటి 4 | జూలై, 1960 | సంచిక 9

ఆషాఢ, 1882 శకము

విషయసూచిక

ముందు అట్ట:— ప్రతి గ్రామంలో ప్రణాళికా పథకాలు నడుస్తున్నవి.

వెనుక అట్ట:— జాలాపుట్ ప్రాజెక్టు దృశ్యం.

చందా వివరాలు :

సంవత్సరానికి ... 2 రూపాయల 16 నయాపైసలు.

విడిప్రతి వెల ... 18 నయాపైసలు.

Edited and Published by the Director of Information and Public Relations, **Hyderabad**

Printed at: Vir Milap Press, Mukaramjahi Road, Hyderabad.

దేశంతోపాటు మీరుకూడా అభ్యుదయం పొందండి!

మీరు మిగుల్చుకున్న డబ్బును

భారత ప్రభుత్వ చిన్నమొత్తాల పొదుపు పథకమునకు

పెట్టుబడి పెట్టండి!

భారత దేశం యొక్క

సమాజాభివృద్ధి కార్యక్రమమునకు, గొప్ప నదీలోయ ప్రాజెక్టులకు,

రైలుమార్గములు, రోడ్ల అభివృద్ధికి తోడ్పడండి!

మీ డబ్బును ఈ క్రింది గ్యారంటీడ్ సెక్యూరిటీలలో దేనిలోనైనా పెట్టుబడి పెట్టండి!

---

12 సంవత్సరముల నేషనల్ ప్లాన్ సేవింగ్సు సర్టిఫికెట్లు—

పరిణతి పొందిన పిమ్మట నూటికి సంవత్సరానికి 5 41 వంతుల చొప్పున వడ్డీ ఇవ్వబడుతుంది. ఇవి రూ. 5 లవి మొదలు రూ. 5,000 లవి వరకూ లభిస్తాయి. వ్యక్తిగతంగా ఒక్కొక్కరు రూ 25,000 ల వరకూ కొనవచ్చు.

10 సంవత్సరముల ట్రెజరీ సేవింగ్సు డిపాజిట్ సర్టిఫికెట్లు—

ఏటా నూటికి 4 వంతులు వడ్డీ చెల్లించబడుతుంది. ఒక్కొక్కరు రూ. 50 లవి మొదలు రూ. 25,000 ల వరకూ కొనవచ్చు.

పోస్టాఫీసు సేవింగ్సు బ్యాంకు అక్కౌంట్లు—

రూ 25 నుంచి 10,000 ల వరకూగల నిల్వలపై నూటికి 2½ వంతుల చొప్పున, రూ. 10,000 లను మించిన నిల్వలపై నూటికి 2 వంతుల చొప్పున వడ్డీ ఇవ్వబడుతుంది.

15 సంవత్సరముల ఆన్యూయిటీ సర్టిఫికెట్లు (రెండవ సీరీస్)

జారీ చేయబడు ధరలు: రూ. 3,325, 6,650, 13,300 మరియు 26,600.

(ఈ సొమ్ము నూటికి సంవత్సరానికి కొంచెమెక్కువగా 4 వంతుల చొప్పున యిచ్చే చక్రవడ్డీతో సహా నెలసరి వాయిదాలలో 15 సంవత్సరాలలో తిరిగి చెల్లించబడుతుంది.)

= వ్యక్తిగతంగా ఒక్కొక్కరు రూ. 26,600 ల వరకు కొనవచ్చు =

ఆదాయంపన్ను లేకుండా మీకు మంచి ఆదాయం లభిస్తుంది!

భావి భారత సౌభాగ్యానికై పెట్టుబడి పెట్టండి!

: ఇతర వివరములకు ఈ పెట్టుబళ్ళకు సంబంధించిన నిబంధనావళి కొరకు :

నేషనల్ సేవింగ్సు కమిషనర్,
నాగపూర్,
చిరునామాకు గాని

లేక

రీజియనల్ నేషనల్ సేవింగ్సు ఆఫీసర్,
ఆంధ్ర ప్రదేశ్, హైదరాబాదు (దక్కన్)
శిరునామాకుగాని వ్రాయాలి.

గవర్నరు సందేశం:

"దృఢ సంకల్పంతో ముందుకు సాగుదాం"

ప్రణాళికా వారోత్సవ సందర్భంగా వెలువరించ బడిన యీ ప్రత్యేక సంచికకు రాష్ట్ర గవర్నరు, శ్రీ భీమసేన్ సచార్, దిగువ సందేశాన్ని యిచ్చారు:

గత కొలది సంవత్సరాలుగా, యేటా మనం ప్రణాళికా వారోత్సవాలు జరుపుకుంటున్నాం. ప్రజల ఆర్థిక పురోగతి సాధించే జాతీయ కృషిలో ప్రజలు పాల్గొనునట్లు వారి ఉత్సాహాన్ని ఇనుమడింప జేయటానికి ఈ వారోత్సవాలు ఉద్దేశించ బడ్డాయన్నది సువిదితమే. ఈ కృషికి ప్రజల నుంచి సంతృప్తికరమైన ప్రోత్సాహం లభించినందుకు నాకు చాల సంతోషంగా వుంది. అయితే యీ సమస్యకున్న ప్రాధాన్యతను బట్టి, కొద్దిగా విశ్రాంతి తీసుకుందామా అనే ఆలోచనలు రాకముందే మనం చేయవలసింది యింకా ఎంతో వుంది. అనిశ్చిత పరిస్థితిని పూర్తిగా తొలగించు కోవాలంటే మనం ఎంతో ముందుకు పోవాలి. సక్రమమైన మార్గంలో కృషిజేస్తే తప్పక ఫలిస్తుందన్న దైవ శాసనంలో విశ్వాసమూ, దృఢ సంకల్పమూ వుంచి మన మంతా ముందుకు సాగుదాం.

మనం ఇంతవరకు సాధించిన ఫలితాలు చాలా ప్రోత్సాహకరంగా వున్నయి మన రాష్ట్రంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి ప్రథమ ప్రణాళికలో 33 శాతం పెరిగితే, ద్వితీయ ప్రణాళిక మొదటి మూడేండ్లలోనే మరో 11.9 శాతం పెరిగింది. ఈనాటి ధరలను బట్టి, రెండో ప్రణాళిక తొలి మూడేండ్లలో రాష్ట్ర ఆదాయం 29.8 శాతం పెరిగినట్టు అంచనా వేయబడింది. అదే కాలంలో తలసరి ఆదాయం కూడ రు. 277ల నుంచి రు. 312లకు పెరిగింది. ఈ ఫలితాలు భవిష్యత్తును గురించి మనం ఆశతో వుండటాన్ని ధృవీకరిస్తున్నాయి. అందుకని, మన దేశ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించటానికి మనం ఇంకా పట్టుదలతో ముందుకు పోదాం. ఈ రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా జిల్లాలలోని ప్రజలు, ఉత్సాహంతో ఈ ఉత్సవాలలో పాల్గొని, పై లక్ష్య సాధనకు పూర్తిగా తోడ్పడుతారని నా నమ్మకం.

'జై హింద్'

తనకొక విషయము సరియైనదని స్పష్టంగా తెలిసి నిశ్చయజ్ఞానం కలిగినపుడు, యితరులా విషయంలో పొరపడుతున్నారని దృఢముగా తెలిసినపుడు, అప్పుడే నిజంగా ఓరిమి వహించాలి.

— గురజాడ

ప్రబోధము

— పాలా వేంకట సుబ్బయ్య

అదిగో సాగుచు నున్న దివ్యసుధ స
    ర్వాయత్త సంరంభ సం
పదతో నభ్యుదయోద్యమంబొకటి, ని
    ర్వాకంబు సేయంగ నీ
కిదియే సత్సమయంబు. తోడ్పడుము సా
    ధింపంగ సౌభాగ్య మిం
కెదియున్ లేదు పథంబు వేరొకటి; మే
    లేపూన మౌనంబునున్?

దేశమే నీయది- తికమక పడుదేల ?
    ముందడుగు వేయక- పూనిపనికి,
ఆర్య ధర్మమె నీది- యపని సుఖము గోరి
    నడుము కట్టవ దేల?- మడుగు విప్పి,
అభ్యుద యోద్యమ- మను ప్రణాళిక నీదె
    కష్టించ వదియేల ?- కాలు కదిపి,
త్యాగమే నీ సొత్తు- ధనమొసంగ వదేల ?
    దేశాభ్యుదయ కాంక్ష- దీక్షఁబూని,

పంచవర్ష ప్రణాళిక- పరుల దనుచు
భావనము సేయ నగునేమి- భారతీయ,
వరల నిత్య కల్యాణము- పచ్చతోర
ణముగ భరత వర్షముఁక పూ-నంగ వలదె,

విరియ నవజ్ఞతా సుమము
    విశ్వము నిండు తమిస్ర గంథముల్,
తొరఁగును భావి సౌఖ్యములు,
    దుష్క్రియ లాశల బ్రోకు నెంతయున్,
గరుణను బాసి యా యినుప
    గజ్జెల తల్లి ఘటించు నాట్యమున్,
సిరులెటు గల్గు జ్ఞానమున
చిత్తముఁ బూన్పమి కార్య భూమికన్.

విజ్ఞాన మున్న నే- విశ్రుత కృషియందు
సంలగ్న చిత్తంబు- జాలువారు,
శక్తి సామర్థ్యాలు- సమకూడినప్పుడే
కార్యసాఫల్యంబు- కంట బడును,
పట్టుదల వరల- భల్లూకము విధంబు
జయము సాధింపంగా శక్తి గలుగు,
సమధి కోత్సాహంబు- స్వాంతమందున్న నే
ధైర్యంబు కార్యాల- తాండవించు,

నాల్గు ప్రతి పాదనములు నం-దమగు నాల్గు
స్తంభములగు ప్రణాళికా సౌధమునకు,
కూర్చుకొనుమోయి సోదరా ;- గొణుగు టేల ?
స్వాభిమానంబు గలదేని- సమయ మిదియ,

ప్రాజెక్టులనుగట్టి- పట్టు నేలలఁ దడిపి
శాద్వలంబుల సేయు- శాఖ యొకటి,
ఫ్యాక్టరీలను బెట్టి- యమల రసాయని
కపుటెరువు లందిచ్చు- కాండ మొకటి,
విద్యు దుత్పాదన- విరివిగా నొనరించు
పారిశ్రమలఁ బెంచు- భాగమొకటి,
ఉక్కు- కర్మాగార- మక్కఱ దీర్పంగ
స్థాపించునట్టిపి- ధానమొకటి.

గల ప్రణాళికోద్యమ మను- కల్పతరువు
ఏచి యెసలారి ఫలియింప- వేచియుండె,
ప్రోది సేయుము సోదరా ; పోలునట్టి
సర్వ సహకార మొసఁగి ప్రా-శస్త్యగతిని,

అదనౌదవంగఁ గార్యముల
నాదరి మున్నటు చూపి. మీఁదటన్
చెదలు విధంబు లాభమును
చేతికిఁ జిక్క చరించి, లుబ్ధులై
సదమల రూప కార్యముల
సంధిల సేయక ద్రోహులౌదు, రా
మొదటి సమాజ శత్రువుల
బుద్ధి మరల్పఁగఁబూను సోదరా ;

హక్కులడుగంగఁ జాలిన- యార్యుఁడేల
బాధ్యతల నెదరోయడో- పాలు పోదు ;
స్వార్థబుద్ధికి విస్మృతి- సహజమేమొ
హెచ్చరిక సేయఁబోలదె- యింకనైన.

శరదమల విష్ణు పథమున- సంచరించు
కారు మబ్బులు చెదరఁగా- కళలనించి
వెలసె రాకాశశాంకుఁడు- విరియు కలువ
సిరులు మెండుగా నింకేల- చింత గొనఁగ॥

గేయము

మన పన్నులను గూర్చి- మన ద్రవ్యమును జేర్చి
మన ప్రజాళిక నెగ్గ- మనము ముందుకు మొగ్గ
అడ్డుబెట్టే దెవడురా- మనలను
అడుగు ముందుకు వేయరా !
పొలములో పైరులు- నిలువెత్తుగా పెర్గి
గాదెలు నింపంగ- కలకలా మనురైతు
పారిశ్రమలు వెల్గి- పనిగల్గ కూలీలు
పకపకా నవ్వుచు- పండుగల్ సేతురు,
మన లక్ష్య మిదియేనురా- మనమిఁక
పనిసేయ పూనాలిరా ॥

సంపద కోల్పోయినవాడు. ఎంతో కోల్పోయినట్లు; మిత్రులను కోల్పోయినవాడు, అంతకు మిన్నగా కోల్పోయినట్లు; అయితే ఆత్మను కోల్పోయినవాడు సర్వం కోల్పోయినట్లే.

— స్పెయిన్ దేశ సూక్తి.

ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రణాళికాభ్యుదయం

— శ్రీ డి. సంజీవయ్య

భారత దేశంలో ప్రథమ పంచవర్ష ప్రణాళిక సాధించిన విజయం అపూర్వం. మనం పెట్టుకున్న లక్ష్యాలు, సాధించిన ఫలితాలు సరిపోల్చి చూసుకుంటే విజయ స్వరూపం పూర్తిగా బోధపడుతుంది. అయితే ఆంధ్ర ప్రదేశ్ విషయంలో యీ విధంగా సమీక్షించుకునే అవకాశం లేదు. ఎందుకంటే తెలంగాణా ప్రాంతం ఆనాడు హైదరాబాద్ రాష్ట్రంలో భాగంగా వుండేది. మూడు భాషా ప్రాంతాలు కలిసి వున్న ఉమ్మడి హైదరాబాద్ రాష్ట్రంలో, మొదటి ప్రణాళికలో తెలంగాణా ప్రాంతానికి జరిగిన ఖర్చు వివరాలు విడిగా లభ్యం కావడం లేదు. అటు ఆంధ్ర ప్రాంతం కూడా మద్రాసు రాష్ట్రంలో కలిసివుండేది. దాదాపు ప్రథమ ప్రణాళిక మధ్య కాలంలో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. మద్రాసు రాష్ట్ర ప్రణాళికలో నుంచి విడిపడి ఒక భాగం ఆంధ్ర రాష్ట్రానికి సంక్రమించింది. ఆనాటి ఆంధ్రరాష్ట్రంలో ప్రారంభ దశలో అనేక ఆటంకాలను ఎదుర్కోవలసి వచ్చినప్పటికీ, ప్రణాళిక కేటాయింపుల మొత్తం రు. 64.32 కోట్లే అయినా రు. 64.52 కోట్లు ఖర్చు చేయబడింది అంటే శైశవ దశలో ఆంధ్ర రాష్ట్రం నూటికి నూరు పాళ్ళు విజయం సాధించింది.

ద్వితీయ ప్రణాళిక

ప్రథమ ప్రణాళిక గణనీయమైన అభివృద్ధి సాధించడమే కాక ప్రజలలో సాహసోపేతమైన నూతనోత్సాహం వెల్లివిరియ జేసింది. ప్రజల నుండి హృదయపూర్వక సహకారం లభింప జేసింది. అటువంటి అనుకూల తరుణంలో, 1956 లో ద్వితీయ ప్రణాళిక ప్రారంభమైంది. ద్వితీయ ప్రణాళిక మొదట్లోనే, అంటే సుమారు 7 నెలల కాలంలో ఆంధ్రుల భాషా రాష్ట్ర వాంఛ-తెనుగు జాతి చిరకాల వాంఛితం యీడేరింది. తెనుగు ప్రజలందరికీ ఒక రాష్ట్రం, ఒకే పరిపాలనా వ్యవస్థ ఆంధ్ర ప్రదేశ్ నూతన రాష్ట్రమేర్పడింది. దీనితో, ఆంధ్ర-తెలంగాణా ప్రాంతాల ప్రణాళికలను, వాటి ప్రత్యేక వ్యక్తిత్వాలు చెడకుండా సమన్వయపరచి, రాష్ట్రమంతటికీ ఒకే ప్రణాళిక 'రూపొందించడం ముఖ్య కర్తవ్యమైంది.

ఈ సమన్వయ కృషిలో రాష్ట్ర మంతటికీ కలిసి రు. 175.74 కోట్ల ప్రణాళిక తయారయింది. ఇందులో ఆంధ్ర ప్రాంత ప్రణాళిక రు. 119.93 కోట్లు, తెలంగాణా ప్రణాళిక రు. 55.81 కోట్లు. ఈ మొత్తానికి గాను ప్రణాళిక మొదటి నాలుగు సంవత్సరాల్లో మన రాష్ట్రంలో రు. 132 కోట్లు ఖర్చు జరిగింది. ఇప్పుడు రు. 44.04 కోట్ల ఖర్చుతో ప్రణాళికా పథకాలు అమలు జరుగుతున్నవి. వివిధ రంగాలలో తగినన్ని వనరులు లేకపోవడం, పరిపాలనా వ్యవస్థ, సాంకేతిక రంగాలలో శిక్షణ పొందిన సిబ్బంది కొరత, దేశంలో-విదేశ ద్రవ్య మారక పరిస్థితి తీవ్రత, భాషా ప్రయుక్త రాష్ట్రాల అవతరణ మూలంగా ఏర్పడిన చిక్కు సమస్యలు, నిర్మాణ సామగ్రి, పరికరాల కొరత మొదలగు అనేక యిబ్బందులను మనం ఎదుర్కోవలసి వచ్చింది. వీటి దృష్ట్యా చూస్తే, ఎన్ని అవాంతరాలు వచ్చిన తట్టుకుని మన రాష్ట్రంలో సాధించిన అభివృద్ధి అక్షరాలా మనకు గర్వకారణం. ఉద్దేశించిన మొత్తాలకు మించి ఖర్చు జరుగబోతున్నది. అంతేకాక 'యిదీ మనం చేసింది' అని సంతృప్తికరంగా చెప్పుకోటానికి తగినట్లుగా ప్రశంసనీయమైన ఫలితాలను కూడా సాధించాం. వివిధ రంగాలలో మనం సాధించిన అభివృద్ధిని ఒకసారి సమీక్షించుకుందాం.

వ్యవసాయ రంగంలో, ఎక్కువ పంట పండించ

టానికి ప్రాముఖ్యం లభించిన కొలది, మన రాష్ట్ర ప్రణాళికలో కూడా అధికోత్పత్తి కార్యక్రమం అగ్రస్థానం వహించింది. రైతులకు మేలురకం విత్తనాలు అందించటానికి ప్రణాళిక నాలుగవ సంవత్సరం చివరకు 447 విత్తనాల క్షేత్రాలు, 319 విత్తనాల స్టోర్సు నెలకొల్పడం జరిగింది. 1960 మార్చి మాసాంతానికి 160 ట్రాక్టర్లు, 1260 ఆయిల్ ఇంజన్లు, 620 విద్యుచ్ఛక్తి మోటార్లు రైతులకు పంచారు. అలాగే, సేద్యపు నీటిపారుదల సౌకర్యం నిమిత్తం 506 ఫిల్టర్ పాయింట్లు, 1065 కొత్త బావులు ఏర్పాటైనవి. భూసార సంరక్షణ కార్యక్రమ ప్రాధాన్యం గుర్తించబడి 36 665 ఎకరాల మేర భూసారం కొట్టుకు పోకుండా వరద కట్టల నిర్మాణం జరిగింది. మొదటి నాలుగు సంవత్సరాల కాలంలో యీ వివిధ చర్యల మూలంగా రాష్ట్రంలో అదనంగా 10.94 లక్షల టన్నుల ఆహారోత్పత్తి సాధ్యమయింది. ద్వితీయ ప్రణాళిక కాలంలో అదనంగా 16.43 లక్షల టన్నుల అధికోత్పత్తి సాధించాలని లక్ష్యం. అంటే 1960-61 లో యింకా మనం 5.49 లక్షల టన్నుల అభివృద్ధి సాధించుకోవాలి ద్వితీయ ప్రణాళిక కాలంలో దేశమంతటికీ కలిసి సాధించవలసిన అధికోత్పత్తి లక్ష్యంలో మన రాష్ట్ర లక్ష్యం సమారుగా పదవ వంతు దీనిని నూటికి నూరు పాళ్ళు పూర్తిగా సాధించగలమనే మన విశ్వాసం.

ఇక పశుపోషణకు సంబంధించిన అభివృద్ధి ఈ రంగంలో యిప్పటి వరకు 95 పశు వైద్యశాలలు, 15 సంచారక వైద్య దళాలు, 66 ప్రథమ చికిత్సా కేంద్రాలు, 26 కీలక గ్రామ కేంద్రాలు, 22 కోళ్ళ అభివృద్ధి కేంద్రాలు, 4 జిల్లా స్థాయి కోళ్ళ పెంపకం క్షేత్రాలు, 9 క్లినికల్ లేబరేటరీలు, 16 గొర్రెలు, ఉన్ని అభివృద్ధి కేంద్రాలు, ఒక గొర్రెల సంరక్షణ కేంద్రం. ఒక గోసదనమూ ఏర్పాటు చేయబడినవి. మత్స్య పరిశ్రమ విషయంలో 3971 లక్షల చిన్న చేపలు (ఫింగర్ లింగ్స్) సేకరించి పంచడం జరిగింది. పడవలకు యంత్రం ఏర్పాటుకై 70 ఇంజన్లు కొన్నారు. 12 మత్స్య పరిశ్రమ క్షేత్రాలు ఏర్పాటు చేయబడినవి ఒక కోల్డ్ స్టోరేజి యంత్రం ఏర్పాటైంది. 30024 పౌనుల నైలాన్ వలలు మత్స్య పారిశ్రామికులకు సమకూర్చబడినవి. చేపలు లభ్యమయ్యే ప్రాంతాల నుండి వినియోగ ప్రాంతాలకు త్వరితగతిలో సరఫరా చేయటానికి మూడు వ్యాన్లు కొనటం కూడా జరిగింది. అడవులకు సంబంధించిన 6 డివిజన్లలో నిర్వహణ పథకాలు అమలుపరచబడినవి. 10 164 యకరాలలో అడవులను పెంచే కార్యక్రమం, 13196 యకరాలలో అడవులను అభివృద్ధి పరచే కార్యక్రమం అమలు జరిగింది. మారుమూల అడవి ప్రాంతాలలోని ఆటవీ సంపదను కూడా అందుబాటులోనికి తెచ్చుకోటానికి అరణ్య ప్రాంతాలలో 335 మైళ్ళ పొడవున రోడ్ల నిర్మాణం జరిగింది. 1959_60 సంవత్సరాంతానికి తేలిక రకం చెక్క లభ్యమయ్యే చెట్ల రకాలు, యింకా యితర రకాలు 3297 యకరాల విస్తీర్ణంలో పెంచబడినవి.

సహకారోద్యమం కూడా యీ కాలంలో బాగా బలపడింది సాంఘిక విప్లవ లక్ష్యాన్ని సాధించడానికే కాక, అధికోత్పత్తి లక్ష్యానికి కూడా అనుగుణంగా, వ్యవసాయదారులకు స్వల్పకాలిక, మధ్యతరహా పరపతి సౌకర్యాలు కల్పించబడినవి. 1959-60 చివరకు దీర్ఘకాలిక ఋణాలతో సహా మొత్తం రు. 24.10 కోట్లు అప్పులు యివ్వబడినవి.

సమాజాభివృద్ధి కార్యక్రమం మన రాష్ట్రంలో యిప్పుడు 304 బ్లాకులలో అమలు జరుగుతున్నది. 68,269 చదరపు మైళ్ళ విస్తీర్ణంలో 19505 గ్రామాలలోని 198 67 లక్షల జనాభాకు పరివ్యాప్తమై యిదొక మహోద్యమంగా కొనసాగుతున్నది. గ్రామస్థాయిలో పంచాయతీ, బ్లాకుస్థాయిలో సమితి, జిల్లా స్థాయిలో పరిషత్ అనే మూడు విభాగాలుగా చేసి బ్లాకుల నిర్వహణ వ్యవస్థ వికేంద్రీకరించబడింది. పంచాయతీ, పంచాయతీ సమితి, జిల్లా పరిషత్తు చట్టబద్ధంగా ఏర్పడిన సంస్థలు, 1959 సంవత్సరపు జిల్లా పరిషత్తులు, పంచాయతీ సమితుల చట్టం క్రింద యివి ఏర్పడినవి

సేద్యపు నీటి పారుదల

భారతదేశంలోని బహుళార్థసాధక ప్రాజెక్టులలో అత్యంత ప్రధానమైన నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ కార్యక్రమం చురుకుగా సాగుతున్నది. నాగార్జునసాగర్ కుడికాలువ ప్రపంచంలోని సేద్యపు నీటి పారుదల కాలువలన్నింటిలోకీ పెద్దది. ఈ ప్రాజెక్టు నిర్మాణ కార్యక్రమం అనుకున్న దానికంటే ముందుగానే ఆయా విభాగాలలో పని పూర్తి చేసుకుంటూ నిరాటంకంగా జరుగుతున్నది. ఇంకా యితర పెద్ద

ప్రాజెక్టులు, మధ్య తరహా ప్రాజెక్టులలో కూడా సంతృప్తి కరంగా పని జరుగుతున్నది. 1959–60 సంవత్సరాంతానికి అదనంగా 4.34 లక్షల యకరాలకు సేద్యపు నీటి పారుదల సౌకర్యాలు లభించాయి. ఈ రంగంలో ద్వితీయ ప్రణాళికలో పేర్కొన్న లక్ష్యం 6.40 లక్షల యకరాలు.

విద్యుచ్ఛక్తి

ద్వితీయ ప్రణాళిక క్రింద అమలు పరిచిన వివిధ విద్యుచ్ఛక్తి పథకాల ఫలితంగా ప్రణాళిక చివరి కాలానికి 1,29,570 కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి అవకాశం లభిస్తుంది పైగా ప్రణాళిక ప్రారంభంలో 7 యూనిట్లు అయిన తలసరి సగటు వినియోగం 15 యూనిట్లకు పెరుగుతుంది. ప్రణాళికలో పట్టణాలు, 28,800 కి.వా. మాచ్ ఖండ్ జల విద్యుత్పథకం క్రింద గ్రామాలు కలిసి 1027 చోట్ల విద్యుచ్ఛక్తి సప్లయి జరగాలని నిర్దేశించబడింది. ఈ లక్ష్యాన్ని మించి యిప్పటికే 1719 గ్రామాలు, పట్టణాలకు విద్యుచ్ఛక్తి సరఫరా ఏర్పాట్లు చేయడం జరిగింది. రామగుండం థర్మల్ పథకం క్రింద 37500 కి. వా, తుంగభద్ర జల విద్యుత్పథకం క్రింద 56,527 కి. వా విద్యుదుత్పత్తి లక్ష్యంగా పేర్కొని ఉండగా, యీ లక్ష్యం ప్రణాళిక మొదటి 4 సంవత్సరాల కాలంలోనే సాధించుకోగలిగాం.

పరిశ్రమలు

గూడూరులోని ప్రభుత్వ పింగాణీ ప్యాక్టరీకి అదనపు భవనాలు, సొరంగపు ఆవము నిర్మాణం పూర్తి అయింది, త్వరలోనే యీ ఫ్యాక్టరీలో ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమం రాష్ట్రంలోని పెద్ద, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి పథకం క్రింద నిర్వహించబడింది. రాజమండ్రిలోని ఆంధ్రా పేపర్ మిల్లును అభివృద్ధి చేయటానికి అవసరమైన యంత్ర సామగ్రిని రూపాయలలో చెల్లించే పద్ధతిపై తెప్పించటానికి ప్రయత్నం జరుగుతున్నది ఈ మిల్లు ఉత్పత్తి శక్తి రోజుకు 10 టన్నుల నుండి 50 టన్నులకు పెంచబడుతుంది. చోడవరం ఆముదాల వలస, పాలకొల్లు, చిత్తూరులలో సహకార పద్ధతిపై పంచదార ఫ్యాక్టరీలు నెలకొల్పటానికి. షేరు ధనం క్రింద ప్రభుత్వం రు. 48 లక్షలు పెట్టుబడి పెట్టింది. మొదటి రెండు ఫ్యాక్టరీలలో త్వరలోనే ఉత్పత్తి ప్రారంభమవుతుంది.

ప్రణాళిక మొదటి నాలుగు సంవత్సరాలకాలంలో కొత్తగా 250 మైళ్ల రోడ్లు వేయడం, 213 మైళ్ళమేర రోడ్లకు సిమెంటు కాంక్రీటు చేయడం, 365½ మైళ్లమేర రోడ్ల మీదదుమ్ము నివారించే కార్యక్రమం జరిగింది. జిల్లా బోర్డులకు సంబంధించిన 978 మైళ్ల రోడ్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని మరమ్మతులు చేసింది. వీటిలో వ్యవసాయపు ఉత్పత్తికి తోడ్పడగల రోడ్లకు అధిక ప్రాధాన్యమిచ్చి అభివృద్ధి చేయడం జరిగింది. రోడ్డు రవాణా సౌకర్యాలకోసం కోటి రూపాయల ఖర్చుతో 200 బస్సులు కొని వాటిని కృష్ణా జిల్లాలో రోడ్డు రవాణా జాతీయీకరణ పథకం క్రింద నడుపుతున్నారు.

సాంఘిక సేవా కార్యక్రమాలు

ద్వితీయ ప్రణాళిక క్రింద విద్యా రంగంలో చెప్పుకోదగిన అభివృద్ధి జరిగింది. నాలుగవ సంవత్సరాంతానికి 2864 ప్రాథమిక పాఠశాలలు, 369 మాధ్యమిక పాఠశాలలు, 258 ఉన్నత పాఠశాలలు, 397 జూనియర్ బేసిక్ పాఠశాలలు ఏర్పాటైనవి. సాంకేతిక విద్యారంగంలో ఒక ఇంజనీరింగ్ కళాశాల, 9 పాలిటెక్నిక్ పాఠశాలలు నెలకొల్పబడినవి, ద్వితీయ ప్రణాళికలో నిర్దేశించిన ప్రకారం, ప్రణాళికాంతానికి 1320 మంది ఇంజనీరింగ్ పట్టభద్రులనూ, 5110 మంది డిప్లొమా హోల్డర్లను మనం తయారు చేసుకోవలసివుంది. దానికి గాను 830 మంది పట్టభద్రులనూ 3650 మంది డిప్లొమా పొందినవారినీ తయారు చేసుకునే శక్తి మనకు మొదటి నాలుగు సంవత్సరాల్లో లభించింది చేతి వృత్తుల పని వారి శిక్షణ సంస్థలు మూడు ఏర్పాటు చేయబడినవి. నాలుగవ సంవత్సరం చివరకు 5121 మందికి శిక్షణ యివ్వబడింది. ప్రణాళికలో ఉద్దేశించిన సంఖ్య 7828.

ప్రజల ఆరోగ్యం, ముఖ్యంగా గ్రామ సీమలలో ఆరోగ్య సౌకర్యాల అభివృద్ధికి అత్యంత ప్రాముఖ్యమివ్వబడింది, రోగనివారణలోగాని చికిత్సలోగాని గ్రామీణ ప్రజలకు చెప్పుకోదగిన ఆరోగ్య సౌకర్యాలు లేనందున ఆ ప్రాంతాలలో ఆసుపత్రులలో చికిత్సా సౌకర్యాల అభివృద్ధి ప్రధానమైంది. జనరల్ ఆసుపత్రులలో వివిధ ప్రత్యేక విభాగాల ఏర్పాటు, లోకల్ ఫండ్ ఆసుపత్రులను స్వాధీనం చేసుకోవడం, 132 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాపన,

పంటి రోగాలు, ముఖరోగాలు, నేత్ర రోగాలు, చెవి, ముక్కు, గొంతు వ్యాధులు, క్షయ, కుష్టు, కుటుంబ నియంత్రణ మొదలగు వాటికిగాను 116 వైద్య కేంద్రాలు ఏర్పాటు చేయబడినవి. ఆసుపత్రులలో అదనంగా 1551 పడకలు ఏర్పాటు చేయబడినవి. నాలుగు కేంద్రాలలో అంటు వ్యాధుల ఆసుపత్రులు నిర్మించబడుతున్నవి. క్షయ రోగులను వేరుగా వుంచటానికి వివిధ ఆసుపత్రులు, వైద్యశాలలలో 695 పడకలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడినవి. ప్రణాళిక మొదటి నాలుగు సంవత్సరాలకాలంతో వైద్య కళాశాల అభివృద్ధి, వాటికి అనుబంధంగా బోధనా సంస్థల ఏర్పాటు నిరాఘాటంగా సాగిపోయింది. ఏటేటా యీ సంస్థలలో చేర్చుకునే విద్యార్థుల సంఖ్య 290 నుండి 530 వరకు పెరిగింది. ప్రైవేటు యాజమాన్యంలో యింకా రెండు వైద్య కళాశాలలు ఏర్పాటు కావడానికి సౌకర్యాలు కల్పించబడినవి. వీటిలో ఒక్కొక్క దానిలో వంద మంది విద్యార్థులు చేరే అవకాశం వుంటుంది. ఒక నర్సింగ్ కళాశాల కూడా ప్రారంభించబడింది. దీనిలో బి. ఎస్. సి. డిగ్రీ వరకు కూడా విద్యాభ్యాసానికి వసతులు వున్నవి. 20 మంది శిక్షణ పొంద వచ్చు. బి. డి. యస్ డిగ్రీకి సంబంధించి పంటి శాస్త్ర విభాగం కూడా, 25 మందికి శిక్షణ సౌకర్యంతో ఏర్పాటు చేయబడింది. పోతే రోగ నిరోధ కార్యక్రమంలో 7 మలేరియా నివారణదళాలు, ఒక గ్రామీణ పారిశుద్ధ్య దళం, 6 బి.సి.జి. టీకాల బృందాలు, ఒక బోదకాలు వ్యాధి నివారణదళం ఏర్పాటు చేయబడినవి. ఇవి కాక 131 గ్రామీణ కుటుంబ చికిత్సా కేంద్రాలు, 4 ప్రదర్శన ప్రాజెక్టులు కూడా ఏర్పాటైనవి.

వెనుకబడిన వర్గాలు, షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు, శ్రామిక వర్గానికి సంబధించి గృహవసతి, యితర జీవితావసర సౌకర్యాలు, విద్యాభివృద్ధి ఏర్పాట్లలో కూడ సంతృప్తికరమైన అభివృద్ధి సాధించబడింది.

పోతే తృతీయ పంచవర్ష ప్రణాళికకు యిప్పుడు తుది రూపరేఖలు దిద్దటం జరుగుతున్నది. మన అధికార, అనధికార ప్రముఖుల ఆలోచనాత్మకమైన నిరంతర కృషివల్ల ఆచరణ యోగ్యమైన ప్రణాళిక మనం రూపొందించాము. ఈ కృషిలో రాష్ట్ర ప్రణాళిక సలహాసంఘం ప్రధాన పాత్ర వహించింది. వివిధ ప్రయోజనాలకు, అభిప్రాయాలకు ప్రతిబింబంగా వున్న యీ అనధికారసంస్థ ఆచరణ యోగ్యమైన ప్రణాళికను రూపొందించి ప్రభుత్వానికి అందించడంలో శ్లాఘనీయమైన కృషి చేసింది. మన రెండవ ప్రణాళిక ఖర్చు రూ. 176 కోట్లు అయితే తృతీయ ప్రణాళిక రూ. 482 కోట్ల అంచనాతో సిద్ధం చేయబడింది. మన రాష్ట్రపు కనీసావసరాల దృష్ట్యా యింత పెద్ద ప్రణాళిక నిస్సందేహంగా సమర్థనీయమే. ఇప్పటి అభివృద్ధిగమనం మందగిల కుండావుంచుకోవడమే కాదు, దాన్ని యింకా పెంచుకోవాలంటే యింత పెద్ద ప్రణాళిక అమలు జరుపకోవలసిందే. అయినప్పటికీ, మన రాష్ట్రంలో మనం సాధించుకోగలిగిన ఆర్థిక వనరుల దృష్ట్యానైతేనేమి కేంద్ర ప్రభుత్వంనుండి లభించే సహాయపు పరిమితి దృష్ట్యానేమి, అన్ని రాష్ట్రాలకు కలసి రూ. 3650 కోట్ల పరిమితిలో ప్రణాళికలు రూపొందాలనే నిర్ణయం దృష్ట్యానేమి, మన ప్రణాళికను కొంతవరకు తగ్గించుకోవడం అవసరం కావచ్చు.

రూ. 482 కోట్ల ఖర్చుతో మన రాష్ట్రానికి సిద్ధం చేసుకున్నతృతీయ ప్రణాళికలోని ప్రధానాంశాలను స్థూలంగా పరిశీలిద్దాం, ఇందులో కూడా దాదాపు ద్వితీయ ప్రణాళికలో మనం అమలు పరచుకున్న ప్రాధాన్య క్రమాన్నే అనుసరించాం. మనది ప్రధానంగా వ్యవసాయ రాష్ట్రమైనందున యీ పద్ధతి అనుసరించక తప్పదు, ఈ రు 482 కోట్లకుగాను వ్యవసాయ పథకాలకు రు. 108 కోట్లు, నీటి పారుదల, విద్యుచ్ఛక్తి పథకాలకు రు. 210 కోట్లు, పారిశ్రామిక, ఖనిజాభివృద్ధి కార్యక్రమాలకు రు. 45 కోట్లు, రవాణాకు రు 26 కోట్లు, సాంఘిక సేవా కార్యక్రమాలకు రు 93 కోట్లు కేటాయింపు జరిగింది. రెండవ ప్రణాళిక చివరకు మన ఆహారోత్పత్తి స్థాయి 71 లక్షలు టన్నులవుతుంది. దీనిని మూడవ ప్రణాళికలో 98 లక్షల టన్నులకు పెంచాలని సంకల్పం. గ్రామీణ విద్యుచ్ఛక్తి సదుపాయాలు, లిఫ్ట్‌యిరిగేషన్ పథకాల ద్వారా వ్యవసాయ, నీటి పారుదల కార్యక్రమాలకు ప్రయోజనం సిద్ధించడమే కాక. తృతీయ ప్రణాళికలో ఉద్దేశించిన విద్యుత్పథకాల వల్ల పారిశ్రామికాభివృద్ధికి కూడా విద్యుచ్ఛక్తి చవుకగానూ, పుష్కలంగానూ లభిస్తుంది. విద్యుత్పథకాల మీది రు 90 కోట్లు అంటే మొత్తం ప్రణాళికలో 18.74 శాతం వెచ్చించడం జరుగుతుంది.

(మిగతా 30 వ పేజీలో)

ద్వితీయ ప్రణాళికనుంచి తృతీయ ప్రణాళికకు

— పి. రంగారెడ్డి

మన ద్వితీయ పంచవర్ష ప్రణాళిక సమాప్తం కావస్తున్నది. ప్రణాళికలు నిరంతరాయమైనవి. మన ఆశయమైన సోషలిస్టు పరిపాలనను నెలకొల్పే వరకు మనకు విశ్రాంతి అనేదిలేదు. కాబట్టి ప్రతి రాష్ట్రము ఒక పంచవర్ష ప్రణాళిక నుంచి మరొక పంచవర్ష ప్రణాళికలో అడుగు పెట్టి, గతానుభవాల దృష్ట్యా, అభివృద్ధి తరువాత దశకు కృషి ప్రారంభిస్తుంది; అంతకు ముందు సాధించిన ఫలితాలను పటిష్ఠం చేసుకొంటుంది. తొలి, మలి, పంచవర్ష ప్రణాళికల కాలంలో అమలు జరిగిన పథకాల విజయం ఆధారంగా మన తృతీయ ప్రణాళిక పరిమాణం, స్వభావం నిర్ణయించబడుతున్నవి. దీనిని మనం వచ్చే సంవత్సరం చేపట్ట వలసి ఉంది.

ఇప్పుడు ద్వితీయ ప్రణాళిక ఆఖరు సంవత్సరం జరుగుతున్నది. ఆంధ్ర, తెలంగాణాలలో తెలుగు మాట్లాడే ప్రజల విలీనీకరణ వల్ల ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం యేర్పడిన కొత్తలో కొన్ని చిక్కులు యెదురైనప్పటికీ పథకాలను విజయవంతంగా క్రమాభివృద్ధిలో నడపగలిగాం. మొత్తం ప్రణాళికా కాలానికి ఉద్దేశించబడిన రూ 175.74 కోట్లలోను రూ 135.80 కోట్లు తొలి నాలుగు సంవత్సరాలలోను వ్యయమైనవని అంచనా. ఆఖరి సంవత్సరంలో యింక రూ 40 కోట్లను మాత్రమే ఖర్చు పెట్టవలసి ఉంది.

వ్యవసాయం

ప్రణాళికలో వ్యావసాయిక కార్యక్రమాలకు అగ్రస్థానం యివ్వబడింది ఆంధ్ర ప్రదేశ్ యిప్పటికే దక్షిణాదికి ధాన్యాగారమనే పేరు పొందింది. అది లోటు రాష్ట్రాలకు సదా ఆహారాన్ని సరఫరా చేస్తున్నది. ఈ పరిస్థితిని నిలిపి వుంచేందుకే కాక యింకా అభివృద్ధి పరచేందుకు కూడా ప్రయత్నం జరిపాం. ప్రణాళిక నాలుగవ సంవత్సరం ఆఖరు నాటికి రాష్ట్రంలో అదనంగా 10.94 లక్షల టన్నుల ఆహారం ఉత్పత్తి కాగలదని భావించబడుతున్నది. ఈ విధంగా, ద్వితీయ ప్రణాళిక లక్ష్యమైన 16.43 లక్షల టన్నులను సాధించేందుకు యింకా 5.49 లక్షల టన్నులను పండించాలి. నాలుగవ సంవత్సరం ఆఖరు నాటికి 447 విత్తనాల క్షేత్రాలు, 881 విత్తనాల కొట్లు నిర్మింప బడగలవని భావించ బడుతున్నది "భూమి అభివృద్ధి" క్రింద దాదాపు 160 ట్రాక్టర్లు పంపిణీ చేయబడవచ్చు; ప్రభుత్వ శాఖ 5 బుల్‌డోజర్లను సంపాదించాలని సంకల్పం. ఆయిల్ ఇంజన్లు, ఎలక్ట్రిక్ మోటార్ల విషయంలో ప్రణాళికా లక్ష్యం వరుసగా 1,068,710 అయి ఉన్నది. 'చిన్న నీటి పారుదల' పథకాల క్రింద, నాలుగవ సంవత్సరం ఆఖరు నాటికి మొత్తం దాదాపు 2.13 లక్షల యెకరాలకు నీటి పారుదల లభించవచ్చు. ప్రణాళికా కాలంలోని నాలుగు సంవత్సరాలు పూర్తి అయేసరికి 35 వెటరినరీ డిస్పెన్సరీలు, 60 చిన్న వెటరినరీ డిస్పెన్సరీలు, 15 టూరింగ్ బిల్లెట్లు, 66 పశువుల ప్రథమ చికిత్సా కేంద్రాలు, 26 కీలక గ్రామ కేంద్రాలు. 22 కోళ్ల పోషణ విస్తరణ కేంద్రాలు. 4 జిల్లా కోళ్ల పోషక కేంద్రాలు, 9 క్లినికల్ లేబొరేటరీలు 16 గొర్రె, ఉన్ని విస్తరణ కేంద్రాలు, ఒక గొర్రెల పెంపకం కేంద్రం, ఒక గోసదనం నెలకొల్పబడాలి. ప్రణాళిక నాలుగవ సంవత్సరం ఆఖరు నాటికి 397 లక్షల చేపలు సేకరించ బడతాయి, బోట్ల నిమిత్తం 7[illegible] ఇంజన్లు కొన బడతాయి 30,024 పౌన్ల నైలాన్ పంపిణీ చేయబడుతుంది. 12 మత్స్య పోషక కేంద్రాలు ఒక చలువ కొట్టు

నెలకొల్ప బడతాయి. రేవుల నుంచి వినియోగ కేంద్రాలకు చేపల శీఘ్ర రవాణాకై 3 వ్యాన్లు కొనబడతాయి. సహకారం, సరుకుల నిల్వ, విక్రయ సౌకర్యాల క్రింద, ద్వితీయ ప్రణాళిక నాలుగవ సంవత్సరాంతానికి 548 పెద్ద రకం పరపతి సంఘాలు, 4168 చిన్నరకం సంఘాలు ఏర్పడవచ్చు. 3000 సంఘాలు బలపరచబడవచ్చు. 75 పరపతి యూనియన్లు. 179 ప్రాథమిక విక్రయ సంఘాలు. 96 కొత్త భూమి తనఖా బ్యాంకులు. 25 సహకార వ్యవసాయ సంఘాలు, ఏర్పడవచ్చు. ఇవి కాక, 2491 మంది సర్కారు నేటు ఆఫీసర్లకు శిక్షణ. 36 275 మంది సభ్యులకు బోధన జరుప బడవచ్చు. 1959–60 అంతానికి స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘ కాలిక ఋణాల క్రింద రూ 24.10 కోట్లు యివ్వబడవచ్చు.

నీటి పారుదల, విద్యుచ్ఛక్తి

గ్రామీణ జీవిత పరిస్థితుల అభివృద్ధికై నీటి పారుదల. విద్యుచ్ఛక్తి రంగాలలో శీఘ్రాభివృద్ధి అవసరమని భావించబడుతున్నది కాబట్టి శీఘ్ర ఫలితాలను ఇచ్చే పథకాలు, దీర్ఘకాలిక పథకాలూ కూడా చేపట్టబడుతున్నవి. నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఆనకట్ట పని కాలువ పని కూడా చురుగ్గా జరుగుతున్నవి. ఇందు నిమిత్తం ద్వితీయ ప్రణాళికలో కేటాయించబడిన రూ 32.30 కోట్లలోను అప్పుడే రూ 27 కోట్లు ఖర్చు అయినవి ప్రణాళిక ఆఖరు సంవత్సరంలో రూ. 9 కోట్లు ఖర్చు చేయాలని సంకల్పం. తైరవాని తిప్ప ప్రాజెక్టుపని, కృష్ణా బారేజ్ 70 గేట్ల స్థాపనపని కూడా యీ సంవత్సరం పూర్తి కావలసి ఉన్నవి. తుంగభద్ర ఎగువ కాలువ మొదటి అంచె పథకం అమలు జరుగుతున్నది. దీని క్రింద మైసూరులో 68 వేల యెకరాలకు, ఆంధ్ర ప్రదేశ్‌లో లక్ష 19 వేల 150 యెకరాలకు నీటి పారుదల లభిస్తుంది. మధ్య పెన్నారు జలాశయం కట్టడం పని ఆరంభమైంది. దక్షిణ, ఉత్తర కాలువ పని సంతృప్తికరంగా జరుగుతున్నది. పోచంపాడు ప్రాజెక్టు పని త్వరలోనే ఆరంభమవుతుంది. దీనికి రూ. 15 కోట్లు ఖర్చు కాగలదని అంచనా. దీని క్రింద మొదట 3 లక్షల 60 వేల యెకరాలకు నీటి పారుదల లభిస్తుంది పెక్కు మధ్య రకం ప్రాజెక్టులపని వివిధ ఘట్టాలలో కొనసాగుతున్నది. కర్నూలు–కడప కాలువ అభివృద్ధి పని పూర్తి అయింది. దానిలో యిప్పుడు ఎక్కువ నీరు–3,000 క్యూసెక్కులు–ప్రవహిస్తున్నది. అయితే, యీ మధ్య రకం పథకాలు ద్వితీయ ప్రణాళిక కాలంలో పూర్తికావు. వీటిని తృతీయ ప్రణాళిక కాలంలో పూర్తి చేయాలి. ఇందుకు రూ. 538 లక్షలు కావాలి

విద్యుచ్ఛక్తి ప్రాజెక్టులకు 1960-61లో రూ 359.84 లక్షలు ఖర్చు కాగలవు. ఇందులో ఎక్కువ ముఖ్యమైన వాటిలో ఎగువ సీలేరు పథకం ఒకటి. దీని క్రింద, మొదటి అంచెలో ఒక్కొక్కటి 60 వేల కిలోవాట్ల శక్తిగల రెండు యూనిట్ల స్థాపన ద్వారా సీలేరు నది యెగువన విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేయ బడుతుంది. ఈ పథకం విపుల పరిశోధన పూర్తి అయింది. శిబిరాలు, రాకపోకల సౌకర్యాలు మున్నగు వాటికి సంబంధించిన ప్రాథమిక పనులు జరుగు తున్నవి. ఇటీవల ఆంధ్ర ప్రదేశ్, ఒరిస్సా ప్రభుత్వాల మధ్య జరిగిన ఒప్పందం ఫలితంగా ప్రధాన పనులను పూర్తిగా చేపట్టాలని సంకల్పించ బడింది. శ్రీశైలం జల విద్యుచ్ఛక్తి పథకాన్ని తృతీయ ప్రణాళికలో చేర్చాలని సంకల్పించబడింది అయితే, రోడ్లు, శిబిరాలు మున్నగువాటికై దీనికి రూ. 15 లక్షలు కేటాయించటానికి అంగీకరించ బడింది.

పారిశ్రామిక రంగం

ఇతర పెద్ద రాష్ట్రాలను అందుకుందుకు ఆంధ్ర ప్రదేశ్ పరిశ్రమలు ముఖ్యంగా భారీ పరిశ్రమల రంగంలో తగినంత అభివృద్ధిని సాధించవలసి ఉంది. అట్టి పారిశ్రామికీకరణ విషయంలో, రాష్ట్ర విధానం ప్రభుత్వ విభాగం విస్తరణకు, సహకార రూపంలో యూనిట్ల నిర్మాణానికి ప్రాధాన్యత యిచ్చినది. రాష్ట్రంలో భారీ, మధ్యరకం పరిశ్రమల అభివృద్ధి ప్రణాళిక క్రింద, రాజమండ్రీలోని ఆంధ్ర కాగితం మిల్లుల శక్తిని రోజుకు 10 టన్నుల నుంచి 50 టన్నులకు పెంచాలని సంకల్పించబడింది. గూడూరులోని ప్రభుత్వ పింగాణీ ఫ్యాక్టరీ విస్తరణ పూర్తి అయినది. ఆ యూనిట్ల పని ప్రారంభించటానికి సిద్ధంగా ఉంది. చోడవరం ఆముదాలవలస, పాలకొల్లు, చిత్తూరులలో 4 సహకార పంచదార ఫ్యాక్టరీల స్థాపనలో ప్రభుత్వ వాటాగా రూ. 48.00 లక్షలు యివ్వబడినవి. కేంద్ర ప్రభుత్వం చేసిన యేర్పాట్ల ప్రకారం, చోడవరం, ఆముదాలవలసల

లోని రెండు ఫ్యాక్టరీలకు 1959-60లో ప్లాన్. యంత్రాలూ సరఫరా చేయబడతాయి. "చిన్న పరిశ్రమలు, గ్రామ పరిశ్రమల" క్రింద సనత్ నగరం, విశాఖపట్నం, విజయవాడ, సామర్లకోట, వరంగల్లు, నంద్యాలలో పారిశ్రామిక కేంద్రాలు నెలకొల్పబడినవి. శిక్షణ-ఉత్పత్తి కేంద్రాలు కూడా నెలకొల్పబడినవి ఇక్కడ కమ్మరం, వడ్రంగం, ఫౌండ్రీ. శాస్త్రీయ గాజుపరికరాలు, పాదరక్షలు, రాతి సామగ్రి. కొయ్య సామగ్రుల తయారీ మున్నగు వాటిలో శిక్షణ యివ్వబడుతుంది. ప్రణాళిక నాలుగవ సంవత్సరాంతానికి 1390 మంది అభ్యర్థులకు శిక్షణ యివ్వబడవచ్చు.

రోడ్డు రవాణా జాతీయాకరణ

రోడ్డు రవాణా అంచెలవారీగా జాతీయం చేయబడుతున్నది. ఒక కోటి రూపాయలతో దాదాపు 200 బస్సులు కొనబడినవి. ఇవి కృష్ణా జిల్లాలో రోడ్డు రవాణా జాతీయకరణకు వినియోగించబడినవి. ప్రభుత్వం 1050 మైళ్ల జిల్లా బోర్డు రోడ్లను తీసుకోవాలని ప్రణాళికలో లక్ష్యమేర్పరచగా యిప్పటికే 978 మైళ్లు తీసుకోబడినవి. ఈ రోడ్లు అభివృద్ధి పరచబడుతున్నవి కూడా. వీటిలో వ్యవసాయోత్పత్తికి దోహదం చేసే వాటికి ముందు ప్రధాన్యత యివ్వబడుతున్నది.

"విద్యా కార్యక్రమం" క్రింద ద్వితీయ ప్రణాళిక నాలుగవ సంవత్సరాంతానికి 2864 ప్రాథమిక పాఠశాలలు 369 మాధ్యమిక పాఠశాలలు, 258 ఉన్నతపాఠశాలలు, 397జూనియర్ బేసిక్ స్కూళ్ళు తెరువబడినవి. సాంకేతిక విద్యా కార్యక్రమం క్రింద, ఒక ఇంజనీరింగ్ కళాశాల, 9 పాలీటెక్నిక్‌లు తెరువబడినవి. ప్రణాళిక నాలుగవ సంవత్సరాంతానికి 830 మంది ఇంజనీరింగ్ పట్టభద్రులు, 3650 మంది డిప్లమోదారులు తయారు కాగలరు

వివిధ ఆస్పత్రుల పడకల సంఖ్య 1551 కి హెచ్చించబడింది. 132 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు. దంత వైద్య సుఖ వ్యాధి నివారణ, కన్ను. చెవి. ముక్కు, గొంతు, క్షయ, కుష్ఠు, కుటుంబ నియంత్రణల వంటి క్లినిక్కులు 116 నెలకొల్పబడినవి. వైద్య కళాశాలల్లో ఏటా చేర్చుకొనే విద్యార్థుల సంఖ్య 290 నుంచి 530 కి హెచ్చించబడింది. ప్రైవేటు మానేజిమెంట్ల క్రింద మరి రెండు వైద్య కళాశాలల—ఒక్కొక్క దానిలో నూరు మందిని చేర్చుకొనే అవకాశంతో—ప్రారంభానికి సౌకర్యం కల్పించబడింది. బి. ఎస్. సి. డిగ్రీ కోర్సుకి దారితీసే నర్సుల కళాశాల ఒకటి తెరువబడింది, ఇందులో 20మంది చేర్చుకోబడతారు. గృహవసతి కార్యక్రమంక్రింద, సబ్సిడైజ్డు పారిశ్రామిక సహకార గృహవసతి పథకం త రా. వ గృ. పథకం వగైరాల క్రింద 6,570 గృహాల నిర్మాణం పూర్తికాగలదు.

ఈ సంవత్సరంలో మరి పది సహకార వ్యవసాయ సంఘాలు ఏర్పాటు చేయబడతాయి. ఇతర సహకార పథకాల క్రింద వెయ్యి కొత్త గ్రామ సంఘాలు. పది కొత్త ప్రాథమిక భూమి తనఖా బ్యాంకులు ఏర్పాటు చేయబడతాయి. 100 శాతం గ్రామాలు, 45 శాతం గ్రామీణ కుటుంబాలు సహకార వ్యవసాయ పరపతి సంఘాల పరిధిలోనికి తీసుక రాబడగలవు. 1959—60 అంతానికి గ్రామాలలో 5120 కమ్యూనిటీ రేడియో సెట్లు నెలకొల్పబడవచ్చు. ద్వితీయ ప్రణాళికను గురించి ప్రజా బాహుళ్యానికి తెలియపరచేందుకై ప్రచార కార్యక్రమాలు ఏర్పాటు చేయబడినవి. ఇందు నిమిత్తం సంచార వ్యాన్‌లు, ప్రణాళికా కార్యకలాపాలకు సంబంధించిన డాక్యుమెంటరీలు వుపయోగించబడినవి. ప్రదర్శనలు. సాంస్కృతిక కార్యక్రమాలు జరుపబడినవి. పుస్తకాలు ప్రచురించబడినవి. సమాచార కేంద్రాలు నెలకొల్పబడినవి.

ఈ ఫలితాలను చూసి ప్రణాళిక ప్రధాన లక్ష్యం హెచ్చు భౌతిక సంపద సాధన అని పొరపడతారు. భారతదేశంలో ప్రణాళికలు ఏదో ఒక విధంగా భౌతిక సంపదభివృద్ధిని లక్షించవు. వాటిదృష్టిలో సాంఘిక ఆశయాలు. ఉపయోగించే సాధనాలు కూడా ముఖ్యమైనవే. ప్రజా బాహుళ్యం ఉత్తమంగా వివేకంగా జీవించటానికనువైన వాతావరణం సృష్టి వాటి ఆశయం. కాబట్టి, యీ విషయంలో, సాధ్యమైన అన్ని స్థాయిలలోను వాస్తవమైన ప్రజాస్వామ్య పద్ధతులు అవలంబించబడి తద్వారా మానవ గౌరవానికి అనుగుణంగా స్వేచ్ఛాయుతమైన పరిస్థితులలో అందరూ పరిపూర్ణ జీవితాన్ని నడిపేందుకు అవకాశం కల్పించబడుతుంది.

భావి చక్రవర్తులు

(కదంబము)

— తుమ్మల సీతారామమూర్తి

సైఁపఁజాల నేఁటిసంఘవ్యవస్థ; నీ
యవని రామరాజ్య మమరవలయు
నపుడు రాజు రాముఁ, డఖిలప్రజాళియు
రాముఁ, డుర్వియెల్ల రామమయమె

దొంగతనమువంటి దోసమహో! సిరిన్
గూడఁబెట్టి దాఁచుకొనుటసైత;
మిది యకృత్య మనుచు నిపుడు గాకున్న రే
పైన లోక మొప్పు నని తలంతు

అడుగు మని నన్నుఁ బ్రేరేచినట్టివేల్పె
యి మ్మనుచు నన్యుఁ బురికొల్ప కేలమాను?
బిడ్డ కాఁకలిపెట్టిన దొడ్డదేవుఁ
డమ్మ రొమ్మున నూరింపఁడా పయస్సు?

ఈపేదలు పసిపేల్పులు,
పాపము! వీ రెండ తడిసి వస్తుంది జగం
బాపోవఁ గూడుపెట్టెద;
రోపికలో వీరి కుద్ది యుండర యెవరున్

పిల్లలు రక్షించెద రని
తల్లి ప్రతీక్షించు నవ్విధమ్మున మీపై
నుల్లము నిలుపౌని కాలము
చెల్లింతురు వీరు; జాగు సేయకుఁడు దొరల్!

తడసిన మీదోసము వే
మడుఁగు లగున్ విలయవహ్ని మార్కొను మిమ్మున్
నడిచి నడిచి వచ్చితి మీ
యెడఁదన్ నిదురించునీశు హెచ్చరికింపన్

బాపు లేమి నిపుడు బయటికి వచ్చితి
నేతఁ గాను మీకు నేను భటుఁడ
మ్రొక్కుచుంటి భక్తిముగ్ధుఁడనై, గుణ
భద్రులార! మత్సపర్య గొనుఁడు

నిదురఁ గలి నుండు, సెజ్జను వదలి కూరు
చున్నచో ద్వాపరమ్మున నుండు నరుఁడు
నిలిచెనా త్రేత నుండు నజ్జిలు కదల్చి
త్రోవఁ జనువేళ నతఁ డుండుఁ దొలియుగాన

ప్రేమఁ బెరుఁగుఁ దెలివి పెరుఁగు నాయుష్యమ్ము
పెరుఁగుఁ బాదయాత్ర జరుపువేళ
నడువ కుండువాఁడు నలువదియేండ్లకే
తాత యౌను లేక ప్రేత యౌను

పదయాత్ర, శంకరాదుల
మది మెచ్చినయాత్ర, జనులమనముల కింపున్
గదియించుయాత్ర; దీనిని
వదలన్ భావప్రచార వరసాధనమున్

ఏనాఁ డపరిగ్రహమును
మానెన్ బాపఁడు, తదీయమహిమము సర్వం
బానాఁడె సమసెఁ; బ్రాజ్ఞుఁడు
కానీ కెగఁబడిననాఁడు కలఁచున్ బ్రజలన్

సుదతులు, శూద్రులు వేదము
చదువం జన దనెడిపల్కు సైఁపను; నాకున్
జదు రున్నది శ్రుతివిద్యన్;
మది యున్నది దీని నేర్పి మనుజులఁ దీర్పన్

దేవుఁడు కలఁ డని నమ్మక
పోవచ్చు నొకండు; వాఁడు భూతహితమ్మున్
భావించిన, సత్యముతో
జీవించినఁ జాలుఁ బెద్దచేసెద నతనిన్

నరున కున్నచేవ పరిమిత మౌటచే
నతని సేవ సైత మవధి నుండు
సేవ కెల్ల యుంట చెల్లును గాని, భా
వనకు మేర యుంట పనికిరాదు

ప్రజకెల్ల సేవచేయుట
నిజమునకు నసాధ్య; మైన నిఖిల ప్రజయున్
స్వజనంబ యని తలంచుచుఁ
ద్యజింపవలె నరుఁడు కులమతాదివివక్షన్

దేహమును గాను నేను సందీప్త మైన
యాత్మ నని నమ్మవలయు; దేహమ్ముపట్ల
నాదరము పుట్టినా వైర మవతరించు
ముక్కలై చెక్కలై యాత్మ ముప్పుదెచ్చు

మనకుఁ జేటుగూర్తురు ముసల్మాను లనుచు
హిందువులు జంకెదరు; గాని హిందువులకు
దోసఁగు దెచ్చెడువారు హిందువులు గాక
యన్యులందరు నమ్ముఁడా యస్మదుక్తి

కులమతభేదమ్ములపై
వల పుంచిన, వంటరానివాఁ డని యొకనిన్
వెలిపెట్టిన మనమే మన
విలయము సృష్టింతు; మొరులవెంపర యేలా?

వెలుపటిదెస మవశత్రులు
కలరా? మనయెడఁదయందె కల రుద్ధతులై;
యిల మనకున్ నెచ్చెలి కా
వలయు ననన్ జెలిమిఁ జూపవలె మన మిలకున్

ప్రేమశుకము కలదు మీమదిలో; దీనిఁ
బలుపకుఁడు కుటుంబపంజరమున
నిచ్చవచ్చినట్టు లిది రెక్క లాడింప
నిచట నచట సొగసు నియ్యకొనుఁడు

ఆంధ్ర ప్రదేశ్

ఏ నింతదనుక నౌకఖలు
నేని విలోకించి యెఱుఁగ; నిది విని లోక
జ్ఞానం బబ్బని మూర్ఖుని
గా నను మీ రెంతురేని గా దన నొల్లన్

నామ్రోల నెవఁడు నిల్చిన
నామానవునందు వేల్పె యగపడు నాకున్.
సామాన్యధర్మ మై చన
నామనుజున కంజలించు నస్మత్కారముల్

మన కహింస నియతమార్గ; మీబాటను
విడువ కుందుమేని పుడమినెల్ల
నెత్తఁగలము మన మహింసాపతాక; లీ
నుడువు లెడఁదఁ జీల్చి విడుచుచుంటి

ఏ నలంతివాఁడ; నైన నీశుఁడు బుద్ధ
దేవుపనికి నన్నుఁదెచ్చి నిలిపె
శాక్యముని పవిత్రచరణాంకముల నాశ్ర
యించి విధిని నిర్వహించువాఁడ

జలకణమ్ము వార్ధిఁ గలసి పయోధియై
యలరుచందమున నహంత విడిచి
నరుఁడు తన్నుఁ దాను మఱచి విశ్వాకారు
డై నవేల్పునందు నణఁగి వెలయు

చట్టములు కావు ఋషులే
పుట్టింతురు విప్లవమ్ము; బుద్ధుఁడు ప్రభుతా
పట్టమును రోసి కావిం
గట్టిగదా క్రాంతి దెచ్చెఁ గనుఁడీ చరితన్

ఘనకు సత్యనిరతి మప్పె రాఘవుఁడు, ని
ష్కామ కర్మనిష్ఠ గఱపెఁ గృష్ణుఁ,
డార్త లోక సేవ నలపరించెను బుద్ధుఁ ;
డీ త్రయమ్మె మనః సృష్టిచేసె

అభ్యుదయ పథంలో ఆంధ్ర ప్రదేశ్

(ఆంధ్ర ప్రదేశ్ గవర్నరు శ్రీ భీమసేన్ సచార్ 1960 జూన్ 22వ తేదీన ఉభయ సభల సమావేశంలో ప్రసంగిస్తూ ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను స్థాలీ పులాక న్యాయంగా సమీక్షించారు,

అసలుప్రతి ఆంగ్లంలో చదువ బోయే ముందు కొంచెము సేపు తెలుగు లోనూ తర్వాత హిందీ లోనూ ప్రసంగించటం ఒక విశేషం.)

గవర్నరు తమ ప్రసంగం ప్రారంభంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు సంతృప్తి కరంగా నిర్వహించబడుతున్నందుకూ, ప్రజలకూ పోలీసులకు మధ్య సుహృద్భావం నెల కొని వున్నందుకూ సంతోషం వెల్లడించారు

తెనుగు భాషలో పరిపాలన:

రాష్ట్ర పరిపాలన తెనుగులో జరగాలనేది ప్రజల చిరకాల వాంఛ. "మన రాజ్యంలో అధికార వ్యవహారాల నిమిత్తం తెనుగు భాషను ప్రవేశ పెట్టాలన్నది సర్వ సాధారణమైన అభిలాష" అని పేర్కొంటూ, అందుకై ప్రభుత్వం తీసుకున్న చర్యలను గవర్నరు వివరించారు.

"ఈ విషయాన్ని పరిశీలించే నిమిత్తం ప్రభుత్వం ఒక ప్రత్యేకాధికారిని నియమించింది. ఆయన సమర్పించిన నివేదకను పరిశీలించిన తర్వాత ప్రభుత్వ కార్యలయాల్లో క్రమ క్రమంగానూ, ఆచరణీయ యోగ్యమైన దశల వారీగాను రాజ్య ప్రధాన ప్రాంతీయ భాష అయిన తెలుగును ప్రవేశ పెట్టాలని నిర్ణయించడం జరిగింది. తదను గుణంగా, తొలి చర్యగా ఆంధ్ర ప్రాంతంలోని అన్ని జిల్లాల్లో, తెలంగాణా ప్రాంతంలో వరంగల్లు, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో, తాలూకా స్థాయిలోనూ, అంతకు దిగువ స్థాయిలోనుగల కార్యాలయాలలో ప్రజలతో జరిపే వ్యవహారాలు తెలుగు భాష ద్వారా జరగాలని ప్రభుత్వం యిటీవలనే ఉత్తర్వులు జారీ చేసింది. సుబోధకమైన పదజాలం లేక పోవడం, తెలుగు ముద్రా లేఖినులు లేక పోవడం, మొదలగు కొన్ని ఇబ్బందులు మనకు ఎదురవుతున్నవి. ఈ ఇబ్బందులను అధిగ మించటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది"

పరిపాలనా సంస్కరణల సంఘం:

ఈ యేడాది బడ్జెట్‌పై సాధారణ చర్చ జరిగిన సందర్భంలో ఆర్థిక మంత్రి ప్రకటించిన ప్రకారం, కార్యాలయాలలో కాల విలంబన తగ్గించి పనిని సులభంచేసే మార్గాలు సూచించడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షుడుగా పరిపాలనా సంస్కరణల సంఘం ఏర్పాటు చేయబడిందని గవర్నరు తమ ప్రసంగంలో పేర్కొన్నారు అవినీతి నిర్మూలన యంత్రాంగం సమర్ధ వంతంగా పని చేయడానికి దాన్ని పునర్వ్యవస్థీకరించుటకు కూడా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటున్నది దీని వలన, పరిపాలనా సంస్క-

రణల సంఘం వారి సూచనల వలన, మన రాష్ట్ర పరిపాలనా వ్యవస్థ మరింత పటిష్ఠం చేయబడగలదని గవర్నరు తమ విశ్వాసం వెలిబుచ్చారు.

ప్రణాళికా ప్రగతి గర్వకారణం:

ద్వితీయ పంచవర్ష ప్రణాళిక క్రింద రాష్ట్రంలో మొదటి నాలుగు సంవత్సరాలలో జరిగిన ఖర్చు వివరాలు పేర్కొంటూ, యీ మొత్తం ద్వితీయ ప్రణాళిక మొత్తం కేటాయింపులో 76.8 శాతం వుంటుందని, ఆయన ప్రకటించారు. వర్తమాన సంవత్సరంలో జరిగే ఖర్చు రు 44 కోట్లు. ద్వితీయ ప్రణాళిక ముగిసే సమయానికి వివిధ రంగాలలో ప్రణాళికా లక్ష్యాలను అధిగమించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ''రాజ్య పునర్వ్యవస్థీకరణ ఫలితంగా మొదట్లో ఎదురైన ఇబ్బందులు, విదేశ మారక ద్రవ్యం యొక్క తీవ్ర పరిస్థితి, అత్యావశ్యకమైన నిర్మాణ వస్తుపరికరాల యొక్క కొరత మొదలగు అవరోధాలు అనేకం వుండిన విషయాన్ని గుర్తుంచుకుంటే ఇంతవరకు సాధించిన విజయం మనకు గర్వకారణమే అవుతుంది. ఇప్పుడు తెలంగాణాలో అభివృద్ధి ప్రగతి బాగా హెచ్చి ఆంధ్ర ప్రాంతపు స్థాయిని అందుకొన్నది''

తృతీయ పంచవర్ష ప్రణాళిక;

సంవత్సరానికి నూటికి అయిదు చొంతున జాతీ యాదాయం పెంచడం, వ్యవసాయోత్పత్తిలో స్వయం సమృద్ధి, మౌలిక పరిశ్రమల స్థాపన, ఉద్యోగావకాశాలు, ఆదాయం, సంపదలో అసమానతల తగ్గింపు మొదలగునవి మూడవ ప్రణాళిక ముఖ్యోద్దేశాలు. ఈ పరిధిలో మూడవ ప్రణాళిక ముసాయిదా సిద్ధం చేసే కృషిలో రాష్ట్ర ప్రణాళికా సలహా సంఘాన్ని అఖిల పక్ష ప్రాతిపదికపై పునర్నిర్మించినట్లు, వివిధ ప్రత్యేక ప్రయోజనాలకు ప్రాతినిధ్యం కల్పించబడినట్లు గవర్నరు వివరించారు. మన రాష్ట్రానికి రు. 505.63 కోట్ల ప్రణాళిక రూపొందించబడింది. ఇది పెద్దదిగా కనిపించినా మన అవసరాల దృష్ట్యా సమర్థనీయమే. పైగా "ఈ రాజ్యం సాధించిన విజయం దృష్ట్యాను, అంతర్గత సాధన సంపత్తులను సమకూర్చు కొనడంలో, ముఖ్యంగా పన్ను విధింపు రంగంలో, మనం చేసిన సంతృప్తికరమైన కృషి దృష్ట్యాను, ఈ రాజ్యం సర్వ సాధారణంగానూ, పారిశ్రామికంగాను వెనుకబడియున్న విషయం దృష్ట్యాను కూడా ఈ రాజ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపవలసిందిగా ప్రణాళికా సంఘం వారిని ప్రభుత్వం అభ్యర్థించ గలదు" అన్నారు గవర్నరు.

సమాజాభివృద్ధిలో ఆంధ్రకు అగ్రస్థానం:

ప్రస్తుతం మన రాష్ట్రంలో 305 బ్లాకులు పని చేస్తున్నాయి. వీటి క్రింద మొత్తం 19,720 గ్రామాలున్నాయి. అనేక రంగాలతో మన రాష్ట్రం అఖిల భారత సగటు స్థాయిని దాటి పోయింది. వ్యవసాయం, పశుపోషణ, మంచి నీటి బావులు, పఠనాలయాలు, యువజన క్లబ్బులు, కర్షకుల క్లబ్బులు మొదలగు రంగాలలో అఖిల భారతంలో ఆంధ్ర ప్రదేశ్‌దే అగ్రస్థానం.

ప్రజాస్వామిక వికేంద్రీకరణ

పరిపాలనలో ప్రజాస్వామిక వికేంద్రీకరణ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి, సాహసోపేతమైన నిర్ణయం ప్రథమంగా తీసుకున్న గౌరవం మన రాష్ట్రానికి దక్కింది. 1959 నవంబరు 1వ తేదీన పంచాయతీ సమితులు, డిశెంబరు 1వ తేదీన 20 జిల్లాలలో జిల్లా పరిషత్తులు అవతరించాయి. సమాజాభివృద్ధి కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు యీ సంస్థలకు అప్పగించడంతో అధికారం ప్రజలకు దత్తం చేయబడింది. ప్రాథమిక విద్య, సెకండరీ విద్య, జిల్లా స్థాయిలో సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు యీ సంస్థలకు అప్పగించబడినవి. మైనర్ యిరిగేషన్ పనులు కూడా వీటికి బదిలీ చేయడం జరుగుతుంది.

ఈ సంస్థలకు అభివృద్ధి కార్యక్రమాలు యితోధికంగా అప్పగించడమే ప్రభుత్వ విధానమనీ, వీటిని అన్ని విధాలా పటిష్ఠం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందనీ గవర్నరు తమ ప్రసంగంలో పేర్కొన్నారు.

భారీ—లఘు, కుటీర పరిశ్రమలు

కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన భారీ పరిశ్రమలలో కొన్నింటినైనా ఆంధ్ర ప్రదేశ్‌లో స్థాపించాలని రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా ఒత్తిడి చేస్తున్నట్లు పేర్కొంటూ, యిటీవల రాష్ట్ర శాసన సభ ఏకగ్రీవంగా చేసిన తీర్మానం గురించి ప్రస్తావించి, హైదరాబాద్‌లో సింథటిక్ డ్రగ్గుల

ప్రాజెక్టు నెలకొల్పడానికి భారత ప్రభుత్వం నిర్ణయించినందుకు గవర్నరు హర్షం ప్రకటించారు. దేశంలోని యితర ప్రాంతాలతో పోల్చి చూస్తే, పరిశ్రమలకు సంబంధించినంతవరకు మన రాష్ట్రం యిప్పటికే వెనుకపడే వున్నందున, పారిశ్రామిక మూల సంపదను సాధ్యమైనంత ఎక్కువగా వినియోగించు కోవడం ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. రాజమండ్రిలోని ఆంధ్రా పేపర్ మిల్లు విస్తరణ, గూడూరులోని ప్రభుత్వ పింగాణి ఫ్యాక్టరీ అభివృద్ధి, పబ్లిక్ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన కొత్తగూడెం ఎరువుల ఫ్యాక్టరీ, వివిధ ప్రాంతాలలో సహకార చక్కెర ఫ్యాక్టరీల నిర్మాణం, గుంతకల్లులోని స్పిన్నింగ్ మిల్సు అభివృద్ధి, చీరాలలో ప్రారంభమవుతున్న స్పిన్నింగ్ మిల్సు మొదలగు పారిశ్రామికాభివృద్ధి కార్యక్రమాలను గవర్నరు వివరించారు

లఘు పరిశ్రమల విషయంలో, 49 పథకాలకుగాను ప్రభుత్వం యీ యేడు రూ 83 లక్షల మొత్తం కేటాయించింది. వివిధ జిల్లాలలో పారిశ్రామిక క్షేత్రాలు స్థాపించడం ప్రభుత్వ విధానం. ప్రస్తుతం వున్న ఆరు పారిశ్రామిక క్షేత్రాలుకాక, కడపలో రూ 10 లక్షల ఖర్చుతో మరొక క్షేత్రం నెలకొల్పబడుతుంది.

నిరుద్యోగ నివారణకే కాక, కుటీర పరిశ్రమలు మన కళా వైదగ్ధ్య ప్రదర్శనకు కూడా ఉపకరిస్తాయి. నిర్మల్, బిదిరి పరిశ్రమలవంటి ప్రత్యేక తరహాకు చెందిన చేతి పరిశ్రమలనూ, కొండపల్లి, ఏటి కొప్పాక బొమ్మల పరిశ్రమను, బొబ్బిలిలో సంగీత వాద్య పరికరాల పరిశ్రమను ప్రభుత్వం శ్రద్ధవహించి ప్రోత్సహిస్తున్నదనీ, క్రయవిక్రయ సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నదనీ ఆయన వివరించారు. ఈ సందర్భంలోనే, హైదరాబాద్ సికిందరాబాద్ జంట నగరాల్లో నిరుద్యోగ నివారణకు ఏర్పాటైన ప్రత్యేక సంఘం వారు చేసిన సిఫార్సులను ప్రభుత్వం అమలు పరుస్తున్నదనీ, రాష్ట్రంలోని తోళ్ల పరిశ్రమాభివృద్ధికి ఒక సంఘం నియమించ బడిందనీ గవర్నరు పేర్కొన్నారు.

ఉచితంగా విద్య

మూడవ ప్రణాళిక ముగిసేలోగా 6—11 సంవత్సరాల మధ్య వయసుగల పిల్లలందరికీ ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యా పద్ధతి వర్తింపజేయాలనే భారత ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా చర్యలు గైకొనబడుతున్నవని గవర్నరు ప్రకటించారు. గుంటూరు, నెల్లూరు, నంద్యాలలో పాలిటెక్నిక్ పాఠశాలలు, కాకినాడ, తిరుపతి, సికిందరాబాద్‌లలో జూనియర్ టెక్నికల్ పాఠశాలలు యీ విద్యా సంవత్సరం నుండి ప్రారంభింపబడుతాయి. నల్లగొండ, ఆదిలాబాద్ కళాశాలలను లోగడనే ప్రభుత్వం తన ఆధీనంలోనికి తీసుకుంది. 1959 సెప్టెంబరు 1వ తేదీ నుంచి ఖమ్మంమెట్టు, కరీంనగర్ కళాశాలలు కూడా ప్రభుత్వ పరం అయినవి. నిజామాబాద్, సిద్దిపేట కళాశాలలనుకూడా యీ సంవత్సరం స్వాధీనపరచుకుంటారు.

బేసిక్ విద్యాభివృద్ధికి శ్రీ గోపాలరావు ఎక్బోటే అధ్యక్షతన ఏర్పాటైన సంఘమును గురించి ప్రస్తావిస్తూ, వారి సూచనలు విద్యా బోధనలో వినూతన మార్గాల అనుసరణకు దోహదకారులు కాగలవని గవర్నరు తమ విశ్వాసం వెల్లడించారు.

నీటి పారుదల, విద్యుచ్ఛక్తి

తుంగభద్ర ఎగువ కాలువ, భైరవాని తిప్ప ప్రాజెక్టు, కృష్ణా బ్యారేజి క్రింద గేట్ల నిర్మాణం, రాజోలిబండ మళ్లింపు పథకాల క్రింద జరిగిన కృషిని సమీక్షించిన తర్వాత పోచంపాడు ప్రాజెక్టును గురించి ప్రస్తావించి ఆయన యిలా అన్నారు

"మన రాజ్యంలోని తెలంగాణా ప్రాంతానికి పోచంపాడు ప్రాజెక్టు ఎంత ముఖ్యమైనట్టిదో, ఎంత అవసరమైనట్టిదో ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. రెండవ పంచవర్ష ప్రణాళికలో ఈ పథకాన్ని చేర్చటంకోసం ఈ ప్రాజెక్టు యొక్క అన్ని అంశాలను గురించి ప్లానింగ్ కమిషను వారికి తెలియజేయడమైంది. ఈ పని ప్రారంభించడానికి తీసికోవలసిన ప్రాథమిక చర్యలన్నీ తీసికోబడినాయి. త్వరలోనే ఈ ప్రాజెక్టుకు ప్లానింగు కమిషను వారి అనుమతి లభిస్తుందని మేము ఆశిస్తున్నాము"

నాగార్జున సాగర్ ఆనకట్ట పని సంతృప్తికరంగా సాగుతున్నదనీ కొన్ని చోట్ల ఆనకట్ట 100 అడుగుల ఎత్తు లేచిందనీ, యిరువైపుల కాలువల త్రవ్వకం పని కూడా ప్రోత్సాహకరంగా జరుగుతున్నదనీ గవర్నరు పేర్కొ-

న్నారు. 1960 ఏప్రియల్ చివరకు యీ ప్రాజెక్టు మీద రు. 29.84 కోట్లు ఖర్చు జరిగింది. ఈ సంవత్సరం కేటాయింపు రు. 9 కోట్లు.

వరద నివారణ కార్యక్రమాల క్రింద యింతవరకు జరిగిన ఖర్చు రు. 1.49 కోట్లు. ఏలూరు ప్రధాన కేంద్రంగా యిందు నిమిత్తం ప్రత్యేక సర్కిలు ఏర్పాటు చేయబడింది.

1959–60 సంవత్సరంలో ఆంధ్రలోదాదాపు 494 గ్రామాలకూ, తెలంగాణాలో 145 గ్రామాలకూ విద్యుచ్ఛక్తి సౌకర్యం లభించింది. వీటితో సహా యిప్పటి వరకు విద్యుత్సౌకర్యం లభించిన గ్రామాలు ఆంధ్రలో 2025, తెలంగాణాలో 383.

ఆహార ధాన్యాల ధరలు

మనది మిగులు రాష్ట్రమే అయినా, లోటు రాష్ట్రాలకు ధాన్యం ఎగుమతులు జరుగుతున్నందున ధరల భారాన్ని మనం కూడా భరించవలసి వచ్చిందని పేర్కొంటూ, దక్షిణ బియ్యం మండలం ఏర్పాటు, కొన్ని జిల్లాలలో ధరలను కంట్రోలు చేయడం, 'చౌక ధరల' దుకాణాల ద్వారా ఆహార ధాన్యాల పంపిణీ కొరకు నిల్వలు ఏర్పాటు చేసుకోవడం వంటి సాధ్యమైన చర్యలన్నీ ప్రభుత్వం తీసుకుంటున్నదని గవర్నరు వివరించారు. అవసరమైతే యింకా ఎక్కువ సంఖ్యలో "చౌక ధరల" దుకాణాలు ప్రారంభించడం జరుగుతుందన్నారు.

అధికాహారోత్పత్తి సాధనకు ఉద్దేశించిన "ప్యాకేజి కార్యక్రమం", చిన్నతరహా వ్యవసాయదారులకూ, కౌలుదార్లకూ ధన సహాయం చేయడానికి ఉద్దేశించిన పైలట్ ప్రాజెక్టు పథకం గురించికూడా గవర్నరు తమ ప్రసంగంలో పేర్కొన్నారు.

తిరుపతిలో వైద్య కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనీ, రూయా ఆస్పత్రి భవన నిర్మాణం కూడా కొనసాగుతున్నదనీ గవర్నరు పేర్కొన్నారు.

క్షయ, కుష్ఠు, మశూచి, మలేరియా వంటి వ్యాధుల వ్యాప్తిని అరికట్టడానికి ప్రభుత్వం తీసుకుంటున్న క్రియాత్మకమైన పెక్కు చర్యలను గురించి ఆయన ప్రస్తావించారు.

పిల్లల ఆరోగ్యం పెంపొందించే విషయం పట్ల కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నదనీ. నీలోఫర్ ఆస్పత్రిలోని శిశు వైద్య సంస్థ స్థాయిపెంచి, విశాఖపట్టణంలో పిల్లల ఆస్పత్రి కొత్తగా స్థాపించి, సమగ్రమైన రెండు ఆస్పత్రులను పిల్లలకోసం ఏర్పాటు చేయటానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని కూడా ఆయన వివరించారు.

ఇంకా పశ్చిమ గోదావరి జిల్లాలో రోడ్డు రవాణా జాతీయీకరణ, అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాలలో ప్రతికూల వాతావరణ పరిస్థితులవల్ల దెబ్బతిన్న రైతులకు సహాయము, బంజరు భూములు కేటాయింపు, తెలంగాణాలో రాజకీయ బాధితులకు భూములు మంజూరు చేయడం, మద్య నిషేధ నిర్వహణ బాధ్యతను పోలీసు శాఖ నుండి తీసి వేసే ప్రతిపాదన, షెడ్యూలు ప్రదేశాలలోనివారికి ఉద్దేశించిన ఋణ విమోచనశాసనం, తూర్పు గోదావరి, విశాఖ పట్టణం జిల్లాలలోని ఏజన్సీ ప్రాంతాలలో కాఫీ తోటల పెంపకం వంటి షెడ్యూలు తెగల సంక్షేమ కార్యక్రమాలు మొదలగు వివిధ ముఖ్య విషయాలలో ప్రభుత్వ విధానాలనుగురించి, తీసుకుంటున్న చర్యలనుగురించి, ఆయారంగాలలో సాధించిన ప్రగతినిగురించి గవర్నరు తమ ప్రసంగంలో వివరంగా పేర్కొన్నారు.

—:※:—

రచయిత రచన చేయటానికి బ్రతకాలి, కాని బ్రతకటానికే అతను రచన చేయకూడదు....రచయిత తన రచనలను దేనికీ సాధనాలుగా పరిగణించడు. రచనలు అతని లక్ష్యాలే. అవసరమయితే లక్ష్యాల కోసం అతను తన ఉనికినే త్యజిస్తాడు.

— కారల్ మార్క్స్.

"పంచాయితి సమితి"

— కె. పాపారావు

1. ఇది ప్రశాంత విప్లవం, ఇది స్వరాజ్య సత్ఫలం ।
నవోత్సాహ, నవోత్తేజ, నవాభ్యుదయ కారణం ॥ ఇది ॥

2. గ్రామ సీమ పునర్జన్మ గమ్యమైన సత్పథం ।
సాముదాయకాభి వృద్ధి సర్వజనుల దృక్పథం ॥ ఇది ॥

3 పరిపాలన వికేంద్రీకరణయే, శుభాషితం ।
అధికారం ప్రజానీక హస్తగత శుభోదయం ॥ ఇది ॥

4 ప్రజాస్వామ్యమునకు నాంది, పంచాయితి సమితీ ।
సృజనాత్మక శక్తులతో విజృంభించు ప్రగతీ ॥ ఇది ॥

5. పాలితులే, పాలకులౌ ప్రజాస్వామ్య వైభవం ।
పాలకులూ, ప్రజానీక మేకమ్మగు సౌరభం ॥ ఇది ॥

6. సంఘ సమత, సౌహార్దత, సమితిలో విశిష్టతా ।
సంఘీభావము గుదురుట సమితి కెపుడు సౌష్టవతా ॥ ఇది ॥

7. కులమతాది భేదములకు, విడువవలె తిలోదకం ।
ప్రజారంజకముగ, సమితి, పరిమళించు సౌరభం ॥ ఇది ॥

8. పంచశీల ప్రబోధాల, ప్రజాభ్యుదయ ప్రణాళికల ।
పంచాయితి సమితి ముందుకే పురోగమించునోయ్ ॥ ఇది ॥

పంచాయతీ రాజ్య పునరుద్ధరణ

ప్రజాస్వామ్య వికేంద్రీకరణ అంటే, కేంద్రాధికారమును ప్రణాళిక అమలు జరుగుతున్న ప్రాంతాలలో ఉన్న ప్రజా సంస్థల పరం చేయడం. మన పురాతన గ్రామ పంచాయతీ వ్యవస్థను పునరుద్ధరించి దేశ నూత్న భవిష్యత్తును రూపొందించు మహత్కార్యములో దానిని శక్తివంతమైన భాగస్వామిగా చేయడం.

నిజమైన ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రజలే పాలనా భారమును వహిస్తారు. వారు విషయములను, తామే తీర్చి దిద్దుకొంటారు. ప్రభుత్వము మాత్రము సాంకేతిక సలహాలను యిస్తుంది. కావలసిన సదుపాయాలు కల్గజేస్తుంది. ప్రజలు తమ కష్టసుఖములను అవసరాలను గ్రహించి నంతగా ప్రభుత్వ ఉద్యోగులు గ్రహించలేరు. ప్రజలు స్వయంగా నిర్మించుకున్న సంస్థవలె వివిధ సమస్యల చైతన్యము ప్రజల్లో కలిగించలేరు. అందుచేత ప్రజాస్వామిక రంగంలో, అధికార వికేంద్రీకరణ పథకము, గత సంవత్సరం ప్రారంభించబడింది. ప్రభుత్వ ఉద్యోగుల అధీనములోవున్న పరిపాలనాధి కారమును ప్రజలకు అప్పగించారు. ప్రజా ప్రతినిధులే ఆయా ప్రాంతాల అవసరములను గమనించి పథకములను తయారుచేసి, అమలు పరుస్తారు.

పూర్వకాలంలో గ్రామ పంచాయతీలు స్వయం సమృద్ధి పొందిన పరిపాలనా వ్యవస్థలుగా వుండేవి. గ్రామీణ ప్రజల ఆచరణాభిమానాలు నాటికి వుండేవి, పర ప్రభుత్వ పాలనా యంత్రాంగంలో క్రమంగా పంచాయతీ రాజ్య ప్రాముఖ్యము నశించి పోయింది. పల్లె సీమల నిలయమైన ఈ దేశమునకు పంచాయతీ రాజ్యము వెన్నెముక వంటిదని పర ప్రభుత్వం గుర్తించలేక పోయింది. గ్రామస్థులందరు కలిసి మెలసి గ్రామాభ్యుదయ కార్య రంగంలో పాల్గొనలేక పోయారు. ప్రజలు, పరిపాలనా యంత్రాంగమునకు, పంచాయతీ రాజ్యమునకు దూరమై పోయారు. పంచాయతీ వ్యవస్థ పరిపాలనా రంగంలో పూర్తిగా రూపుమాసి పోయింది.

పంచవర్ష ప్రణాళికలు ఆచరణలోనికి వచ్చినప్పటి నుండి గ్రామ సీమల సౌభాగ్యము కొరకు ఎక్కువ శ్రద్ధ తీసికొనడం ప్రారంభమైంది. గ్రామ పంచాయతీలను సువ్యవస్థితముచేసి గ్రామ సీమల స్వపరిపాలన కొరకు తగిన అధికారములిచ్చి ప్రతి గ్రామము అభ్యుదయ పథకములను తయారు చేసి అమలు పరుచుకోగలిగినపుడే ప్రజా ప్రణాళిక సార్థక మవుతుందని సర్వత్రా గుర్తించబడింది. కావలసిన అధికారము యివ్వనిదో పటిష్ఠమైన పంచాయతీ రాజ్యమును సాధించుట కష్టమని గ్రహించారు.

తరచుగ తప్పులు పట్టెడు స్వభావంగల విమర్శకులు, యిప్పటి పరిపాలనా వ్యవస్థలో కేంద్రస్థాయిలో ప్రజాస్వామ్యం, గ్రామ సీమల స్థాయిలో నిరంకుశత్వము ఉందునని ఆరోపిస్తారు. జిల్లా నుండి దిగువ అన్ని స్థాయిలలోను ప్రజలు బాధ్యత వహించి, ముందంజవేసి పరిపాలనలో జోక్యము కల్గ జేసికొను అవకాశం లేదని అంటారు. ఈ పరిస్థితిని సరిచేసి పరిపాలనతో ప్రజలకు సన్నిహిత సంబంధం కల్పించడానికై 1952, అక్టోబరు నెలలో, దేశ వ్యాప్తంగా, సమాజాభివృద్ధి కార్యక్రమం ప్రారంభింపబడింది. అన్ని స్థాయిలలోను పరిపాలనాధికారం ప్రజల పరం చేయడం జరిగింది. తత్ఫలితంగా ప్రజా చైతన్య శక్తి ప్రజాస్వామిక వ్యవస్థకు మూలాధారమై పునాదియైనది. జిల్లాకు దిగువన అన్ని స్థాయిలలోను స్వపరిపాలనా బాధ్యత ప్రజలకు రానంత కాలము, ప్రజాభిమానమును

చూం గొనుట. ప్రణాళికా కార్యక్రమములను ప్రజలు ఉత్సాహముతో నిర్వర్తించుట కష్టమని గుర్తించబడింది.

ఆదినుండి ప్రజా ప్రతినిధులు అభివృద్ధి కార్యక్రమాలలో ఎక్కువగా పాల్గొని తుదకు పాలనా భారమును వహించుటకు కావలసిన పరిస్థితులన్నీ కల్పించటానికి ప్రయత్నం జరుగుతున్నది. సమాజ వికాస కార్యక్రమం. జాతీయ విస్తరణ సేవా పథకాలను పరిశీలించుటకు శ్రీ బలవంతరాయ్ మెహతా అధ్యక్షతన ఏర్పడిన సంఘము వారు ప్రజాస్వామిక వ్యవస్థతో అధికార వికేంద్రీకరణ ప్రాధాన్యమును స్పష్టంగా వివరించారు.

ఈ సందర్భంలో మెహతా సంఘము నివేదికలో ఏమని పేర్కొనబడిందంటే "ప్రజా ప్రభుత్వము సువిశాలమైన దేశమును పాలించ వలసివుంది. కాగా ఆయా ప్రాంతాల పరిస్థితులను. ప్రజల స్థితిగతులను విపరంగా అవగాహన చేసికొనలేక పోవచ్చు. అందుచే అధికార వికేంద్రీ కరణ అవసరం. పరిపాలనా యంత్రాంగము, అధికారము, ప్రాంతీయ ప్రజా ప్రతినిధుల స్వాధీనమందుంచడం శ్రేయస్కరం".

మెహతా సంఘము చేసిన యీ ముఖ్య సూచనను భారత ప్రభుత్వము, ప్రణాళికా సంఘము అమోదించాయి. మండల స్థాయిలో జిల్లా పరిషత్తులను, బ్లాకు స్థాయిలో పంచాయతీ సమితులను స్థాపించి, అధికారమును ప్రజలకు అప్పగించడానికి నిర్ణయం జరిగింది.

వికేంద్రీకరణ అంటే ఏమిటి?

వికేంద్రీకరణ అంటే కేంద్రీకృతమైయున్న అధికారమును విభాగించి, ఆయా ప్రాంతీయ ప్రజా సంస్థలకు అప్పగించడం. ఈ విధంగా అధికారమును విభాగించి, ప్రజా సంస్థలైన జిల్లా బోర్డులకు, పంచాయతీలకు అప్పగించడం వల్ల నిజమైన ప్రజా వ్యవస్థ ఏర్పడుతుంది. అధికారం వికేంద్రీకృత మవుతుంది.

ప్రభుత్వ పరిపాలనా యంత్రాంగంలో జిల్లా ముఖ్యమైంది. లోగడ జిల్లా స్థాయిలో గల అధికారాలు అంతకంటె దిగువ స్థాయిలో ప్రజా సంస్థలకు అప్పగించబడినవి. జిల్లాలలో బ్లాకు ప్రాంతాలకు చెందిన అభివృద్ధి కార్యక్రమాలు అమలు పరిచే అధికారం పంచాయితీ సమితులకు అప్పగించడం జరిగింది ఆ విధముగ జిల్లా బోర్డులు నిర్వర్తించు విధులలో చాలా భాగం పంచాయతీ సమితులకు, మిగిలినవి జిల్లా పరిషత్తులకు అప్పగించబడినవి.

దీనిని దృష్టిలో ఉంచుకొని క్రిందటి సంవత్సరము ఆంధ్ర శాసనసభ, ఆంధ్ర ప్రదేశ్ పంచాయతీ సమితుల, జిల్లా పరిషత్తుల చట్టమును ఆమోదించింది. ఇది రాష్ట్రాభ్యుదయ మార్గంలో ఒక మైలు రాయిఏంటిది పంచాయతీ సమితులు 1-11-1959 న, జిల్లా పరిషత్తులు 1-12-1959 న ప్రారంభించబడినవి. పంచాయితీ సమితులు నిర్వర్తించ వలసిన విధులు, అధికారాలు. చట్టము యొక్క 18వ సెక్షన్‌లో విశదీకరించ బడినవి. గ్రామ సంక్షేమము, వ్యవసాయాభివృద్ధి. పశుపోషణ. ప్రజారోగ్యము, ప్రాథమిక విద్య, గృహపరిశ్రమలు, సాంఘిక సంక్షేమము మొదలగు పనులు యిక నుండి పంచాయతీ సమితులచే నిర్వర్తించ బడగలవు. అన్ని సంస్థల నుండి సిబ్బంది. ఆర్థిక సహాయము. పంచాయితీ సమితుల పరం చేయబడింది. యింతవరకు 254 బ్లాకులలో పంచాయతీ సమితులు స్థాపించారు. తుదకవి అన్ని బ్లాకులలోను స్థాపించ బడగలవు.

సమాజ వికాస కార్యక్రమము క్రింద సేద్యపు నీటి పారుదల, గ్రామీణ గృహవసతికి ఋణ సహాయం నిమిత్తం కేటాయించిన మొత్తము పంచాయతీ సమితుల పరంగా యివ్వబడుతుంది. తిరిగి వాయిదాల మీద సమితులనుండి వసూలు చేస్తారు. అదే విధముగా మరికొన్ని అభివృద్ధి కార్యక్రమ శాఖలవద్ద, అనగా వ్యవసాయము, పశుపోషణ, పరిశ్రమల అప్పుల రూపమున మంజూరు చేసిన ధనము కూడా పంచాయతీ సమితుల పరంగా యివ్వబడుతుంది.

జిల్లా పరిషత్తుల అధికారము

జిల్లా పరిషత్తులు నిర్వర్తించవలసిన విధులు, అధికారములు, చట్టము యొక్క 47వ సెక్షన్‌లో నిర్వచింపబడియున్నవి. సమితులకు సలహాలను యిచ్చుట, అజమాయిషీ చేయుట, బడ్జెటును ఆమోదించుట, సమితి ప్రణాళికలన్నీ సమన్వయిపరచుట, ప్రభుత్వము బ్లాకులకు మంజూరు చేసిన ధనమును పంచి యిచ్చుట. పరిషత్తులు చేయవలసిన

విధులు, ఆంధ్ర ప్రాంతములోని పురపాలక సంస్థలు, తెలంగాణా ప్రాంతంలోని పట్టణ పాలక సంస్థలు సహా జిల్లాలోని అన్ని అభివృద్ధి కార్యక్రమాలకు పథకములను తయారుచేయవలసిన బాధ్యత పరిషత్తులపైనే ఉంది. పరిషత్తులు ముఖ్యమైన ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వర్తించుటయందు, అంటే గ్రామ జీవన ప్రమాణమును వృద్ధిచేసి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధించుటలో ప్రభుత్వముతో కలసి మెలసి పని చేయవలసి వుంటుంది.

జిల్లా పరిషత్తులు ప్రభుత్వముచే తమ కప్పగింపబడిన జిల్లా బోర్డుల విధులను కూడా నిర్వర్తిస్తుంటాయి. పరిషత్తులు, సమితులకు, ప్రజా సంస్థలు, గృహములు. విధులు, అధికారములు అదాయ వ్యయములు, కేటాయించు అధికారము జిల్లా కలెక్టర్లకు యివ్వబడింది, ప్రాథమిక విద్య, రహదారులు, ప్రజారోగ్యము, మొదలగు ముఖ్య విషయాలు బ్లాక్‌లకు సంబంధించిన పన్నీ ఎక్కువగా పంచాయతీ సమితులకు యివ్వబడినవి. ప్రస్తుతానికి సమితులు లేని బ్లాకు ప్రాంతాలకు సంబంధించిన విధులు, ధనము జిల్లా పరిషత్తుల అధీనమందే ఉంటుంది. రాష్ట్రములో ఉన్న 20 జిల్లాలలోను జిల్లా పరిషత్తులు పనిచేయుచున్నవి.

ఎక్కువ అధికారములు

అధికార వికేంద్రీకరణవల్ల జిల్లా స్థాయి పాలనలో పెద్ద విప్లవాత్మకమైన మార్పు వచ్చింది. ఇంతకు పూర్వము అనేక పనులకు, ప్రణాళికలకు డబ్బు మంజూరుచేయు అధికారము ఉన్నత ఉద్యోగులచేతుల్లో ఉండేది. ఇప్పుడు సమితులకు స్థాయీ సంఘములకు ఆ అధికారము యివ్వబడింది విధులను అధికారమును విభాగించే పంచాయితీ సమితులు స్థాయీ సంఘములు యిక నుంచి సమాజ వికాస పథకముల కగు ఖర్చును మంజూరు చేసుకోవచ్చు

ఇకముందు గ్రామ ప్రణాళిక లాధారముగా బ్లాకు ప్రణాళికలు, బ్లాకు ప్రణాళికలాధారంగా జిల్లా ప్రణాళికలు, తుదకు జిల్లా ప్రణాళికలన్నీ కలసి రాష్ట్ర ప్రణాళికగా రూపొందుతవి. ఈ విధంగా గ్రామ పంచాయతీలు రాష్ట్ర ప్రణాళికకు పునాదులై యదార్థ ప్రజావసరములను ప్రతిబింబింపచేయును.

ఈ ప్రజా సంస్థల యొక్క ముఖ్య విధులు, అన్యోన్య ప్రజా సహకారముతో ప్రణాళికలు తయారుచేసి, స్వయం సహాయంతో అమలు పర్చుట, ప్రజలలో నూతన దృక్పథమును స్వయం శక్తి ఆత్మవిశ్వాసములను పెంపొందించుట, ఆర్థికాభ్యుదయాన్ని పలువిధములైన సహకార పద్ధతుల ద్వారాను ప్రజాస్వామిక సిద్ధాంతముల ద్వారాను సాధించుట ప్రజాస్వామిక సంస్థల యొక్క ముఖ్య లక్ష్యము. గ్రామ సాంఘిక ఆర్థిక రంగాల్లో, చైతన్యమును కల్గించి మానవాభ్యుదయమునకు దేశ సౌభాగ్యమునకు తోడ్పడుటయే. వివిధ ప్రజా సౌకర్యాలు కలుగజేయడం దగ్గర నుండి గ్రామ సీమలలో ప్రశాంత పద్ధతిలో సాంఘిక ఆర్థిక విప్లవం సాధించుటవరకు యీ వికేంద్రీకరణ గ్రామము యొక్క సర్వ పరివ్యాప్తమై ఉంటుంది.

తనను గురించి యితరులు ప్రసంగించుకునే దానికంటె ప్రపంచంలో చెడ్డ విషయం ఒక్కటే వుంది. అదే మంచే, తనను గురించి ఎవరూ పట్టించుకోక పోవడం.

— ఆస్కార్ వైల్డ్

* * *

వివేకానికి, భావ స్వాతంత్ర్యానికీ విద్య ప్రధాన ప్రతిబంధకం కావడం నేటి కాలపు వైపరీత్యాలలో ఒకటి.

— బెట్రాండ్ రస్సెల్

ఎన్నో జ్యోతులను వెలిగించిన కాంతిపుంజం

క్రొద్ది రోజుల క్రితం వరకు పూసా రాములు అనేది ఓ అమాయక నామధేయం మాత్రమే. ఈనాడు ఆ నామం అద్భుతానికి మారుపేరుగా పరిగణించబడుతోంది. ఖమ్మం జిల్లా బూర్గంపాడు ఏజన్సీ బ్లాకులోని ఒక మూరుమూల గ్రామం రేపలవాడ. ఆ ఊరికి చెందిన ఈ నిరుపేద హరిజనుడు ఎంతో కాలంగా తాను భద్రపరచుకున్న నూరు రూపాయలను ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి విరాళమిచ్చి ప్రజల కృషికి అనుకోకుండా జ్యోతిని ప్రసాదించాడు.

ఈ శుభ దినానికి మునుపు, పూసా రాములు అవధులు లేని అశ్రువులకు, ఆపదలకు అతిథి. ఏ విధమైన ఔషధ సహాయం లేక ఒంటరి గుడిసెలో మృత్యువును జేరుతున్న తన అర్ధాంగిని తిలకించే అధోగతి అతని ఫాల వ్రాసింది. తరువాత, అగ్నిదేవుని కరుణా వీక్షణాలకు తన గుడిసె భస్మమై పోవటంతో ప్రకృతి మాత గొడుగు క్రింద తల దాచుకోవలసి వచ్చింది. అయినా పూర్వం మాదిరే ఒక లక్ష్యమూ, కారణమూ లేకుండానే నిర్విరామంగా పనిచేస్తూ వచ్చాడు.

తొందరలోనే తన పొదుపు నూరు రూపాయలకు చేరింది. దానితో పథకం వేయటం ఆరంభించాడు. వెయ్యిన్నొక్క విషయాలనుంచి ఒక పథకాన్ని ఎన్నుకోవాలి. ఆ పథకం తనవద్ద వున్న మొత్తానికే చేకూరేదిగా వుండాలి. తను కోరుకుంటే- ఓ కొత్త గుడిసె లేక ఓగేదె అదీ కాదనుకుంటే మరో జీవిత భాగస్వామినిని అతనికున్న ఆ పెద్ద మొత్తంతోనే పొందవచ్చు. అయితే అతను ఇవేమీ కాంక్షించ లేదు. అతని భావాలు మృత్యు దేవతకు గురయిన హృదయేశ్వరి పైకి పోయాయి- ఏ విధమైన ఔషధ సహాయం లేకుండా మృత్యువుకు గురవుతున్న అర్ధాంగిని నిస్సహాయ స్థితిలో పరికించ వలసి వచ్చెనే! "వద్దు, ఇకవద్దు" అని లోపలే తేల్చేశాడు.

తక్షణం తన అమూల్య ఖజానాను ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి విరాళంగా ఇచ్చేశాడు. తనను గురిచేసిన విషాదాలనుంచి ఇదొక్కటే నివారించగలదు. అతని పెద్ద మొత్తం ఆసుపత్రి నిర్మించటానికి తగినంత మొత్తం కాదు. నిజమే. కాని మాతృభూమికి ఎంతమొత్తమైనా స్వల్పం కాబోదని అతను భావించాడు ఒక దీపం వెలిగిస్తే చాలు, క్షణంలో ఆ దీపమే వెయ్యి జ్యోతులను వెలిగిస్తుంది. పూసారాములు నూరు రూపాయలు అద్భుతంగా పనిచేశాయి. ఈ స్వల్ప మొత్తం వెనుకవున్న పరమార్థం ఎంతోమంది హృదయాలను వశం చేసుకుంది. పదిహేను దినాలలోపలే, ఎంతో మంది చకితులయేట్టు, పినపాకలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించటానికి పదివేల రూపాయలు డిపాజిటు చేయబడ్డాయి.

సమయం మించిపోకుండా కావలసిన విరాళాన్ని ప్రజావనరుల నుంచి రాబట్టుకోటానికి యీ నిరుపేద హరిజనుని పట్టుదలను వినియోగించుకోవటం ద్వారా, బూర్గంపాడు బ్లాకు అధికారులు బ్లాకులు ''మానవతా కార్యకలాపాలకు కేంద్రాలుగా-పరిసరాల అంధకారంలో వెలుగును విరజిమ్మే జ్యోతులు''గా వాటి ప్రతిభను నిలబెట్ట గలిగారు.

పేదవానికి పొదుపు బోధించడం అతన్ని అవమానించడమే, అది ఎలా వుంటుందంటే అసలే ఉపవాసాలు చేసే వాడిని కొద్దిగా తినమన్నట్టుంటుంది.

— ఆస్కార్ వైల్డ్.

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు

— యర్రమిల్లి నరసింహారావు

(జూలై 4 వ తేదీ అల్లూరి సీతారామరాజు జన్మదినం. ఈ సందర్భంలో ప్రభుత్వం ఆ వీరుని జీవిత చరిత్రను గ్రంథ రూపాన ప్రకటించింది).

ఆంధ్ర జాతి వీరసంతతి సజీవముగానున్నదని సామ్రాజ్య వాదముపై యుద్ధమును ప్రకటించి ఋజువు పరిచిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు. రాజు యౌవనారంభముననే 1922 సం॥న బ్రిటిష్ సామ్రాజ్యవాదముతో ప్రత్యక్ష పోరాటమును నడిపిన అవక్రపరాక్రమవంతుడు. విరామమెరుగని, ముఖాముఖి పోరాటమన్న ఇతనికి ప్రీతి. దొంగపాటుగా ఇతడెన్నడు పోరు సాగించలేదు. శత్రువుకు కత్తినిచ్చి, కత్తిని తాచేబూని సమర రంగమున వెనుకంజ వేయక మేరు గంభీరునివలెనిల్చిన విప్లవయోధుడు రామరాజు. పంచప్రాణములను మాతృదేశ దాస్య విమోచనకుపణముగానొడ్డి సామ్రాజ్య వాదముతో చదరంగమాడిన అమేయ సాహసోపేతుడు మన రామరాజు. ధర్మభూమియైన కురుక్షేత్ర యుద్ధమున అభిమన్యునివలె పోరు సల్పిన ఆంధ్ర రాభిమన్యుడు రామరాజు. మృత్యువుతో బంతులాట లాడనవీర కిశోరము. విజయిమో ! వీర స్వర్గమో ! కాని మధ్య మార్గములేని అవక్ర ప్రరాక్రమవంతుడగు విప్లవ వీరుడు మన శ్రీ రామరాజు.

ఒకేఒక వ్యక్తి నాయకుడు. చేత కాసీలేదు. పోరుసల్పుటకాయుధములు శూన్యము. వేళ్ళపై లెక్కింపదగిన అనుచర బృందముతో సమరమును తలపెట్టిన సాహసోపేతుడు, మన్య ప్రాంతమును కోటగా నిర్మించుకొని. ఆ కోట నుండి ఒక మహా సామ్రాజ్య పురుష బలమును ఢీకొన్న, విప్లవ వీర వతంసుడు రామరాజుగాక మరెవ్వరు?

ధైర్య సాహసములు సహజ కవచ కుండలములు. అట్టి రామరాజు ఆంధ్ర విప్లవ పోరాట రంగమున 'పెను తుఫాను' చెలరేగించినాడు. నిద్రాణమైయున్న ఆంధ్ర జాతిని మేల్కొల్పి వారిని స్వాతంత్ర్య సమరాంగణమున నిల్పి, ఆంధ్ర దేశమునేగాక, భారత భూమిని ఉత్తేజితమొనర్చిన సంగ్రామగాథకు .కథానాయకుడే అల్లూరి సీతారామరాజు.

40 సంవత్సరముల క్రితం ఆంధ్ర ప్రదేశపు నడిబొడ్డున ద్వితీయ స్వాతంత్ర్య సమర శంఖమును పూరించిన విప్లవమూర్తి రామరాజు. 1857 ప్రథమ స్వాతంత్ర్య సమర చరిత్ర తరువాత ఈ పవిత్ర భారత భూమిని చెలరేగిన ద్వితీయ సాయుధ స్వాతంత్ర్య యుద్ధ గాథను నడిపిన కీర్తివంతుడు, తేజోవంతుడు. ఆంధ్ర పుత్ర రత్నము మన అల్లూరి సీతారామరాజు చరిత్ర సువర్ణాక్షరములతో లిఖింపదగిన సముజ్వల చరిత్ర.

బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కరాళదంష్ట్రిలలో భారతమాత నలిగిపోతున్న దుర్దినములవి, దేశములోని జాతీయ వాదులు, విప్లవ వీరులు దేశ విమోచనకొరకు పెనగులాడుచున్న అంధకార దినములవి. ప్రపంచ సామ్రాజ్యవాద శక్తులకు బ్రిటన్ నాయకమణి. 'సూర్యుడస్తమించని' విశాల సామ్రాజ్యవాదముపై సూర్యరశ్మి చొచ్చుటకు వీలులేని కొండ గుహలలో నుంచి శ్రీ రామరాజు రణభేరి మ్రోగించినాడు. ఒక చెంప పాలు, మరొక చెంప నీరు కారు 'బుడుతడు' మూడు సంవత్సరములు సామ్రాజ్య వాదశక్తులతో విరామ మెరుగని సమరమును కొనసాగించినాడు. అదే రామరాజు నడిపిన ద్వితీయ స్వతంత్ర్య సాయుధ సమర చరిత్ర. ఇట్టి మహోజ్వల గాథను కూడ 'రంపపితూరి' అని నాట పరప్రభుత్వము అవహేళన చేసినది. కాని నాడును, నేడును స్వాతంత్ర్య భావోద్దీపితులగు భారతీయులు రాజునకు అతని సహచరులగు గాంమల్లు, గాంగంటం దొరలకు అతని సాహసోపేతులగు అనుచర బృందమునకు జోహారులర్పించుచున్నారు.

రాజు దూరదృష్టిగల విప్లవవాది. ఎత్తైన ఏటవాలు కొండలపైనుండి రాజు తన సైన్యమును నడిపించాడు. అట్టి రణరంగస్థల నిర్ణయమే ఇతని దూరదృష్టికి నిదర్శనము. తుపాకి పేల్చే ధైర్యం కావాలి. కేవలం చేతిలోని తుపాకి ఎందుకు పనికివస్తుంది? కాని రాజు అపూర్వ సాహసి తమ ప్రాణములను మాతృదేశముకొరకు పణము గానొడ్డు ధీరులు, రాజు అనుచరులగుట అదృష్టము. వారే గాం సోదరులుగా ప్రఖ్యాతి వహించిన గాంగంటన్న (గంటం) దొర. గాంమల్లన్న (మల్లు) దొరలు వీరు రాజుకు కుడి, ఎడమ భుజములవంటి వారు. వీరిలో గంటం దొర యుద్ధభూమిలో ప్రాణములను కోల్పోయిన యోధుడు. రెండవ వీరుడు మల్లుదొర $13\frac{1}{2}$ సంవత్సరములు అండమాన్‌లలో ప్రవాస శిక్షను. $3\frac{1}{2}$ సం॥రములు ఇంటర్న్‌మెంటును అనుభవించిన త్యాగి. వీరు మాత్రమే కాకుండా మొట్టడం వీరయ్యదొర, ఎండు పడలు. అగ్గిరాజు వీరందరూ విప్లవమునకు ప్రాణము పోసిరి, వీరు సీతారామ రాజునకు పంచప్రాణముల వంటివారు. మట్టి నుండి మహావీరుల్ని సృష్టించుకొని. వారి అండదండలతో రామరాజు విప్లవసారధ్యమును వహించాడు

1921 సం॥ ఆఖరు రోజుల్లో శ్రీ రామరాజు కృష్ణదేవిపేట నీలకంఠేశ్వర ఆలయంలోవుండి. ఆధ్యాత్మిక చింతతో గడిపే రోజుల్లో మన్య ప్రజల బాధలుచూచి వారిని రక్షించుటకు పూనుకొనుటతో విప్లవ బీజములు నాటబడినవి

1922 సం॥ ఆగస్టు నెల 22 వ తేదీ రామరాజు చింతపల్లి స్టేషనుపై దాడి చేయుటతో విప్లవ ఘంటారావము మోగింపబడినది. ఆ తేదీ విప్లవోద్యమ చరిత్రలో స్వర్ణదినము. అట మెరుపు దాడి సుమారు 300 మంది అనుచరులతో విప్లవ వీరుడు స్టేషను చుట్టుముట్టాడు ఎట్టి ప్రతిఘటన లేకుండా స్టేషన్ విప్లవ శక్తుల వశమయ్యెను పోరాటమునకు కావలసిన తుపాకులు, మందు గుండు సామగ్రి లభ్యమయ్యెను. ఈ చింతపల్లి స్టేషన్ ముట్టడి 1930లో జరిగిన చిటగాంగ్ ఆయుధాగార ముట్టడికి ఎన్నో సంవత్సరములు ముందుగానే జరిగియుండుట గమనింపదగియున్నది. దీని వలన భారతీయ విప్లవవాదుల శ్రేణిలో శ్రీ రామరాజు స్థానము మనకు తెలియగలదు. చింతపల్లి విజయముతో విప్లవకారుల ఆత్మ విశ్వాసము బలపడింది. మరుసటి దినము ఆగస్టు 23వ తేదీని కృష్ణదేవిపేట పోలీసు స్టేషన్‌పై జరిపిన దాడి కూడా విజయవంతమైనది.

చింతపల్లి, కృష్ణదేవిపేట దాడుల విజయవార్త, ఆంధ్రదేశ మంతయు ప్రాకెను. ఆగస్టు 24 వ తేదీ రాజవొమ్మంగి స్టేషన్ కూడా జయప్రదముగా ముట్టడింపబడుటయే గాక. ఆ స్టేషన్‌లో బందీగా నున్న లాగరాయి పితూరీలో పాల్గొన్న వీరయ్యదొరకు విముక్తి కూడా లభించుట విప్లవ దళములకు ఒక అపూర్వ విజయము. ఒక పోలీసు స్టేషను తరువాత మరొక స్టేషన్ విప్లవ శక్తులకు లొంగిపోసాగాయి. పోలీసు స్టేషనులను కూడా రక్షించుకొన లేని దుస్థితిని ప్రభుత్వము ఎదుర్కొనవలసి వచ్చినది. సామ్రాజ్య వాదమునకు తీరని తలవంపులు కలిగినవి.

విప్లవ గమనములో ఒంజేరి సంకుల సమరము ముకుటాయమానమైనది. ఈ పోరాటమున స్కాట్, హైటర్ అను ఇంగ్లీషు సేనానులు మరణించిరి. ఈ సంఘటన 1922 సం॥ సెప్టెంబరు 24 వ తేదీన జరిగినది. ఈ విజయవార్తకు ఆంధ్రావని ఉప్పొంగినది ఆంధ్ర జాతి వీరత్వం పొంగి పొరలినది. ఒక్కసారి ఆంధ్ర పౌరుషపు ధగధగలతో ఆంధ్రావని మెరసినది. ఆంధ్ర దేశము తన బిడ్డల శౌర్యమునకు ఆనంద భాష్పములు రాల్చినది. ఆ తెల్ల దొరలకు నాటి పర ప్రభుత్వము నర్సీపట్నములో గోరీలు కట్టించి వారి ప్రభు భక్తికి కృతజ్ఞత చూపినది. ఆ గోరీలే నేటికి సీతారామరాజు వీర కృత్యములకు ప్రబల సాక్ష్యములుగా చరిత్రకారులకు రుజువు పలుకుతున్నాయి। రక్తపు మడుగులలో తేలిన స్కాట్, హైటర్ సేనానుల మృతకళేబరముల తుది సంస్కారమును జరుపు బాధ్యతను వహించుటకు కూడా, అధికారులు అశక్తులై నిర్వీర్యులైరి. మృత్యు సమ్మర్దము నుండి తరిమి కొట్టబడిన సైనికులలో ఎవ్వరును మృత కళేబరములను సమీపించుటకు సాహసించలేదు ఇట్టి భయానక పరిస్థితులలో రాజు విప్లవమును అణచివేయుటకు ప్రభుత్వము కృతనిశ్చయముతో కృషి చేసినది

స్కాట్, హైటర్ల మరణముతో విప్లవ నిజ స్వరూపము వెల్లడియైనది. నూతన పద్ధతులలో ప్రతీకార చర్యలు జరిపి విజయమును సాధించుటకు 'నాఫ్' అను సైనిక నిపుణుని ప్రభుత్వము మన్యమునకు పంపినది, మహోజ్వల

ముగా సాగుతున్న పోరాటమును అణచుటకు ఇనస్పెక్టర్ జనరల్ స్పైన్ పంపబడెను. పోస్టు, టెలిగ్రాఫ్, వైర్‌లెస్ స్టేషనులు మన్యం అంతట నెలకొల్పబడి సీతారామరాజు చర్యలు ఎప్పటికప్పుడు అధికారులు తెలుసుకొనుటకు ఏర్పాట్లు చేసుకొనబడెను.

ఇట్టి ప్రతీకార చర్యలను సహితము లక్ష్యపెట్టక అప్రతిహత విప్లవ శక్తితో అడ్డతీగెల స్టేషన్ ముట్టడి జయప్రదముగా కొనసాగినది. అడ్డతీగెల స్టేషన్ తరువాత చోడవరం స్టేషన్ విప్లవకారుల వశమైనది. ఇట్లు విప్లవవీరుడు సీతారామరాజుచే వరుసగా ఐదు పోరాటములలో ప్రభుత్వము ఓడింపబడినది. ఆరవ పోరాటమున పెదగడ్డపాలెం సంకుల సమరంలో రాజు సైన్యము బలీయమైన ఓటమిని పొందినది. కాని విప్లవకారులు, విప్లవ సారధులు ప్రభుత్వ వశము కాలేదు. 1922 సం॥రం ఈ విధముగా జరిగిపోయినది. విప్లవ ప్రభావము రాష్ట్ర రాజకీయములపై ప్రతిబింబించు ఛాయలు స్పష్టముగా కనుపింపసాగినవి. ఈ పోరాటమును బందిపోటుల పోరాటమని అధికారులు చెప్పినను, దేశమున నమ్మువారెవ్వరూ లేరు. తూర్పు గోదావరి జిల్లాలోనే గాక, ఆంధ్రావనిలో రాజు వీరోచిత కృత్యములకు గొప్ప సంచలనము కలిగినది, సీతారామరాజు వెలిగించిన తోరణము ఆంధ్ర దేశమంతయు నలముకొనినచో? ఇట్టి భీతి ప్రభుత్వము నావహించినది. అందువల్ల ప్రభుత్వము రాజును పట్టి యిచ్చిన యెడల పదివేలు బహుమానము ప్రకటించినది. పెదగడ్డపాలెం సమరంలో రాజు మరణించెనని మొదట్లో భావింపబడినది; కాని హఠాత్తుగా 1923 సం॥ ఏప్రిల్ 3వ తేదీని అన్నవరం కొండపై భానోదయముతో రామరాజు ప్రత్యక్షమగుటతో అలజడి మరింత హెచ్చినది. కాని అప్పటికే విప్లవ శక్తుల తిరోగమనము ప్రారంభమైనది. అగ్గిరాజు పోరాటమున ఓడిపోయి లొంగిపోవలసి వచ్చినది. మల్లుదొర అకస్మాత్తుగా దొరికిపోయెను. ఈ వార్తలు కోయ ప్రజలకు అశనిపాతముల వంటివి. వారిలో నిరుత్సాహ మేర్పడెను. సీతారామరాజు జాడలు తెలుసుకొనుటకు అగ్గిరాజు, మల్లుదొరలను జైళ్ళలో పోలీసులు అనేక హింసలు పెట్టసాగిరి. రెండు సంవత్సరములు మన్య ప్రాంతమున జరిగిన ఈ పోరాటము వలన ఉభయ సేనలకు మధ్య లేగ దూడలవలె అమాయక ప్రజలు నలిగిపోయిరి. రాజు విప్లవ సైన్యమునకు సహాయపడిన ప్రజలను ప్రభుత్వోద్యోగులు కఠినముగ శిక్షింపసాగిరి. అనేక మందిపై కేసులు పెట్టబడెను కొందరు శిక్షింపబడిరి అనేక గ్రామములు సమిష్టి జరిమానాకు గురి చెయ్యబడెను ప్రభుత్వము ఈ విప్లవము నడచుటకు 40 లక్షల రూపాయలు వెచ్చించినది

రాజు స్వభావమున పరమ దయాళువు. ప్రభుత్వము తన ప్రజలను పెట్టు ఇక్కట్లకు ఇతని దయార్ద్ర రస ప్లావిత హృదయము కరిగిపోయినది. నాటి ఇతని మానసిక ప్రవృత్తి కురుక్షేత్ర యుద్ధమున అస్త్రసన్యాసము జేయ సమకట్టిన గాండీవిని పోలియుండెను సహజ క్షాత్ర తేజముతో తాను పోరాటమును నడపిన యెడల అసంఖ్యాక మన్య ప్రజానీకము రక్తపు మడుగులలో పొర్లాడవలెను ఇట్టి భయంకర దృశ్యమును ఇతని పవిత్రాత్మ సహింపజాలదు. ఆత్మ ప్రబోధము ఇతనిని పోరాట పథము నుండి నిర్గమింపజేసినది. మహాత్ముని అహింసాత్మక ప్రబోధనలు బహుశః ఇతనికి వెలుగు బాట చూపియుండవలెను. ఆత్మత్యాగము తప్ప మరి మార్గము లేదు. దానినే ఇతడు వరించి 1924 మే నెల మొదటి వారమున 7వ తేదీని ఒక ఏటి ఒడ్డున స్నానమాచరించుచు దగ్గరలో నున్న సైనికులకు వశమయ్యెను. తరువాత మన విప్లవ వీరుడు కర్కశ హృదయుడగు గూడాల్ సేనాని ముష్కర తుపాకికి గురి చెయ్యబడెను. దుర్మార్గుడగు గూడాల్ ఈ సాధు సత్తముడగు విప్లవ వీర కిశోరుని అంతమొందించుటకే నిశ్చయించుకొనుట విషాదకరము.

అప్పటి సీతారామరాజు వయస్సు 27 సం॥ రములు.

1897 సం॥ జూలై 4 వ తేదీన శ్రీ రామరాజు జననముతో ఆంధ్ర రాజకీయాంతరిక్షమున బాల భానోదయమైనది. 1924 సం॥ మే నెల 7 వ తేదీన విప్లవయోధుని అంతిమయాత్ర జరిగినది. సుమారు మూడు సంవత్సరములు స్వాతంత్ర్య దీప శిఖను జాజ్వల్యమానముగా వెలిగించిన ఆంధ్ర పుత్రుడు, పుణ్య పురుషుడు సీతారామరాజు ఆంధ్ర జాతి ఉత్తమోత్తమ విప్లవకారుడు.

నేడు విప్లవ వీరుడు రామరాజుకు ముక్కోటి ఆంధ్రులు జోహారులర్పిస్తున్నారు. అమరజీవి శ్రీ రామరాజుకు మన నమోవాకములు.

కొత్త పారిశ్రామిక ఎస్టేటులు

పోయిన నెల రాష్ట్రంలో కొత్తగా రెండు పారిశ్రామిక ఎస్టేటులు ప్రారంభించబడినాయి. విజయవాడ పారిశ్రామిక ఎస్టేటు రూ. 22.33 లక్షల ఖర్చుతో నిర్మించబడింది. పట్టణానికి ఐదు మైళ్ళ దూరంలో మచిలీపట్నం ట్రంకు రోడ్డు మీద స్థాపించబడింది. దీన్ని కేంద్ర పరిశ్రమల మంత్రి శ్రీ మనూభాయి షా జూన్ 14వ తేదీన ప్రారంభించారు. ఈయనే జూన్ 15వ తేదీన వంరంగల్లులో మరో పారిశ్రామిక ఎస్టేటుకు కూడ ప్రారంభోత్సవం జరిపారు.

విజయవాడ సభలో ప్రసంగిస్తూ కేంద్ర మంత్రి హైదరాబాదు సమీపంలో వున్న సనత్‌నగర్ పారిశ్రామిక ఎస్టేటు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శ ఎస్టేటు అయిందన్నారు. ఈ మధ్య ఆయన శ్రీనగర్ వెళ్ళినపుడు అక్కడ నిర్మాణదశలో వున్న పారిశ్రామిక ఎస్టేటు సనత్‌నగర్ ఎస్టేటు మోడలులో స్థాపించ బడబోతున్నదని తనకు చెప్పబడినట్టు వెల్లడించారు. విజయవాడ ఎస్టేటుకూడ చక్కని పరిసరాలలో నిర్మించ బడింది. పెద్ద పరిశ్రమలతోనే భారత దేశాన్ని పారిశ్రామికం తం చేయలేము లఘు పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు అభివృద్ధి చేయాలి తృతీయ ప్రణాళికా కాలంలో లఘు పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ. 27 కోట్ల మొత్తాన్ని కేటాయించింది. పట్టణ ప్రాంతాలలో 500 పారిశ్రామిక ఎస్టేటులు, గ్రామీణ ప్రాంతాలలో 1000 ఎస్టేటులు నెలకొల్పాలని ఆశించబడుతోంది.

ఋణసహాయ పథకం

లఘు పరిశ్రమలను ప్రోత్సాహ పరచటానికి రిజర్వు బ్యాంకు ద్వారా కేంద్ర ప్రభుత్వం ఒక ఋణసహాయ కార్యక్రమాన్ని ఆరంభించింది భారీ పరిశ్రమల మీదకంటే చిన్న పరిశ్రమల మీద ఆధారపడవచ్చునని అనుభవం మీద వెల్లడయింది. వెనుకబడిన ప్రాంతాలలోనూ, అభివృద్ధి జెందని ప్రాంతాలలోనూ పరిశ్రమలను స్థాపించటానికి ప్రభుత్వ ఋణ సహాయాన్ని చిన్నచిన్న పారిశ్రామిక పోషకులు పూర్తిగా వినియోగించుకోవాలి. కళాశాలనుండి బయట పడిన యువక సాంకేతిక నిపుణులు, శాస్త్రజ్ఞులు, ముందుకు వచ్చి, లఘు పరిశ్రమలను ప్రారంభించవలసిందిగా శ్రీషా విజ్ఞప్తి చేశారు. వాళ్ళు పెట్టుబడిలో 5 శాతం ఇస్తే చాలు. మిగతదానిలో 80 శాతం కేంద్ర ప్రభుత్వమూ, తతిమ్మా 15 శాతం రాష్ట్ర ప్రభుత్వమూ భరిస్తుంది. ఒకేరకమైనవి అనేక పరిశ్రమలు ప్రారంభించే అలవాటుకు స్వస్తి చెప్పి, కొత్తవి, ఆధునికమైన పరిశ్రమలను ఆరంభించ వలసిందిగా పారిశ్రామిక వాదులకు సలహా నిచ్చారు రూ. 25 లక్షల పెట్టుబడితో కాగితం తయారీకి 10 టన్నుల ప్లాంటును నెలకొల్పవచ్చుననీ, నిజామాబాదు జిల్లా బోధన్‌లోని నిజాం పంచదార ఫాక్టరీకి జంటగా, అక్కడి "బాగాస్" ను ఉపయోగించు కోటానికి 100 టన్నుల కాగితం ఫాక్టరీని స్థాపించేదుకు గాను రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలో కేంద్ర ప్రభుత్వం గ్రాంటు నివ్వబోతోందనీ కేంద్రమంత్రి వివరించారు. ఆంధ్ర ప్రదేశ్‌లో బియ్యం చిట్టు నూనె ప్లాంటును (rice bran oil plant) ప్రారంభించ వచ్చునీ, ఇది లాభదాయక మవుతుందనీ ఆయన సూచించారు. దేశంలో నెలకొల్పబోయే ప్రోటోటైప్ ఉత్పత్తి-శిక్షణ యునిట్లు నాల్గింటిలో ఒకటి ఆంధ్ర ప్రదేశ్‌లో స్థాపించబడుతుందని శ్రీ మనూభాయి షా వెల్లడించారు.

రాష్ట్ర లఘు పరిశ్రమల మంత్రి శ్రీకొండా లక్ష్మణ్ బాపూజీ, ఎస్టేటును ప్రారంభించవలసిందిగా కేంద్రమంత్రిని కోరుతూ, 22 ఫాక్టరీ భవనాలు, విద్యుచ్ఛక్తి, నీటి సరఫరా, ఇతర సదుపాయాలతో కలుపుకుని మొత్తం

22.33 లక్షలు ఖర్చయిందని అన్నారు. ఎస్టేటు మొత్తం విస్తీర్ణం 54 ఎకరాలు. ఒక పోస్టాఫీసును, స్టేటు బ్యాంకు బ్రాంచిని తెరువబోతున్నారు.

వరంగల్లు ఎస్టేటు

తృతీయ ప్రణాళికలో-హైదరాబాదులో ఒక సెంట్రల్ ఇండస్ట్రియల్ సర్వీసింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూటును స్థాపించటానికి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిదని, రు. 11 28 లక్షల వరంగల్లు పారిశ్రామిక ఎస్టేటును ప్రారంభిస్తూ కేంద్ర పరిశ్రమల మంత్రి అన్నారు.

దేశంలో సాధించిన పారిశ్రామిక పురోగతిని సమీక్షిస్తూ 1947లో మనదేశం 18 లక్షల బేళ్ళనూలు ఉత్పత్తి చేస్తూండగా ప్రస్తుతం 300లక్షల బేళ్ళు ఉత్పత్తి అవుతుందనీ, అలాగే స్వాతంత్ర్యం రాకపూర్వం సంవత్సరానికి 65 కోట్ల గజాల వస్త్రం దిగుమతి చేసుకునేటటువంటి పరిస్థితి, యీనాడు 55 కోట్ల గజాలు ఎగుమతి జేయగలిగే వరకు వచ్చిందనీ అన్నారు.

ప్రథమ, ద్వితీయ ప్రణాళికల కాలంలో భారతదేశం పారిశ్రామిక రంగంలో ఎంతో అభివృద్ధి జెందిందనీ, తృతీయ ప్రణాళికాంతానికి ఇతర అధిక పారిశ్రామికాభివృద్ధి గాంచిన దేశాలతో సరితూగగలదనీ ఆశించారు.

వ్యవసాయాన్ని శీఘ్రగతిని అభివృద్ధి జేయాలనీ, దేశాన్ని పారిశ్రామిక వంతం చేయాలనీ కేంద్ర మంత్రి నొక్కి వక్కాణించారు. ప్రథమ, ద్వితీయ ప్రణాళికలను, త్వరలో ప్రారంభం కానున్న తృతీయ ప్రణాళికను తయారు చేసేటపుడు ప్రణాళికా నిర్మాతలు పై విషయాలే దృష్టిలో పెట్టుకున్నారు. మన దేశానికున్న వ్యవసాయ సంపద ప్రపంచంలోకెల్లా అగ్రగణ్యం.

బ్రహ్మాండమైన పురోగమనం

దేశం సాధించిన అభివృద్ధికి ఉదాహరణంగా ఎరువుల ఉత్పత్తిని ప్రస్తుతించారు. స్వరాజ్యం రాకముసువు ఎరువులు 3 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అయేవి. అలాంటిది తృతీయ ప్రణాళిక ముగిసేనాటికి 10 లక్షల టన్నులు ఉత్పత్తి జేయగలుగుతాం.

భారీ, మధ్యరకం, లఘు పరిశ్రమల అభివృద్ధికి గాను కేంద్ర ప్రభుత్వ పెట్టుబడి విధానాన్ని గురించి ప్రసంగిస్తూ, ప్రథమ ప్రణాళికలో వీటికి రు. 800 కోట్ల పెట్టుబడి అయితే, ద్వితీయ ప్రణాళికలో రు 2500 కోట్లకు పెరిగిందనీ, తృతీయ ప్రణాళికాంతానికి రూ. 4800 కోట్లకు చేరుతుందనీ అన్నారు. స్వాతంత్ర్యం సముపార్జించుకుని బాల్యావస్థలో వుండగానే పారిశ్రామికీకరణలో మన్దేశం అభివృద్ధి గాంచినంత వేగంగా మరేదేశమూ అభివృద్ధి జెందలేదు. ఈ రంగంలో మనతో సరితూగ గలవారు లేరు.

ప్రభుత్వ ఉద్దేశమేమంటే స్వల్పవ్యయంతో ఎక్కువ మొత్తం ఉత్పత్తి జేయటమే భారీ పరిశ్రమల విషయం చూసినపుడు మనం యీ నాడు 160 లక్షల టన్నుల ఉక్కు ఉత్పత్తి జేస్తున్నాం. ఇదే మూడో ప్రణాళిక ముగిసే నాటికి 1 కోటి టన్నుల పరిపూర్ణ పారిశ్రామిక ఉక్కు ఉత్పత్తి జేయబడుతుంది. భారీ యంత్రాల భాగాలు తయారుజేసే రాంచీలో మూడో ప్రణాళిక అయిపోయేనాటికి, సంవత్సరానికి మనం ఒక ఉక్కు కర్మాగారం స్థాపించుకోగలిగేలా యంత్రాల భాగాలు తయారు జేయబడుతాయి. సోవియట్ రష్యా జెకోస్లొవేకియాల సహకారంతో దేశంలో మరో రెండు విద్యుచ్ఛక్తి కర్మాగారాలు నెలకొల్పబడుతున్నాయి.

హైదరాబాదులో ఒక మందుల ఫాక్టరీని స్థాపించటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. యిక్కడ సాగాటూల్సు కార్పోరేషనును మేజరు ఉత్పత్తి కర్మాగారంగా అభివృద్ధి జేయటం జరుగుతుంది. తృతీయ ప్రణాళిక ఆఖరుకు రు. 180 కోట్ల విలువజేసే మందులు ఉత్పత్తి జేయబడుతాయి.

దేశాన్ని పారిశ్రామికవంతం జేయటంలో ముందుకు వచ్చి ధనం పెట్టుబడి బెట్టాలనీ, వారికి అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తుందనీ కేంద్ర పరిశ్రమల మంత్రి రాష్ట్రంలోని పారిశ్రామిక పెట్టుబడిదార్లను విజ్ఞప్తి చేశారు. పారిశ్రామిక ఎస్టేట్లలో సమకూర్చబడిన సదుపాయాలను వినియోగించుకోవలసిందిగా యువకుల నుద్బోధించారు.

అంతకు ముందు సభికులకు స్వాగతం చెబుతూ రాష్ట్ర మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ, ఈ కార్యక్రమం వల్ల పొందే లాభాలను వీలయినంతమేర విస్తరింపజేసే

ఉద్దేశంతో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రతి జిల్లాలో కనీసం ఒక్కొక్క పారిశ్రామిక ఎస్టేటునయినా స్థాపించాలని నిర్ణయించిందన్నారు. సహకార పద్ధతి మీద పారిశ్రామిక ఎస్టేట్ల స్థాపనను పెంపుగావించి ప్రోత్సహించటానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కూడ శ్రీ బాపూజీ అన్నారు.

కేంద్రంలో వున్న జాతీయ లఘు పరిశ్రమల కార్పోరేషను తీరులో రాష్ట్ర స్థాయిన ఒక కార్పోరేషనును యేర్పాటుగావించే కృషి కొనసాగుతూవుంది. ఇది త్వరలో అవతరిస్తుంది. ముడి పదార్థాలు, యంత్రాంగం సరఫరా, ఉత్పత్తి జేసిన వస్తువులకు మార్కెటింగ్ సదుపాయాలను కల్పించటంతోసహా అనేక విధాల చిన్న పరిశ్రమదారులకు ఈ కార్పోరేషను సహాయం జేస్తుంది

ఆంధ్ర ప్రదేశ్‌కు ఉక్కు కర్మాగారం కోసం అభ్యర్థన

ఆంధ్ర ప్రదేశ్‌లో ఒక ఉక్కుగారాన్ని స్థాపించే సూచనను పరిశీలించవలసిందిగా శ్రీ షాకు రాష్ట్ర మంత్రి విజ్ఞప్తి చేశారు. శ్రీ లక్ష్మణ్ ఇంకా ఇలా అన్నారు: "ప్రత్యేక ఉక్కును ఉత్పత్తి జేసే వాణిజ్య యూనిట్లు ప్రస్తుతం దేశంలో ఎక్కడా లేవు గనుక, అందుకుగాను ఆంధ్ర ప్రదేశ్‌లో ఒక ఉక్కు కర్మాగారాన్ని నిర్మించవలసిన ఆవశ్యకతమీద మేము ఈవరకే ఒక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేశాం. ఈ నివేదిక కేంద్రంలోని నిపుణులచే పరిశీలించబడుతూ వుంది".

ప్రాముఖ్యతతో కూడిన యీ పథకంమీద త్వరలో ఒక నిర్ణయం తీసుకున్నట్టయితే పారిశ్రామిక రంగంలో రాష్ట్ర భవిష్యత్తుకు శుభం చేకూరుతుంది. అలా చేసిన యెడల ప్రత్యేక ఉక్కును తయారు చేసే యీ ప్రాజెక్టు తృతీయ ప్రణాళికలోనే వాస్తవ రూపం ధరిస్తుంది.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రణాళికాభ్యుదయం

(8 వ పేజీ తరువాయి)

తద్వారా విద్యుచ్ఛక్తి ఉత్పాదన శక్తి 5.42 లక్షల కిలోవాట్ల స్థాయికే, తలసరి సగటు వినియోగ 40 యూనిట్లకూ పెరుగుతుంది. పారిశ్రామికాభివృద్ధి నిమిత్తం కేటాయించిన మొత్తం, ద్వితీయ ప్రణాళికలో అందుకుగాను కేటాయించిన ఖర్చుకు సుమారు నాలుగు రెట్లు వుంటుంది. ఈ పద్దుకింద ద్వితీయ ప్రణాళిక కేటాయింపు రు 11 కోట్లు అయితే, తృతీయ ప్రణాళికలో రు .5 కోట్లు కేటాయించారు.

మన రాష్ట్ర ప్రథమ, ద్వితీయ ప్రణాళికలో సాంఘిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్య క్రమంలో తగిన స్థానం రాలేదు. అందువల్ల యీ లోపాన్ని, ముఖ్యంగా విద్య, ఆరోగ్య, గృహ నిర్మాణ సౌకర్యాల విషయంలో కొంత వరకైన సవరించుకోవడం తప్పని సరి అవుతుంది, అందువల్ల యీ పద్దుకింద రు 93 కోట్లు, అంటే ప్రణాళిక మొత్తంలో 19.31 శాతం కేటాయించ బడింది. మన తృతీయ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాలు మన రాష్ట్ర శక్తి సామర్థ్యాలకు అందుబాటులోనే వున్నవి. కాని మనకున్న వనరులను ప్రయోజన కరంగా సమీకరించు కొనడంలోనూ, అంగబలం, అర్థ బలాలను సమకూర్చుకొని వివిధ పథకాలను వేగంగా అమలు పరచుకొనడంలోనూ తీవ్రంగా ప్రయత్నం చేయవలసిన అవసరం మాత్రం వుంటుంది, దృఢ సంకల్పంతో మన బాధ్యతలను నిర్వహించుకోటానికి మనం సిద్ధంగా వుంటే, తృతీయ ప్రణాళికా కాలంలో మన రాష్ట్రాభివృద్ధి కోసం మనం వెలిబుచ్చిన కోర్కెలను అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ప్రణాళికా సంఘం వారు కూడా సుముఖంగా పరిశీలించి, ఆమోదించటానికి అవకాశం వుంటుంది. ఆ విధంగా మన తృతీయ ప్రణాళికకు అందరి ఆమోదం లభిస్తుందని ఆశిద్దాం.

రాగస్మృతి

— విశ్వనాథ కవి

నీ హృదయాబ్ధిలోతుల జనించు సద్గుణ రత్న దీపిత
స్నేహ తరంగ మాలికల చిందులు నాకనువిందులై, నవో
త్సాహ మహోన్నతాంబర పథమ్ములఁ దేల్చెను నా యెదన్ ⋅ భవ
న్మోహన రాగ సౌరభ సముజ్జ్వల గాన మరుత్ప్రసారణన్ ।

* * *

నీ నునుఁజెక్కుటద్దముల నిద్దములౌ చిఱునవ్వు వెన్నెలల్
జాను హొరంగులీన, జిగిసౌరు వెలార్చెడు నెమ్మొగమ్మునన్
గానఁగ వచ్చు మేల్పసిడి కమ్మని వన్నెల త్రుళ్లగింతలన్
దేనియ సోనలం గురియు తీయని నీనుడు లెప్డుఁ గోరెదన్ ।

* * *

నీలి కనీనికల్ తళుకు నిగ్గుల కల్వల తోరణమ్ములన్
వ్రేలఁగఁజేయ నేత్రముల విచ్చి ననుంగని, నవ్యకావ్యమున్
గేలను బూని, మెల్ల మెలఁ గిన్నర కంఠము నెత్తి భావగీ
తాలను బాడుచున్ ప్రణయతన్మయత న్గను నిన్ను మెచ్చెదన్ ।

నియమబద్ధమయిన రచన మార్గ కవితగానూ, నియమబద్ధము కాని రచన దేశకవితగానూ పేర్కొన్నట్లు గానే- నియమబద్ధ సంగీతం మార్గసంగీతమనీ, నియమబద్ధముకాని సంగీతం దేశి సంగీతమనే పేర్కొన్నారు.

—'మన ప్రాచీన కళలు-ఎల్లోరా'

గ్రామస్థుల రేడియో గోష్ఠి:

కోళ్ల పరిశ్రమ-వాటి రోగాలు, నివారణ

— వి. గురుమూర్తి

ప్రపంచములోని ఇతర దేశములతో మన దేశమును పోల్చిచూచిన కోళ్ల పరిశ్రమ అంత చెప్పుకోదగ్గ పరిస్థితిలో లేదని మనము ఒప్పుకొనక తప్పదు. ఇప్పటికి మన గ్రామము లందు కోళ్ల పెంపకము పురాతన పద్ధతిలో ఇంటింటికి మూడో, నాలుగో దేశీ కోళ్లనుంచుకొని అవి స్వేచ్ఛగా తిరిగి, దొరికినంత ఆహారము తిని, ఇచ్చినన్ని గ్రుడ్లు ఇవ్వగా వాటితో తృప్తి చెందుటయే అలవాటుగా నున్నది. శాస్త్రీయమైన పద్ధతిలో కోళ్ల పెంపకము ప్రతి గ్రామము నందును ప్రజలు ఆచరించిన, మన ఆహార సమస్యను కొంత వరకు పరిష్కరించుటయే గాక, ప్రజలకు కొంత ఎక్కువ ఆదాయమును గూడ సమకూర్చుననుటలో సందేహములేదు, ఈ విషయమును గుర్తించియే కేంద్ర ప్రభుత్వము, మన రాష్ట్ర ప్రభుత్వము ప్రతి జిల్లాలోను కోళ్ల విస్తరణ కేంద్రములను నెలకొల్పి, గ్రామీణ జనులకు శాస్త్రీయమైన కోళ్ల పెంపకం నిదర్శన పూర్వకముగా చూపించుటకు పాటుపడుచున్నవి.

కోళ్ల పరిశ్రమలో గమనించవలసిన విషయములు కొన్ని ముఖ్యమైనవి గలవు. అవి(1) పర్సనల్ ఎటెంషన్, అనగా స్వకీయమైన శ్రద్ధ చాల అవసరము. వాటి ఆహార విషయములోగాని, వాటికి కావలసిన తదితర వసతులకు గాని పనివాండ్రపై పూర్తిగా ఆధారపడక తాము కూడ ప్రతీ రోజు చూచుకొనవలసి యున్నది. లేనియెడల కోళ్ల పరిశ్రమ లాభ దాయకము కానేరదు (2) ఆయా ప్రాంతములకు సరియయిన జాతి కోళ్లను ఎంచుకొనుట కూడ ముఖ్య అవసరము. మన దేశీ కోళ్లు సంవత్సరమునకు అరవై గ్రుడ్లకన్నా ఎక్కువ పెట్టవు. దీనికి కారణము (ఎ) జాతి లక్షణము. (బి) తగిన ఆహారము లభింపకుండుట. (సి) కోడి పెట్టలు తరచు పొదుగునకు వచ్చుట. విదేశీ కోళ్ల జాతులలో కొన్ని తగిన పరిస్థితులలో (120) నుండి (150) గ్రుడ్లు ఇవ్వగలవు. మన రాష్ట్రములో పెంచదగు విదేశీ జాతులు రెండు ముఖ్యమయినవి. (1) వైట్ లెగ్ హారన్సు. (2) రోడ్ ఐలాండ్ రెడ్స్. ఇవి సంవత్సరమునకు 120 గుడ్లకు పైగా పెట్టును. పొదుగునకు రావు. వాటికి తగిన నివేశన స్థలము కల్పించుట. సాధారణముగా ఒక్కొక్క కోడిపెట్టకు, పుంజుకు 2 నుండి 4 చదరపుటడుగుల స్థలము ఏర్పాటు చేయవలెను. నెలలోపు వయస్సుగల పిల్లలకు ఒక చదరపుటడుగునకు 20 పిల్లలకు మించకుండ స్థలముండవలెను. అదియునుగాక వాటికి తగిన సూర్యరశ్మి, స్వేచ్ఛగా గాలి పొలుదల, నేలచెమ్మ లేకుండుట మొదలగు వసతులను కల్పింపవలెను, ఊకగాని, వేరుశెనగ పొట్టుగానీ నేలమీద పరచుటచాల మంచిది. లేనిఎడల కోళ్లకు దేహదార్ఢ్యము తగ్గి, వ్యాధులు జొరబడుటకు అనువైన పరిస్థితులేర్పడును. (4) అన్నింటికి ముఖ్యమైన విషయము వాటికి తగిన ఆహారము నిచ్చుట. అనగా కావలసిన పిండి పదార్థములు, క్రొవ్వు పదార్థములు, మాంసకృత్తులు. విటమినులు, ఖనిజములు సరియయిన పాళ్లలో కలిపి ఇవ్వవలెను. ఈ క్రింద వివరింపబడిన ఆహారము బాగుగా అన్ని వయస్సుల కోళ్లకు ఉపకరించును.

జొన్నపిండి – 20 పాళ్లు   రాగి పిండి – 20 పాళ్లు.

బియ్యపు తవుడు—10 పాళ్లు	గంటి పిండి—10 పాళ్లు.
పాలపొడి 5 పాళ్లు,	వేరుశెనగపిండి—20 పాళ్లు.
చేపపొడి 10 పాళ్లు,	ఖనిజలవణముపొడి 2 న్నర పాళ్లు,
చేపనూనె—2 పాళ్లు,	ఉప్పు అరపాలు.

యీ మిశ్రమమును వయస్సును బట్టి అరఔన్సునుండి, రెండు, రెండున్నర ఔన్సులవరకు ఇవ్వవచ్చును. వేరుగా గింజలు ఇవ్వనక్కర లేదు అదియునుగాక ల్యూసరిన్ ల్యూసర్ను గడ్డిగాని, తోటకూర గాని, తదితర ఆకుకూరలు గాని తప్పనిసరిగా ప్రతిరోజు ఇవ్వవలెను.

కోళ్ల వ్యాధులు

వ్యాధులకు అనువగు పరిస్థితులు కొన్ని తెలిసికొన వలయును. (1) కోళ్లు గాని, కోడిపిల్లలు గాని కావలసినంత నివసించు స్థలములో నుండక ఎక్కువ కిక్కిరిసియుండిన ఒకటినొకటి పొడుచుకొని రెక్కలూడగొట్టుకొనుట, గాయములు గల్గించుకొనుట జరుగును. యీ కారణముచే చిన్న పిల్లలలో ఎక్కువ మరణములు తఱచు సంభవించును. (2) వాటిని ఉంచు స్థలమునందు సరియయిన గాలి పాఱుదల లేనిచో గాని, నేల ఎక్కువ చెమ్మగా నున్నను, ఊపిరితిత్తుల వ్యాధులకు సులభముగా గురియగును. (3) సమగ్రాహారము (బేలెన్సుడ్ డయట్) అనగా కావలసిన ఆహారపదార్థములు తగిన పాళ్లలో లభింపకపోయిన దేహదార్ఢ్యము తగ్గి వ్యాధులకు సులభముగా గురియగును. విటమిను 'ఎ' తగ్గినచో జలుబు, నోటిలో కురుపులు మొదలగు వ్యాధులు వచ్చును. విటమిను (బి) తక్కువ ఐనచో ఎముకలు వంగిపోవుట తటస్థించును. ఖనిజలవణములు తక్కువయినచో తోలు గ్రుడ్లు పెట్టుట, ఒకటి కొకటి యీకలు లాగికొనుట మొదలగునవి సంభవించును. (4) ఏలిక పాములు, గుండ్రని పాములు మొదలగునవి ప్రేవులలో చేరినను, లేక గోమారులు, పేలు మొదలగు కీటకములు దేహముపై ఆవరించినను, కోళ్లు దేహదార్ఢ్యము తగ్గి, వ్యాధులకు గురియగును. కావున పై విషయములు శ్రద్ధతో గమనించిన కోళ్ళ రోగములను చాలామట్టుకు నివారించవచ్చును.

రక్తస్రావణి

యీ వ్యాధి సాధారణముగా కోడి పిల్లలకు మూడు వారముల వయస్సు నుండి నాలుగు, ఐదు నెలల పిల్లల వరకు వచ్చును. చిన్న పిల్లలలో మరణములు ఎక్కువగా నుండును. సకాలములో తగిన వైద్యము చేయించని ఎడల చాల పిల్లలు నశించును. యీ వ్యాధికి కారణము కోడి పిల్లల ప్రేవులలో చేరు ఒక సూక్ష్మజీవి. వ్యాధి తగిలిన పిల్లలు మత్తుగానుండుట, ముడుచుకొని స్తబ్దుగా నిలబడుట. విరేచనములో రక్తము పడుట, ఎక్కువ పిల్లలు ఒకేమారు జబ్బుతో నుండుట మొదలగునవి యీ వ్యాధి ముఖ్య లక్షణములు కోడిపిల్లలకు 10, 12 రోజుల వయస్సు రాగానే 'ఎంబజిన్' అను మందు ఒక గాలను నీళ్ళలో ఒక ఔన్సు కలిపి త్రాగుటకు నీళ్ళకు మారుగా ఇవ్వవలెను యీ మందు నీరు వాడునపుడు, పిల్లలకు త్రాగుటకు మరేమియు ఇవ్వకూడదు. యీ మందు నీరు వరుసగా మూడు రోజులిచ్చి. రెండు రోజులు ఆపివేయవలెను. మరల వరుసగా మూడు రోజులు మందు నీరు ఇవ్వవలెను. క్రమము తప్పక యీ పద్ధతి ప్రతిమారు పిల్లలను చేసినపుడు వాడవలెను. ఒక వేళ వ్యాధి జొరబడినచో, ఎంబజిన్‌కు బదులు 16 శాతముగల సల్ఫామెజతిన్ వాడవలెను. కాని ఇది గాలను మంచినీళ్ళకు రెండు ఔన్సుల చొప్పున వాడవలెను.

కోళ్ల మసూచి

ఇది సాధారణముగా చిన్న కోడి పిల్లలకు వచ్చును. వ్యాధి జొరబడినచో తొందరగా ఇతర పిల్లలకు వ్యాపించును. యీ రోగము కోడి పిల్లలలో మూడు రకములుగ వచ్చును. జుత్తు మీదను, ముఖము మీదను, ముక్కు మీదను, నోటి అంచులందును, కాళ్ళ మీదను మొదట పసుపు పచ్చని బొబ్బలు కనబడును. 4, 5 రోజులలో అవి వాడి నల్లటి పొడలుగ మారును. జ్వరము ఎక్కువగా ఉండి కోడి పిల్లలు మేత మేయక త్వరతో చనిపోవును. రెండవ రకములో నోటి లోపల, నాలుక మీద, గొంతు లోపల, పసుపు పచ్చని మీగడ తెలకల లాగు వచ్చును. వీటిని వ్రేలితో తొలగించిన వాటి క్రింద ఎఱ్ఱటి పుండు కనిపించును. వీటివలన ఊపిరాడక పిల్లలు చనిపోవును. మరియొక రకము జబ్బులో ముక్కు రంధ్రముల నుండి నీరు

కారును. క్రమముగా అది చీమిడిగా మారును. కండ్ల నుండి నీరు కారి, కంటి రెప్పలు అంటుకొని పోవును. తగిన చికిత్స చేయించని ఎడల, పిల్లలు ఆహారము మాని చనిపోవును. అయినను, జబ్బు తగిలిన పక్షులకు వైద్యము చేయించినను అంత ప్రయోజనముండదు జబ్బు రాకుండ గనే వ్యాధి నిరోధక టీకాలు వేయించుకొనుట మంచిది.

కోడి పిల్లలకు పది రోజులు వయస్సు రాగానే ఒక మాఱు, మరల ఏడు, ఎనిమిది వారముల వయస్సు రాగానే మరొక మారు దగ్గఱనున్న పశువుల డాక్టరుగారిచే టీకాలు ఇప్పించవలెను. పెద్ద కోళ్లలో యీ జబ్బు వచ్చిన వచ్చిన అంత హానికరముగాదు.

కోళ్ల అంటువ్యాధులలో చాలా ఎక్కువగా నష్టపరచు వ్యాధులలో ఇది ఒకటి. మాంద్యముగా నుండుట, మేత తినకపోవుట, రెక్కలు, కాళ్లు, నేలబడుట; ఆకుపచ్చ తెలుపు రంగుల విరేచనములు, జుత్తు నల్లగా మారుట, వ్యాధి కనబడిన 3,4 రోజులలో ఎక్కువ పక్షులు ఉన్నట్టుండి ఎక్కువగా మరణించుట, యీ వ్యాధి ముఖ్య లక్షణములు. యీ వ్యాధి వచ్చిన పక్షులకు చికిత్సయేలేదు.

యీ వ్యాధికి కోడిపిల్లలకు 5, 6 వారముల వయస్సులో పశువుల డాక్టరుగారివద్ద టీకాలు వేయించుకొనుటే తరుణోపాయము సాధారణముగా యీ టీకాలవలన పక్షులకు ఏవిధమైన నలత కనబడదు ఒకసారి టీకాలు వేయించిన సుమారు ఒకటినుండి ఒకటిన్నర సంవత్సరము వరకు మరల టీకాలు వేయించనక్కర లేదు.

కోళ్లకు గోమారులు ఎక్కువగా పట్టినపుడు వాటివలన యీ వ్యాధి ఒక పక్షినుండి ఇంకొకపక్షికి వ్యాపించును, యీ వ్యాధి అతి తీవ్రముగా కనుపించి, ఒక్కొక్కపుడు తెల్లవారునప్పటికి కోడిగూళ్లలో చాలపక్షులు చనిపోయి కనబడును, పక్షులు ఒకటి, రెండు రోజులు బ్రతికి యున్నచో పక్షులకు ఎక్కువ జ్వరము, నలతగాను, మత్తుగాను, నిలబడియుండుట, రెక్కలు నేలబడుట, విరేచనములు, మొదలగు లక్షణములు కనుపించును, జ్వరముగా నుండి పక్షుల రక్తమును సూక్ష్మదర్శినితో పరీక్షించిన క్రిములు కనబడును.

పక్షులను గోమారులబారినుండి తప్పించవలెను. ఇందులకు ప్రతిపక్షి దేహముమీద గమాక్సిను అను పొడిని బాగుగా చల్లవలెను. కోడిగూళ్లు, గోడలు, తలుపులలో నుండు పగుళ్లకు బాగుగా కాల్చవలెను. వ్యాధి నివారణ తర్వాత, జబ్బుతోనుండు పక్షులకు, వాటితో కలిసియుండు ఇతల కోళ్లకు దగ్గరనున్న పశువుల డాక్టరుగారిచే చికిత్స చేయించవలెను. సాధారణముగా 15,000 నుండి 20,000 యూనిట్లవరకు పెన్సిలిను వరుసగా మూడు రోజులు కండరములోనికి ఇంజక్షనులు ఇప్పించవలెను. వ్యాధి నివారణోపాయము కోళ్లను గోమారులబారినుండి తప్పించండమే.

యీరోగము ఇటీవల మన రాష్ట్రములో ఎక్కువగా కనబడి, కోళ్ల నష్టము గలిగించుచున్నది. యీ వ్యాధి కోడిపిల్లలలో 3, 4 నెలల వయస్సులో ఎక్కువగా కాన్పించును, మొట్టమొదట ముక్కురంధ్రముల నుండి నీరు కారును క్రమముగా అది చిక్కగాను, పసుపు పచ్చని చీమిడిగామారును ఒక్కొక్కప్పుడు ముక్కు రంధ్రము లందు నుఱుగు కన్పించవచ్చును. కండ్లలో నీరు కారుట, కంటిరెప్పలు వాచుట కండ్లురెప్పలు అంటుకొని పోవుట, కంటిగుడ్లు నశించుట జరుగును, యీ కంటి బాధతో కోడిపిల్లలు ఆహారము తినక, బలహీనతతో చనిపోవును. మరికొన్ని పక్షులలో నోటిలోను గొంతులోను, ఊపిరి గొట్టములోను చీమిడి ముద్దలుగా చేరి, ఊపిరి ఆడక చనిపోవుట కూడ గలదు, వ్యాధి నుండి నయమైన పక్షులు జబ్బు వ్యాపకమునకు హేతువగును.

తఱచు 15 లేక 20 రోజుల కొకమారు ప్రతికోడి యొక్కముక్కు రంధ్రములను నొక్కి, నీరు కారుటను గమనింపవలెను అట్టి పక్షులను వేరుచేయించి, తక్షణ మియీ క్రింది విధముగా చికిత్స పశువుల డాక్టరుగారివద్ద చేయించవలెను. ప్రతిపక్షికి వయస్సునుబట్టి 50 నుండి 1000 మిల్లీగ్రాముల డైహైడ్రోస్ట్రెప్టోమైసిను వరుసగా మూడు రోజులు కండరములలోనికి ఇంజక్షనులు ఇప్పించవలెను. మూడు వారముల తరువాత యీ పక్షులన్నింటిని మరల ముక్కులను పరీక్షించి ఇంక నీరు కారుచున్నయెడల, మరల మూడు ఇంజక్షను లిప్పించవలెను.

(1) పశులు క్రిక్కిరిసి యుండరాదు. (2) పశుల ప్రేవులలో ఏలికపాములు, గుండ్రని పాములు లేకుండ చికిత్సచేయించుట (3) పశులు నివసించుచోట చెమ్మ లేకుండ చూడవలెను. (4) కండ్ల జబ్బు, గొంతుకలో చీమిడి ముద్దలు కలిగిన పశులను వెంటనే వేరుచేయించి చంపవలెను. (5) వ్యాధినుండి బాగుపడిన కోళ్లను గూడ మందనుండి తొలగింపవలెను.

ఇవిగాక అన్నాశయము కట్టబడుట (క్రాప్ బౌండ్), కోడిపెట్టలలో గ్రుడ్లుఅడ్డుట (ఎగ్ బౌండ్), పాదముల అడుగుభాగమున ఆణి పెరుగుట (బంబుల్ ఫూట్) మొద లగు వ్యక్తిగతమైన చిన్న చిన్నవ్యాదులు అప్పుడప్పుడు కోళ్లలో కనుపించవచ్చును. వీటికన్నింటికి దగ్గఱలోనుండు పశువైద్యునిచే ఉచితముగా చికిత్సచేయించుకొన వచ్చును.

(ఆకాశవాణి సౌజన్యంతో.)

వీడ్కోలు సమావేశాలు అన్నింటిలోకి జపాను వారి సయొనారా.... చాల సొంపుగా వుంటుంది. "ఈ వియోగం తప్పని సరి" అనే బాధా గీతంగా అది గుండెల్లో గ్రుచ్చుకుంటుంది. ఇతర దేశాల వాటి మాదిరిగా గాక, మళ్ళీ మనం కలుసుకునేంత వరకు" లాంటి బడాయిలకు పోయి, వియోగ బాధను ఉపశమింప జేసే ప్రయత్నం వుండదు. "జీవితంలో ప్రవేశించి, మెప్పు సాదించు నాయనా" అనే కన్న తండ్రి ఆశీర్వాదంలో ప్రోత్సాహమూ, హెచ్చరిక రెండూ వున్నాయి ప్రోత్సాహంవల్ల విడిపోయే క్షణం యొక్క ప్రాముఖ్యత కొంత మరుగునపడుతుంది. వియోగబాధ స్ఫురించకుండా మామూలుగా మంచిమాటలలో దానిని కప్పివేస్తూ వుంటారు. నీవు వెళ్లటానికి వీల్లేదు. ''నీవు వెళ్ళటాన్ని నేను భరించలేను. అయినా నీవొక్కడివే తోడులేకుండా వెళ్ళగూడదు. దేవుడు నీతోనేవుంటాడు'' అని వీడ్కోలుసమయంలో చూపులతోనే మనం ఆశీర్వదిస్తాము. కాని సయొనారా ఇటు కొద్దిలోనూ తేల్చేయదు, అటు అమితంగానూ చెప్పదు. సత్యాన్ని ఆమోదించి ప్రకటిస్తుంది. జీవిత పరమార్థమంతా దాని పరిధిలోనే ఇమిడివుంది. ఉద్వేగమూ, హృదయ వేదన దాని వెనుక దాక్కొని వుంటాయి పెదవులనుంచి పూర్తిగా బయట పడిని ప్రియ వియోగ బాధ, సయొనారా

— ఎ. యం. లిండ్‌బర్గ్

* * *

కుటీర పరిశ్రమలకు, చేతి పనులకు చెందిన నాకరికత ఏ కాలమందైనా నిలబడగలదు.

—గాంధి మహాత్ముడు

వొద్దు యుద్ధం

– "శాంతిప్రియ"

మూడు కళ్ల సామి నుదుటి కన్ను
తెరచి నప్పటి కాక
మరోయుద్ధ భూతపు రాక
ఆటమిక్ రక్కసుల మీద
మిక్కుటంగా అలిగి వస్తుధ
గతంలో సతిలా ముక్కలుగా చీలు
మూడవ ప్రపంచ సంగ్రామం
నిజంగా వొచ్చిన రోజు.

వసుంధరాదేవి బతికి బట్ట కట్టాలి పదికాలాలు
మటుమాయ మవ్వాలి మారణాయుధాలు
సర్వనాశనమయ్యాక సార్వభౌముడెవడైతేనేం
ఎవరికయ్యా కాళరాత్రి శ్మశాన గానం ?
రాజ్యా లేలే బాబులకు బాంబులు క్రీడా వస్తువులయితే
హామీ ఏమీలేదు నీ అసువులకు శిశువులకు
హిరోషిమా నాగసాకి స్మృతి
కలచి వైచు నేటికీ విశ్వహృది

అంతవరకు అక్కడ జ్యోత్స్న
అంతలో అంతు లేని వంత
కాళ్లూ కళ్లూ కీళ్లూ లేక ఎందరో
మరి కీనాశుడి పాలబడ్డ వారు వందలు వందలు

ఆటమ్ పిడుగు పడ్డమరుక్షణం
అంతా ఒక దీర్ఘ కాళరాత్రి



శ్రీ అల్లూరి సీతారామరాజు (25 వ పుట చూడుడు)



విజయవాడ పారిశ్రామిక ఎస్టేటు



శ్రీ పూసా రాములు (24 వ పుట చూడుడు.)



వరంగల్ పారిశ్రామిక ఎస్టేటు.

మైళ్ల కొలది రుద్రభూమి, రుధిరభూమి
అయినా తెరవేసేద్దాం గతానికి
మూఢంగా అనికోరే మతానికి
మానవవాదం, నవీనవేదం కావాలి
ఎదనిండి, ఎదనుండి జాలువారాలి జాలి
రమ్యబృందావనంలా పుడమి మారే తరుణం నేడు
గమ్యం చేరబోతున్నాడు అదే నరుడు

ఇపుడు ద్రోహం తలపెట్టకు
సందేహాల అరణ్యంలో
కాందిశీకుడిలా నిలబడకు
నిరుద్యోగనివారణకు మరోసమరం మందు కాదు
ఆ తలపే నోటిలో మిగుల్చు ఒకరకం చేదు

ఒకసారి అన్నాడు ఇలా స్పైనోజా
విను విను వీధి మానిసీ
మకుటం లేని మహారాజా
"కేవలం సంగ్రామం లేకుండుట శాంతి
అనుకోవడం కూడా నిజంగా భ్రాంతి
శాంతి ఒక మనః స్థితి
ఉదార దృష్టి, ఆత్మ విశ్వాసం, న్యాయం
వీటికి అపుడు హృదయమే కైంకర్యం".

కలం పట్టిన ప్రతివాడూ కవి కావడం కష్టం. కంఠం వున్న ప్రతివాడూ గాయకుడు కానూ లేడు. అల్లాగే గానం పట్టిన ప్రతివారూ కానీయండి, కుంచె పట్టిన ప్రతి వారూ కానివ్వండి-శిల్పులు కావడంగాని చిత్రకారులు కావడంగాని జరుగదు.

* * *

వ్యక్తి కానీ, సంఘం కానీ అభివృద్ధి చెందాలంటే ఆంతరంగికంగా నైతికంగా పరిపూర్ణత పొందడానికి కృషి చేయడం వల్లనే సాధ్యం అవుతుంది. ఇదే మానవ జీవిత సూత్రం.

—టాగూరు.

రైతుల అభిప్రాయాలు

ప్రణాళిక పథకాల క్రింద దేశంలో ప్రచారం చేసిన నూతన అభివృద్ధికర వ్యవసాయ పద్ధతులు ప్రోత్సాహకరమైన ఫలితాల నిచ్చాయి. ఒక విలేఖరి కలుసుకోగా మహబూబు నగరం జిల్లా రైతులు వ్యక్తపరచిన అభిప్రాయాలు కొన్ని దిగువ ఉదహరించబడ్డాయి

వేములనెర్వకు చెందిన శ్రీ వెంకట ప్రతాపరెడ్డి: "పంట ఉత్పత్తిని పెంచటానికి శీఘ్రము, తీవ్రమైన మార్గాలలో ఒకటి మేలు రకం విత్తనాల వాడకం. సమాజాభివృద్ధి కార్యక్రమం యీ తాలూకాకు విస్తరింపజేయక పూర్వం నా గ్రామంలో 150 గుడిసెలు వుండేవి. వ్యవసాయంలో ఏమంత ఉత్సాహం వుండేది గాదు. నేను పాత సాగు పద్ధతినే అనుసరిస్తూ వుండే వాడిని. ఎకరాకు ఒక బస్తా విత్తనాల చొప్పున చల్లేవాళ్ళం. పంట ఎకరాకు సుమారు 9 బస్తాలు వుండేది. సంవత్సరానికి రెండు పంటలు. ఒకటి- ఆబి, రెండోది—తాబి.

ఇపుడు సమాజాభివృద్ధి కార్యక్రమం క్రింద బ్లాకు అభివృద్ధి అధికారయిన శ్రీ డి. జె. శామ్యూల్, గ్రామ సేవకుని కృషి ఫలితంగా, ఎకరాకు ఒక బస్తా విత్తనాల చొప్పునే నారు రూపేణా గాకుండా ఒక్కసారే విత్తనాలను ఎదబెట్టే పద్ధతిని అవలంబిస్తున్నా. ఉత్పత్తి ఎకరానికి 15 బస్తాల నుంచి 20 బస్తాలకు పెరిగింది. మేమిప్పుడు పశువుల పెంటతోపాటు రసాయనిక ఎరువులను వాడుతున్నాం.

స్థానికంగా నిల్వజేసే విత్తనాలకు బదులు, యీనాడు మేము వ్యవసాయశాఖ సప్లయి చేస్తున్న మేలి రకం విత్తనాలు ఉపయోగిస్తున్నాం. ఇవి ఎక్కువ ఉత్పత్తిని కూడ ఇస్తున్నాయి. జపాను వరిసాగు పద్ధతి ఇంకా ఎక్కువ ఉత్పత్తిని సాధిస్తుందని విన్నాను. ఈ పద్ధతిని నేనీ మధ్యనే చేపట్టాను. ఇందులో ఉత్పత్తి గతం దానికంటే రెట్టింపు వచ్చింది".

జపాను పద్ధతి వల్ల లాభం

పాపిరెడ్డిగూడ నివాసియైన శ్రీ వెంకటరెడ్డిగారు ఇలా అన్నారు: మామూలుగా వేసే నాటు సాగు పద్ధతి క్రింద నాకు ఎకరాకు 16 బస్తాలు వస్తూండేవి. అయితే జపాను పద్ధతిని అవలంబించటం ప్రారంభించాక ఎకరాకు 30బస్తాలు లభిస్తున్నాయి. ఈ పద్ధతి క్రింద 35 బస్తాలుకూడ సాధించగలను గాని నీటి వనరు పరిమితమై వుంది, చిన్న చెరువుల మీద ఆధారపడటం వల్ల నాటు గడువుకు వేయలేక పోతున్నాను. జపాను పద్ధతి వల్ల విత్తనాలు, కలుపుకు కూలి ఛార్జీలలో కొంత మిగులుతుంది.

కొత్త సాగు పద్ధతులు. ఎరువులు వాడినట్టయితే ఉత్పత్తి సగటున ఎకరాకు 30 బస్తాలు వుంటుంది. ఇంతకు ముందు మేము ఆవు పేడను, కసువును సక్రమంగా వినియోగించ లేదు. ఇప్పుడు మేము వీటిని గుంటల్లో నిల్వజేసి, ఎరువుగా వాడుతున్నాం. మాకు సూపర్ ఫాస్ఫేటు కావాలి. ఇది తగినంతగా అందుబాటు కావటం లేదు.

వరి, జొన్న నా బావి క్రింద పండిస్తున్నా. నేను వంకాయలు, రామములగ, బెండ, ఆకుకూరలు కూడ పండిస్తాను.

చిన్న ప్లాటులను పెద్దవిగా మారుస్తున్నాం. అలా చేసినట్టయితే దున్నటం తేలికవటమే గాకుండా, నీరుకూడ ఎక్కువగా నిలవచేయొచ్చు. భూమి ఎత్తు పల్లాలు లేకుండా చదునుగా కూడ చేయటం అవసరం. సామాన్యంగా దేశవాళీ నాగలినే ఉపయోగిస్తున్నాం. అయితే అపుడపుడూ జపాను పద్ధతి క్రింద పడ్లర్‌ను, వీడర్‌ను వాడుతున్నాం.

ఇంతకు ముందు రోజు కూలీ నాలుగణాలు ఇస్తూండే వాడ్ని, ఇపుడు రోజుకు రూపాయి పావలా.

పంటలకు తగిలే తెగుళ్ళలో స్టెమ్‌బోరర్, ప్యార్మింగ్ కాటర్ పిల్లర్‌లు కొన్ని. గమాక్సేనే, పెరినాక్స్ వాడమన్నారు గాని, ఇవి అదుపులో పెట్టలేక పోతున్నాయి.

మార్కెటింగ్ సదుపాయాలు అసంతృప్తిగా వున్నాయి. నా ధాన్యాన్ని ఎగుమతి జేయవలసిన షాద్‌నగర్ మా గ్రామానికి దగ్గర దగ్గర 10 మైళ్ళు వుంటుంది."

ఒకటి స్థానే రెండు పంటలు

ఫరూఖ్ నగర్‌కు జెందిన శ్రీ సుదర్శన్ : "ఇంతకు పూర్వం నేను సంవత్సరానికి ఒక పంటే పండిస్తూ వుండే వాడ్ని. అయితే గత మూడేండ్ల నుంచి ఆబి, తాబీలవి యేడాదికి రెండు పంటలు పండిస్తున్నాను."

ఆదర్శాలను చర్చించడం ఉత్తముల పద్ధతి; ఏవో కొన్ని సంఘటనలను గురించి ఆలోచించడం మధ్యమం. ప్రజలను గురించి మాట్లాడడం అధమం.

* * *

"నేను మీకు అర్థ వివరణ చేశాను. దానిని గ్రహించే శక్తి కూడ నన్నే యివ్వమంటారా ?" అని సుప్రసిద్ధ ఆంగ్ల పండితుడు జాన్సన్ ఒక మారు కొందరు ప్రొఫెసర్లను ప్రశ్నించాడుట !

* * *

నియమబద్ధమయిన రచన మార్గ కవితగానూ, నియమబద్ధముకాని రచన దేశి కవితగానూ పేర్కొన్నట్లుగానే నియమబద్ధ సంగీతం మార్గ సంగీతమనీ, నియమబద్ధముకాని సంగీతం దేశి సంగీతమనీ పేర్కొన్నారు.

— 'మన ప్రాచీన కళలు—ఎల్లోరా'

తాళ్లపాకమువారి వాఙ్మయము:

పెద తిరుమలయ్యంగారు

— రావూరు ప్రసన్న సత్యనారాయణ

మధుర భక్తి కవితా మంత్రమున పతితల మనసుల రస ధునిలో మంచి యెత్తి మురిపించిన మాన్యమూర్తి తాళ్లపాక అన్నమయ్యం గారు. మాధవ కరుణా కటాక్షముల కుపాయనము గావించిన మధుర భక్తి ప్రసాదమును భక్త శిఖామణులకు పంచిపెట్టిన పరమ వితరణశీలి ఆయన. రూపెత్తిన అతని ఆత్మస్వరూపము పెదతిరుమలయ్యంగారు. తాతపాదుని సంకీర్తములను రాగి రేకులపై చెక్కించి తెనుగున పదవాఙ్మయమునకు రక్షరేకులు గట్టిన మహాభాగు డతడు. అతని చేతి చలువ సాహితీలత పూచిన పుష్పములే. శృంగార సంకీర్తనలు-అధ్యాత్మ సంకీర్తనలు—శృంగార దండకము-శృంగారవృత్త శతకము - వైరాగ్య వచన మాలికా గీతములు - చక్రవాళ మంజరి - వేంకటేశోదాహరణము - నీతి శతకము - సుదర్శనరగడ - రేఫఱకార నిర్ణయము - ఆంధ్ర భగవద్గీత - ఆంధ్ర హరివంశము - మేలుకొలుపు ద్విపదలు. ఇందు కడమ మూటిని చూచు భాగ్యమునకాంధ్రులు నోచి కొనలేదు. ప్రక్రియా వైవిధ్యము ప్రదర్శించిన ప్రజ్ఞామూర్తి పెదతిరుమలయ్యంగారు. సంకీర్తన - దండకము - శతకము - వచనమాలికా గీతము- ఉదాహరణము - రగడ - లక్షణము లే ఆ భిన్న ప్రక్రియలు. తత్త్వతః ఈతని రచనలు శృంగార - వైరాగ్య-నీతి - భక్తి - లాక్షణికతా పటిష్ఠములు.

సంకీర్తనమును ఒక సరస వాఙ్మయ ప్రక్రియగ తీర్చి దిద్దిన సరస్వతీ స్తనంధయు డన్నమయ్యంగారు. భక్తి శృంగార సంగీత వాహినుల కావాఙ్మయమొక ప్రయాగ. ఆ పైతృక సంప్రదాయము నూవముట్టుగ నాకళించుకొనిన వాడు పెద తిరుమలయ్యంగారు. సంకీర్తనమనునది వైదీ భక్తి సంప్రదాయ పద్ధతికి చెందినది. ఆళ్వారుల - పరమ భాగవతుల - చైతన్య సంప్రదాముల యందిది కలదు. భగవన్మాహాత్మ్య కీర్తనమే యిందుద్దిష్టము. శృంగారమొక యెరగానుండినచో ఆ మహత్వము మినసున కెక్కుట సులభము - అనునదియే యీ శృంగార సంకీర్తనముల లేక మధుర భక్తి సంప్రదాయ మూల తత్త్వము. పరమేశ్వరుని మాధుర్యగుణ సంబంధమున అతనిని పెక్కు వ్యక్తిగత సంబంధములతో దర్శించుట సూఫీ తత్త్వము.* అట్టి తత్త్వ మీయన శృంగార సంకీర్తనముల యందు కానవగును.

ఉదా:—

'ఏ మని చెప్పుదునే యిటువంటి వేడుకలు
సరుగ నిండు సిగ్గులు జారి నవ్వుటరీతి
కొంచక వొట్లు వెట్టు కోగా వేడుకొనుటలు
మించి యలుక దీరిన మీఁది మాటలు
ఎంచి నాల్గు నాళ్లు చేసి యెనయునాఁటి తమి
జడియక సురతము సలిపిన మీద నిద్ర'

భక్తు డిట తన్ను స్త్రీగ పరమేశ్వరుని పురుషునిగ భావించుకొని అతని తోడ గావించిన ప్రణయ కలాపమును స్మృతికి తెచ్చుకొనగా మధురోహల హృదయము స్పందించిన

* (See "Glimpses of World Religions–Sufism")

సమయము. కామాతురతచే సిగ్గు నశించుటయు - ప్రణయ కోపమున గల్గిన యలుక దీర్ప వేడికొనుట - మనస్సు ప్రసన్నమైన తరువాత నాడెడి మాటలు - కలయక కలియు చుండెడి నాటి తమి - సురతానంతర సుషుప్తి కన్నులకు కట్టుచున్నవి. అనుభవ మూలమా యని అనిపించు నట్లుండుట వీరి శృంగార వర్ణనయందలి విశిష్ట లక్షణము దక్షిణాంధ్రకృతులలో వలె భావ ప్రధానమైనది వీరి శృంగారము. అంగాంగి వర్ణన కారాట పడుట లేదు. ఈ శృంగార వర్ణనా చాతురిని వారి జీవితముల కన్వయింప జూచుట సాహసమేమో యని అనుకొందును. అట్లన్వయింపనగును దక్షిణాంధ్రయుగ సాహిత్యమున. ఇదియే వీరికిని దక్షిణాంధ్రయుగ కవులకునుగల తారతమ్యము. నన్నపార్య తిక్కనాదు లిట్టి శృంగారము వర్ణింపని యంతమాత్రమున వారి కంటె వీరధికులని చెప్ప జూచుటయు తగదు. ఇరువురి దృక్పథములు వేఱని మాత్రమే గ్రహింపవలెను భక్తి మార్గమున నొక విశిష్ట సంప్రదాయమునకు మార్గదర్శకుడైన మహాత్ముని పుత్త్రిడీ పెద తిరుమలయ్యంగారను మాట మరచి పోరాదు.

సంకీర్తన లక్షణము నీయన కుమారుడు చిన తిరుమలయ్యంగారు ఆనతిచ్చియున్నారు. పైతామహగ్రంథములకు వ్యాఖ్యాన రూపమున జనకుని రచనము లుండునని యాతడే చెప్పియుండుట గమనింపదగ్గది ఇది శతశాత సమగ్ర సత్యము.

ఆవేశాతిరేకమున మనసు నుఱ్ఱూతలూగించి గీతిధర్మ ప్రకృష్ట మగుట విస్మయావిష్ట చేతస్కుల పాఠకుల గావింపగల్గిన ఛందః ప్రక్రియ దండకము. అట్టిది సర్వ ప్రాణి హృద్యమగు శృంగారాను పానమున పరమ ప్రాప్యుడగు భగవంతుని లీలా కథన ప్రధానమైనదగుచో లోపర హితమగు జగత్సృష్టి వంటి దగును. దండక రచనమున నాతని నైపుణము గొప్పది. అందలి శబ్దాలంకారముల జిగిబిగి సాలీడు గూడుకట్టి నట్లుండును

ఒక చిన్న యుదాహరణము:

శ్రీ వేంకటేశ్వరుడొక శృంగార నాయికను కటాక్షించిన సందర్భము:

> 'అయ్యంతి బిట్టులికి- నల్దిక్కులం జూచి
> యక్కాంతు నీక్షించె నచ్చాపులచ్చొత్తి
> నట్లిచ్చలన్ మచ్చికల్ రేచి
> యన్యోన్య రూపంబులం గ్రుచ్చినట్లుండి
> కందర్ప కోదండ ముక్తారవిందో
> త్పలాస్త్రి కృతింజెంది శోభిల్లె'

వారి యిరువురి చూపులు అరవిందోత్పలాస్త్రి కృతిని బోలి యున్నవట. అరవిందమున కానంద జనకుడాదిత్యుడు. ఉత్పలమున కుత్సాహోత్పాదకుడు డుపతి. ఉపాధి భేదమున అరవిందోత్పలములకు వైరుధ్యము సహజము. ఒకటి వికసించినపుడు రెండవది ముకుళించును. ఇది ప్రథమమున ఒకటి వికసించి యుండినను రెండవది యుత్ఫుల్లమగు సమయము కలదు. అది యంతిమమున పూర్ణిమనాడు సూర్యాస్తమయముతో పాటు చంద్రోదయమగును. సూర్యుడస్తంగతుడగు సమయమున పరిపూర్ణ వికాసమెడలి ముకుళించుకొనుటకున్ముఖమగును పద్మము ఆ క్షణముననే చంద్రోదయ మగుట నుత్పలము వికసించును. సంపూర్ణముగ వికసించి యుండక పోయినను పద్మోత్పలములు రెండును ఏకావస్థయందుండు కాల మొకటి కలదన్న మాట. వెంకటేశ్వరుడు పద్మాక్షుడు- ఆతనిప్రియ ఉత్పలాక్షి. వారి చూపులెట్లు లజ్జావశమున మొదట పరస్పర పరాఙ్ముఖములై యుండినను తుదకరగన్నులతో నైనను ఏకత్వమందగల్గినవో సూచితమైనది. అది పూర్ణిమ నాడనుట ధ్వని

> 'చేతో భవాస్త్రంబు లేరీతి వారింతు
> నో యంచుఁజింతంగపోలోపరిన్యస్త
> హస్తాబ్జయై దుస్తర స్వేదయై యానమన్మ
> స్తయై మోము వాడంగఁ బెన్గొప్పు వీడంగఁ
> జన్నప్పు జాఱంగ నిట్టూర్పు మీఱంగ
> బెట్టాన లూరంగ మైఁబార వశ్యంబు దేరంగ
> లక్ష్మీధవ ప్రార్థనా దీనయై'

'పొనఁగు ముత్తెపు సరుల్ప్రవహించిన విధమున నీ శబ్దజాల జాలమున్న దనుట స్వభావోక్తి. ఇట్టి రచన తిరుమలయ్యంగారికి తిఁచూర్ణ ధారణము వంటిది.

పరితల మనసుల నుగ్గబట్టి విషయోన్ముఖ మొనర్చుకొని ఉద్దిష్ట ప్రయోజనమును సద్యః సాధించుకొనుట కుపయుక్తమగు వాఙ్మయ ప్రక్రియలలో శతక మొకటి. ఈ శతక ప్రక్రియ యందే తన జీవుని వేదనను నివేదించుకొనినాడు

ధూర్జటి కవీంద్రుడు. గోగులపాటి కూర్మనాథుడీ ప్రక్రియ ననుష్ఠించి భగవంతుని వలననే తన కార్యమును నెరవేర్చు కొన గల్గినాడు. ఈ ప్రక్రియ యందే అన్నమయ్య పర మేశ్వరునితో పందెము వైచినాడు బంధ విముక్తి నందిన కంచర్ల గోపన్న పట్టపగ్గము లేని తన సంతోషమును భగ వన్మాహాత్మ్యమును శతకమునందే వెల్లడించియున్నాడు. పెద తిరుమలయ్యంగారు నీతి శృంగార రసాయనముల నీ విశిష్ట శతక పాత్రయందే యాంధ్రుల కందిచ్చినారు. వీరి నీతి ప్రవచనములు సార్వకాలికములు సార్వదేశికములు సార్వజనీనములు నీతి బోధయా! తత్త్వ చర్చయా; వేదాం తోపదేశమా! భక్తి ప్రబోధమా! ఐహిక సుఖములా! లేక పారలౌకిక పరమార్థమా ఇతడు ప్రవచించునది అని యని పింప గలదు నీతి యానోపకరణమున జగత్తునంతటిని జుట్టి వచ్చినాడు పెదతిరుమలార్యుడు. మచ్చుని కొకటి రెండు పంక్తులు.

'ధర్మంబు గల చోటఁ దలకొను జయమెల్ల
దయగలచో సుకృతంబునిలుచు'
'కోపంబు నడచిన గురుతరాధ్వరఫల
మింద్రియ జయము మహేంద్ర పదవి'
'ఆచార వంతుఁడౌనతఁడె విప్రోత్తముం
డఖిలంబు రక్షించునతఁడు రాజు'

సాంఘిక - వ్యక్తిగత - రాజకీయ - గృహ్య ధర్మాదులకీ నీతి శతకమొక ఖని.

'సుముఖుఁడౌటకు నవ్వుఁజూపులే యిక్కువ
యింపొంది మెచ్చుట కీగి గుఱుతు
కూడి యుండుట కోర్చుకొనుటయ సూచన
మన్నించుటకు మంచి మాట యెఱుక
వెసనమ్ముటకుఁజాడి వినకయుండుటె చిన్నె
చేపట్టుటకుఁ బొరసినది సన్న
దయఁదలంచుటకుఁదప్పు మానుటె సాక్షి
లలి నేలుటకు నింపు లక్షణంబు'

ఇందలి ధర్మ ప్రవచనము నటుంచినచో ముఖ్యముగ కాన్పించునది యాతని మానసిక తత్త్వ పరిశీలనము. స్వామి, దాసుని యెడ వర్తింపవలసిన విధము నాను షంగికముగ చెప్పుటయే కాదు - శాసించియున్నాడు.

దయతోడ దీనుని దైన్యంబు వాపుట
చెడిన మానవుని రక్షించుకొనుట'

మొదలగునవి పుణ్యావహములని చెప్పుట యందెంత పార మార్థిక పరిశీలకుడుగ కన్పించునో.

'మాట మంచిదియైన మగువలు వలతురు
ఒక సతి మగఁడు వేశ్యొకతె కగును'

మున్నగు పంక్తులందంత లౌకికుడుగ కన్పించును. ఆయన వ్యక్తిత్వమే యట్టిది.

'తొల్లి పెట్టని మేలు దొరలియిప్పుడురాదు
కావలసిన పనుల్ గాక పోవు'

అనుటలో నాతడొక వేదాంతి

"ధరలోన నావులు తమ దూడలకు నెల్లఁ
బెట్టినా వాములు ప్రియము తోడ'
అనుటలో నాతడొక తాత్త్వికుడు.
'నలువది యేండ్లపై నరసిన వనితలు
పోఁతఁజల్లారిన భోజనంబు'
అనుట యందాతడొక రసికుడు.
'మగవి స్వతంత్రంబు మగువకుఁజెల్లదు
మెలఁతవిధంబు పెన్మిటికివలదు'
అనునపుడాతడొక న్యాయవాది.
సీస పద్యరచనము నందటనట శ్రీనాథుని కైవా
డము పుడికి పుచ్చుకొనినాడు.

ఆంధ్ర సాహితీ సరస్వతికి శృంగార పద కవితా లత లతో పందిరి కప్పుటయే కాదు వైరాగ్య వచన మాలికా గీతములతో మాలా కైంకర్య మొనర్చినాడు. మాత్రాబద్ధమై యొక లయతో పదమునకు వచనమునకు మధ్యగ నడచు వాఙ్మయప్రక్రియయిది. ఆంధ్రమున నిట్టి వాఙ్మయ ప్రక్రియ కాద్యులు కృష్ణమాచార్యులవారు. ఆతని సింహగిరి నరహరి వచనములు ఆంధ్ర వచన వాఙ్మయ వికాసమునకొక మేలు బంతి.

'దేవ దేవా ! నిన్ను నేంబలుమాఱు దలంచిన
నీఁడేమి గోరి తలంపుచున్న వాడోయని
చిత్తంబున నుందునని యొకానొకపరి నిన్ను దలం
తును
పేరుకొనియె నిన్ను బిలిచిన నన్నిపనులు
విడిచి వత్తువో యనుచు మౌనముననే యుండుదును

నీ చరిత్రంబులు సారెకు వినంగడంగిన
నీ రహస్యంబులు బయలు పడునోయనియాలకింపను
ఇది యెఱింగి నీవే నన్నుంబాయకుండుము'

(వైరాగ్య వచన మాలికా గీతములు-16)

పరమేశ్వరుని కరుణను సాధించుట యందుత్తమము సులభము నగునది భక్తి మార్గము. అందునను దైన్యముతో గూడిన భక్తి బ్రహ్మ సాయుజ్యమునకు సులభతర పథము. ఇట భక్తునకు భగవంతుడనిన నమితమగు భయము గలదు. ఆతడే పరమ ప్రాప్యుడను జ్ఞానము గలదు. మౌనముతో గూడిన ధ్యాన మస్మత్పేయమని వ్యంగ్యముగ కవి నిర్దేశించుచున్నాడు. 'వీఁడేమిగోరి తలంపుచున్నవాఁడోయని చిత్తంబుననుండు' నవి భీతి జెందుట తాను దాసుడు - భగవంతుడు స్వామి యనుభావముండుట వలననే. దాసుడుగ తన్నెంచుకొనుచు భక్తి కల్గియుండుట దాస్యభక్తి. ఇది నారద ప్రోక్తభక్తి సంప్రదాయమే. (చూ. నా. భ. సూ.) పిలచిన మాత్రమున నెన్ని పనులున్నను విడచి భగవంతుడువచ్చునని చెప్పుటయందు సఖ్యాసక్తియు వాత్సల్యాసక్తియు వ్యక్తమగుచున్నవి. వాత్సల్యభావమున్న సఖుడే పిలచిన మాత్రమున పనులన్నిటి వదలి రాగలడు. పరమ ప్రేమ రూపమైన భక్తియే యట్లు వచ్చుటకు హేతువు. దాసుడు గూడ ఒకప్పుడు తనకు స్వామి పైగల చనవుచే నాతనిని శాసించినట్లు చెప్పగలడు. ఒకపరి వివేచించును. 'నీ రహస్యంబులు బయలు పడునోయని యాలకింపను' ఇందు భగవంతుని స్వరూపమును సంపూర్ణముగ నెరిగిన వాడుగ భక్తుడు గోచరించు చున్నాడు. సంపూర్ణ స్వరూపమెరిగినవనే కాని యాతనికి కొన్ని రహస్యములున్నవని యెరుగజాలడు. మనకు పరిపూర్ణ భక్తిప్రపత్తులు గల్గిన వ్యక్తియొక్క రహస్యములను లోటులను విని నిచ్చగింపకుండుట స్వభావము. ఒకవేళ వినినను మనసున కెక్కకుండుట నైజము. అట్టి స్థితియందేయున్నాడీ భక్తుడు. భగవంతుని చరిత్రములు సారెకు వినగడంగినచో నాతని రహస్యములెట బట్టి బయలగునో యనియే యాతని భయము. ఇట్టి పరమ ప్రేమ గల్గిన వ్యక్తి వినినను నేమియు నుండ బోదుగదా ! వినను వినకుండుటయే లక్షణము. ఇదియే పరానురక్తి పరానురక్తియే భక్తియని చెప్పబడినది. ఇట్టి పరమానురక్తి స్వరూపము నిర్వచనీయము. మూకాస్వాదనము వంటిది. 'ఇది యెఱింగి నీవే నన్నుంబాయకుండుము' అనుటయందు భారమునంతను భగవంతునిపైననే వైచినాడు భక్తుడు. అనగా పాలముంచినను నీట ముంచినను సర్వము నాతనిదే యనుభావము. ఇట్టి యవస్థయందు భక్తుని మనమున శేషశేషి సంబంధ జ్ఞానముండెనని యూహింపనగును.

'ఉపేంద్రా! నీవు నాకు దేవరవై నాలో నుండంగా
నీ దిక్కు చూడక
యేకాంతంబని సంసారంబు నేసి బిడ్డలం గంటి
నదియునుంగాక యేలికవు నీవు నన్ను జూచు
చుండంగా భ్రమసి యెవ్వరుం
గానరని సేయరాని పాపంబులు సేసితి ॥'

(వై. వ. మా. గీ.)

భక్తుడిట చేయరాని పాపంబులు చేసితినని యాత్మనింద మొనర్చుకొనుచున్నాడు. భక్తి మార్గముల యందిది యొక విశిష్ఠ మార్గము. 'చేయరాని పాపముల నెల్ల చేసితిని-చేయుటయే నా చేతనైనది — వాని నెల్ల క్షమించి రక్షించుట నీ వంతు 'అన్యధా శరణం నాస్తి' '—అని భగవంతుని వేడికొనుచున్నాడు. శరణాపత్తి భక్తి సంప్రదాయములందొకటి. శరణన్న వానిని రక్షించుట కంటె పుణ్యము వేఱొండుండబోదు. భయత్రాత పితృ పంచకము నందొకడగుట కిదియే హేతువు. 'నాకు దేవరవై నాలో నుండంగా' ననుటయందు ఆత్మ పరమాత్మ లొక్కటే—భేదము లేదు అను నద్వైత సిద్ధాంతము ప్రతిపాదితమైనది. 'నీవు నన్ను జూచు చుండంగా భ్రమసి యెవ్వరునుం గానరని' అనుటయందు 'ఇందుఁగలఁ డందు లేఁడను సందేహము వలదను సర్వతద్భావ భక్తి ప్రతిపాదితమైనది. ఇది ప్రహ్లాద భక్తి— విష్ణుదేవుని లీలావతారములలో పదునైదవది యిట పేర్కొనబడిన యుపేంద్రావతారము. ఇది చైతన్య భక్తి సంప్రదాయము.

'భీష్మాదులు పరతత్త్వమ వెన్న నారాయణుండవని
భజియించి
బ్రహ్మానందంబునం బొందిరి ।
అన్ని విధంబుల వారికి నీవొకండవే గురి
యెటువలె భావించిన నటువలె నవుదువు॥'

భీష్మాదులు నారాయణుని గొలిచి బ్రహ్మానందంబును

బొందగల్గిరని భగవంతుని గుణమాహాత్మ్యములకు నచ్చెరు వొందు చున్నాడిట భక్తుడు. కావున నిది గుణమాహాత్మ్యా సక్తి యను భక్త్యవస్థ. 'పరతత్త్వమవు'—అనుట యం దుద్దిష్టుడు పరమాత్మయని యూహింపనగు. పరంజ్యోతి త్రివిధ ప్రకాశ రూపముల యందిది రెండవది ఇంకను భగవానుని భావింపవలసి యున్నాడిట భక్తుడు 'నీ వొకం డవే గురి' అనుట యందు ప్రతీక వైవిధ్యములచే పలు రూపముల భాసించినను నాతోడద్వయ జ్ఞాన తత్త్వడను భావన భక్తుని హృదయస్థమనుట సమంజసము 'ఎటువలె భావించిన నటువలె నవుదువు'—అనుట యందు నిర్గుణో పాసనయు సూచితమైన దనవచ్చును.

ఈ వైరాగ్య వచన మాలికా గీతముల యందు భక్తుడు శ్రీ వైష్ణవుడుగ గోచరించును. అతడే వాచ్యముగ నామాట చెప్పినాడు: 'పులి జూదం బాడెదు వారు రాశ్లేరు తరి' అనుటయందు పదునారవ శతాబ్దియందే యాయాట యుండె ననుట కవకాశము గల్గుచున్నది. 'నాటకశాల—బహు రూపకము' ల ప్రసక్తి యిందు వచ్చినది.

పద పద్య ప్రధానములు దేశి మార్గ సాహిత్యములు. అట్టి మార్గ దేశి సాహిత్యముల కేకవాక్యత ఘటించిన సాహిత్య ప్రక్రియ ఉదాహరణము. భక్తి కవిత్వ సంగీత ముల నేక ముఖమున ప్రవహింపజేసి భగవత్స్తోత్రమున కుపయోగించు ప్రక్రియ యది. అట్లనుట మానవస్తోత్రమున కుపయోగపడదనుట కాదు పాల్కురికి సోమనాథుని బస వోదాహరణమే యాంధ్రమున నా ప్రక్రియకు మొదటిది కేవల స్తోత్ర ప్రాయముగా నాదిలో నుండిన యుదాహరణ ప్రక్రియకు కావ్యత్వ స్ఫూర్తి నాపాదించిన వారిలో నొకరు పెద తిరుమలయ్యంగారు.

> 'ఏటికి వేల్పులార చదలేటికిఁ బోయెద రిందురందు కో
> నేటికి వచ్చుఁ దీర్థ చయ మేఁబది లక్షల తోడఁ
> గూడు ము
> క్కోటియు నంచుఁ బల్కు మునికోటుల మాటలు
> నేర్చి కీరముల్
> చాటు తటాట విన్నటన' నల్పునట.

చదలేటికి బోయిన యంత పుణ్యము వేంకటేశ్వరుని కోనేటి వలన గల్గు ననుట యందు దాని పావిత్ర్యము—దానినట్లు పవిత్ర మొనర్పగల్గిన వేంకటేశుని మాహాత్మ్యము చెప్పబడుచున్నవి. కీరములు సైతమట్టి పుణ్య కార్యముల మగ్నమైన వనుటయందు తత్ స్థల మాహాత్మ్యము చెప్ప కయే చెప్పబడుచున్నది.

> 'నగము మొగము చాయ దాయఁ జదియ నడచు
> వాని చేతఁ
> దొగులు మగువ వలవ రొలుపఁ బ్రోచి కాచు వాని
> చేత
> ఱాతి నాతిఁజేసి వాసి ఱట్టు పెట్టు వానిచేత
> వాత జాతుఁ బనులఁగొనుచు వసుధ నెనఁగు వాని
> చేత'

నరసింహ-కృష్ణ-రామావతారము లిందు క్రమముగ నుద్దిష్ట ములైనవి సామాన్య ధర్మము లెన్ని చెప్పినను ఉద్దిష్ట విషయము మనసున కెక్కుట కష్టము. విశిష్టగుణ నిర్దే శము వలననా ప్రయోజనము సుసాధమగును. అదియే కావ్యత్వ స్ఫూర్తి హేతువు అట్టిది యిందు సాధితమైనది.

మాత్రాగణ సామ్యమున రగడయు నుదాహరణ ప్రక్రి యలో నంతర్భూతమగును. విష్ణుని సుదర్శన చక్రమాహా త్మ్యమును వర్ణించు రగడ యగుట నిది సుదర్శన రగడ యగుచున్నది. కేవల మాహాత్మ్యము నుల్లేఖించుటకే రగడ నెన్ను కొనుట కవి ప్రజ్ఞ కొక నికషోపలము. ఆవేశజనకమై సుదర్శన మాహాత్మ్యమును ఛందోగతియందే పాఠక హృదయములకు హత్తుకొనునట్లు కవి యొనర్ప గల్గుట ప్రశంసనీయము.

చూడుడు:

> 'అగ్ని ఖేట వజ్రాయుధ చక్రము
> లగ్న కుంత శుభలక్షణ చక్రము
> నేత్రత్రయ వర్ణిత గురు చక్రము
> రాత్రించర విద్రావణ చక్రము'

రేఫ అకారముల కానాటికి ఉచ్చారణము నందు సాం కర్యము గల్గుచుండి యుండును. సంకీర్తనాదులయందు వ్యాకరణ నియమముల నతిక్రమించుట తన లక్షణ జ్ఞాన మును శంకింప నవకాశము గల్గునేమోయని యోజించియు నుండును. అందువలననే రేఫఱకారముల పట్టికలను పద్య ములలో పొందుపఱిచి లాక్షణికుడు నైనాడు పెద తిరు మలయ్యంగారు.

'....ఆది కవీశ్వరు
లచ్చు పడంగృతులఁ జెప్పినటువలె'

చెప్పెదననినాడు. 'కృష్ణా' యను మకుటము నునిచినాడు. గుది(గుచ్చుటయైన తరువాత

''ఇటపై
మఱి కలిగెనేవిఁ దెలియుఁడు
తఱచెందును లేవు కృతుల....'

అని సంశయమునే ఛేల్లడించినాడు. పరమ హంసోత్తముడైవ తనకు క్షీర నీర విభేదంబు చేసినట్లు రేఫ అకారములు వేర్వేఱ తేట పఱుచుట సాజమే యనినాడు. వేర్పఱుచుట యందలి కష్టమును - తన సామర్థ్యమును హంస యను నుపమానముతోపింప జేయును.

తత్త్వతః పెద తిరుమలయ్యంగారి రచనల నన్నిటిని శృంగారము - వైరాగ్యము - నీతి - భక్తి - లాక్షణికత లని యైదు విభాగములొనర్పవచ్చును - వచనములలోనున్న వైరాగ్యమును గూడ గ్రహించినచో శృంగార వైరాగ్య నీతి శతకముల రచించుట యందీతడు భర్తృహరిచే ప్రభావితుడాయెనాయని యనిపింపగలదు శృంగార వర్ణనము నందెల్లయెడల పితృ ప్రబోధిత మధురభక్తి సంప్రదాయము నందే పయనించినాడు. అట్లనుటనది యితః పూర్వము లేదనుట గాదు. భావములు పెక్కుఁలు పైతృకములే.

'సురతపు వేళ నీ మెఱుఁగు సొమ్ములలోఁ
దననీడఁ గాంచి యే
తరుణి యొ వచ్చెనంచుఁ జెలితత్తర
మందుచుఁజీరఁగట్టె నీ
తుఱుమటె పీడె వెంట్రుకలుతోడనె
యందుల మీఁదఁగప్పఁగా
విరసము మాని కూడెనవి వింటి'

నని వెంకటేశ్వరుని ప్రణయ కలాపముల నూచముట్టుగ నెరిగి యాతని తోడనేతెల్పిన ప్రౌఢుడు పెద తిరుమలయ్యంగారు- 'వింటి' ననుటయందున్నది కవిగడుసుదనమంతయు వినిన వాడూర కుండక కొంటెగా వింటినని చెప్పు టెందులకు? ఇది యంతయు భగవంతునియెడ నాతడూహించిన చనవు వలననే. భగవంతుడు తన్నేమియు చేయడనియే.

చూడు డాతని శృంగారము నందలి రాజసము :

....మరలించితిఁగోపము వాదులేలనీ
పాదము దెమ్మ మ్రొక్కెదను పాల్పడె రమ్మిఁక
వేంకటేశ్వరా'

స్త్రీ రూపుడైన భక్తుడు పరమేశ్వరునిని ప్రణయ కలహము నందు మన్నించు సందర్భము. 'పాదము దె'మ్మనుట యందలి రాజస ప్రవృత్తి పరిశీలింప దగినది.

'చలమరినంచు నన్ను మఱి సారెకు నాడెద
వేమిసేసితిన్
వెలు పల నీవు నాపెయును వేఁడుక సల్పఁగ
లోననుంటి నేఁ
గెలయుచు నింతిఁ దిట్టితినొ కిన్కల మీ
రతివేళ విఘ్నముల్
సలిపితినో వెతంబడకు సంగతులాయివి
వేంకటేశ్వరా'

ఇందలి శృంగార నాయికా రూపుడైన భక్తుడు 'పరమ గడుసుతనము' ను భగవంతుని యెడనే ప్రదర్శించుచున్నాడు 'వెలుపల నీవు నాపెయును వేఁడుక సల్పఁగ లోననుంటి' నంతకంటె నేమి చేసితినని ప్రశ్నించుచున్నది నాయిక. ఇందామె చూపిన నంగనాచి నయగారము హృదయైకవేద్యము, వెతంబడకు మని చెప్పుట యందు వేంకటేశ్వరునిపై నాపెకు సంపూర్ణాధి కారమున్నట్లు వ్యక్తమగుచున్నది. అతనిపై నున్నయలక్ష్యతను గూడనది యించుక మాత్రమైనను సూచించుచున్నది. పెదతిరుమలార్యుడీ శృంగార శతకము నాలంకారిక ప్రతిపత్తియు నలవడునట్లు రచించెననుటకొకటి రెండు దాహరణలు:

'దండము వెట్టెదన్ వలపుతండము తండముగాఁ
దొడంగె ను
ద్దండపు మాటలాడకిటు దండనెయుండఁగ నీవు
నన్నుఁగై
దండ యొనర్చి నీవు విరిదండ యొనంగితి విట్లు
నాకువే
దండము నెక్కినంతటి ముదంబటు గల్గెను
వేంకటేశ్వరా ॥'

వేంకటేశ్వరుడు కెదండయొనర్చి విరిదండ నొసగెనవి యేనుగు నెక్కినంతటి సంతోషము గల్గెనని కృతార్థత

తెందిన నాయిక పల్కుచున్నది. ఇది ధృతి యను సంచారి భావ సూచకము.

> 'అనరాదా తనుఁజూచి నాతునొక మాటన్నింట నాతోడఁదా
> నెనరాదంచును నీవొసంగితివి నాకియ్యంగుళీ ముద్రచ
> య్యన రాదప్పట నుండి నఁట కయ్య జ్జాక్షి నారీతి నే
> మనరాదా నినుఁగూడి వేఁడుకలు గ్రమ్మన్ వేంకటాద్రీశ్వరా ।'

'నాతోడఁదానెనరా' ననుటయందు నా కాంతపై నీమె కున్న యీర్ష్య ధ్వనించుచున్నది. ఇది 'అసూయ' యను వ్యభిచారి భావ సూచకము.

> 'తగుఁదగు మీకు నిద్దఱికి దంపతులైతిరి యీ గవాక్షలన్
> మొగములు చూచుకొందు మఱి మ్రొక్కుడు నే నిటు గంటినంచు మీ
> తగులమి మానరాదు రతి తారసమాయెను మా కదేల యీ
> జగడము లింత కోపుదుమె చౌకలు సేయకు వేంకటేశ్వరా।'

వేంకటేశ్వరుడు మఱియొక కాంతను గూడెనని యాత విని శృంగార నాయిక నిందించుచున్నది. పరమేశ్వరు నంతటి వానిని నిందించుచుంటినే యను భయము—అన్య కాంత నాతడు చేపట్టెనే యను కోపము—నిగ్రహించుట కంటె నేమియు జేయలేనను నసహాయత వలన వచ్చు నుపులు—పచన పరుషత యాతని యన్య కాంతాసక్తిని మరల్పగలదను సంతోషము నామెకు గలవు. కావున నిది కిలికించితమను శృంగార చేష్ట.

> 'అలికుల వేణి నొక్కరితె నంటితి వంచును వింటిదానికే
> యలిగితి నీవు లేదనుచు నానలు వెట్టెదు సారెసారెకుం
> జలములు మానినన్ మనసు సందియ మేటికి మానుఁ జాలు నీ
> నిలువునఁగల్ల గల్గినను నిన్నె భజింతును వేంకటేశ్వరా।'

'నిలువున కల్ల గల్గినను నిన్నె భజింతును' అనుట యందు ధ్వనించు వైరాగ్య మీ శృంగార వర్ణనకు పావిత్ర్య ముద్ర నొసగుచు బిగువు కూర్చుచున్నది. వైరాగ్య మిశ్రిత మైన యీ శృంగారము పులు కడుగబడ్డ ముత్యము. ఈతని శృంగార వర్ణనాసక్తి కుత్సాహ మిచ్చినవాడు భర్తృహరి యనవచ్చును.

అతని యాధ్యాత్మిక ప్రవణతకొక చిన్న యుదాహరణ:

> 'ఘనమైన మోచి మెప్పించ గరుడుండనేఁ గాను
> కొనఁ గాసు సుఖమియ్య గోపికంగాను
> వినుతించి మెప్పించ వేయినోళ్ళ భోగిగాను
> నిను నెట్లు మెప్పింతు ననుఁగాచే దెట్లో ।
> నవ్వుచుఁ బాడి మెప్పించ నారదుఁడ నేఁగాను
> అవ్వలఁ బ్రాణమియ్య జటాయువుంగాను
> ఇవ్వల శ్రీ వేంకటేశ నీకే యిటు శరణంటి
> అవ్వల నా తెరువేదో రక్షించేదెట్లో॥'

భగవంతుని మెప్పు నందవలెనని దృఢమగు సంకల్ప మున్నది గాని దానికి తగు సాధన మేమియు లేదని వాపోయి 'నీకే శరణంటి—నా భారమెల్ల నీదే' యని నివేదించు కొనినాడు.

ఇట్లు భక్తి—శృంగార—వైరాగ్య—నీతి—లాక్షణికతా ప్రతి పత్తి గల్గి బహువిధ గీతి సాహితీ ప్రక్రియా ప్రియంభావుక మైన వాఙ్మయమును సృజించిన మహనీయుడు పెద తిరుమ లయ్యంగారికి ఆంధ్ర కవి లోకమున సముచిత స్థానము కలుగవలసి యున్నది. అదియే యీ లఘు వ్యాసరచనా సముద్దేశము.

(నన్నీ రచనకు సమర్థునిగ జేసిన మత్పరిశోధన దర్శకులు డాక్టర్ యస్వీ జోగారావు, M. A., Ph. D. గారికి కృతజ్ఞతాపూర్వకములు కేలుమోడ్పులు.—రచయిత.)

నా టి క:

"మారవలసిన మనుషులు"

— లక్కోజు అప్పారావు

పాత్రలు

రామయ్య	(55):	గ్రామంలో ఒక పెద్ద రైతు—భాగ్యవంతుడు,
రఘు	(28):	రామయ్య కొడుకు—విద్యాధికుడు.
రామ్మూర్తి	(32):	రామయ్య అల్లుడు—మధ్య తరగతి ఉద్యోగస్తుడు.
వేణు	(30):	రామ్మూర్తి రఘులకి స్నేహితుడు—ప్రణాళిక శాఖోద్యోగి.
వెంకన్న	(60):	పాలేరు—హరిజనుడు.
బాబు	(10):	రామ్మూర్తి కొడుకు—విద్యార్థి.
లక్ష్మి	(30);	రామయ్య కూతురు—రామ్మూర్తి భార్య.

(వరండాలోగది— సామాన్యంగా అలంకరించబడి ఉంటుంది. ఒక ప్రక్క టేబిల్, దానిపైన రేడియో సెట్టు ఉంటుంది— దాని ప్రక్కనే మూడు నాలుగు కుర్చీలుంటాయ్. లోపలి నుండి, ప్రవేశము, టేబిల్‌కు ఎదురుగా ఉంటుంది. బయట నుండి ప్రవేశించడానికి కూడా తెర ప్రక్కగా ఏర్పాటు ఉంటుంది— తెరలేచే సరికి రఘు కుర్చీలో కూర్చుని పేపరు చూస్తుంటాడు— రేడియో నుండ ధ్వని వినబడే ఏర్పాట్లు మైక్ ద్వారా చేసుకోవాలి.)

రేడియోలో గొంతు:— ఆలిండియా రేడియో.... విజయవాడ కేంద్రం. హైదరాబాద్ నుండి రిలే కాబడుతున్న 'ప్రగతి పథము' అనే ప్రసంగం కొద్ది క్షణాల్లో ప్రారంభమవుతుంది. (ఒక్క క్షణం నిశ్శబ్దం)

రఘు:- (ఒక్క సారిగా పేపరు మూసి) ఒరేయ్! వేణూ! రా! రా! త్వరగా రా!......... రేడియోలో ఏదో పీ గొడవ చెపుతున్నారు!....

రేడియోలో:- 'ప్రగతి పథము' అనే ప్రసంగం....

వేణు:- (లోనుండి ప్రవేశించి) ఏమిట్రా అరుస్తున్నావ్!....

రఘు:, (మాటాడకుండా రేడియో వినమని సైగ చేస్తాడు— వేణు రఘు ప్రక్కనే కుర్చీలో కూర్చుంటాడు— యిద్దరూ శ్రద్ధతో ప్రసంగం వింటుంటారు.

రేడి:- "ప్రకృతి-మానవుడు!.... అనాదిగా మానవుడు తన మనుగడకు ప్రకృతిలో అహర్నిశలు పోరాడుతూ ఉన్నాడు. ప్రకృతిని శాసించి తన ప్రగతిని సాధించా లనేదే మానవుని నిరంతర కృషిగా తోస్తున్నది....

ప్రకృతిని శాసించాలనే అహంకారంలో ప్రగతి లేదు. ప్రకృతిని పూజించి లాలించాలనే భావంలోనే ప్రగతి ఉంది. అప్పుడే ప్రగతి సాధ్యమౌతుంది.... దానికి.... మానవుని మేధస్సే కాదు.... హృదయం కూడా వికసించాలి....

ప్రగతి కేవలం 'పద్దతి మార్పు' వల్ల రాదు— హృదయం మార్పు చెందాలి - కేవలం కదలికలో మార్పు వల్ల రాదు. హృదయంలో విప్లవం రావాలి, నిస్పృహ నిరాశల వల్ల రాదు- ఉత్సాహం ఉరకలు తియ్యాలి. అందుకే అవిద్య, అజ్ఞానమూ నశించాలి- అప్పుడే ప్రగతి - అదే అభ్యుదయం!....

ఇదే నేడు భారత ప్రభుత్వం అమలు జరుపుతున్న పంచవర్ష ప్రణాళికలోని సమాజ వికాస కేంద్రముల కార్యక్రమములలోని ముఖ్యోద్దేశ్యము. కాని....ముప్పైఆరు కోట్ల ప్రజల ప్రగతి, భవితవ్యం ప్రభుత్వ యంత్రాంగం చేపట్టిన బహు కొద్ది మంది నాయకుల చేతులలోనో....వివిధ శాఖలను నిర్వహిస్తున్న కొద్ది మంది ఉద్యోగుల చేతలలోనో లేవు.

ప్రజల బాధ్యత కూడా తక్కువైందేమీ కాదు- వివిధ రంగాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమములను మన్నించాలి-శ్రద్ధగా గమనించాలి- ప్రోత్సహించాలి-ప్రతికార్యక్రమములోనూ ముందంజ వేయాలి.

ప్రజా జీవిత అభ్యుదయ సాధనకై ప్రజల హృదయాలలో ఆసక్తి రేకెత్తాలి-ఆసక్తి ఉంటేనే శక్తి-శక్తి ఉంటేనే భుక్తి-భుక్తికి లోటు లేని జీవితమే రక్తి అదే జాతికి ముక్తి....

రఘు:- (రేడియో ఆపుచేసి) ఎవడోగాని..చెప్పడంబాగుంది!

వేణు:- అంటే....చెప్పింది బాగాలేదా?....

రఘు:- నువ్వూ విన్నావుగా!....

వేణు:- నీ సంగతి చెప్పరా అంటే!....

రఘు:- ఒరే !.... ఎందుకురా యీ ప్రసంగాలు! చెప్పు! కమ్మగా ఏవన్నా రికార్డులు పెడితే ఐదు నిమిషాల కాలం సద్వినియోగమయ్యేది కదా!....

వేణు:- అయితే....యీ ప్రసంగ కాలమంతా దుర్వినియోగమైందంటావ్?....హుం....యింక ఎలారా దేశం బాగు పడాలంటే!....ఆ ప్రసంగం విన్న తరువాతన్నా నీ బుద్ధి మారలేదు సరికదా....పైగా కాలం దుర్వినియోగమైందంటున్నావ్!....

రఘు:- అదేమిట్రోయ్!....నా బుద్ధి మీదికి పోయింది నీ మనస్సు..ఏం! ఏం వచ్చింది నా బుద్ధికి?....

వేణు:- ఆఁ!....ఏముంది!....నీ బుద్ధికి బాధ్యత తెలియదు! అంటే....!

రఘు:- నాకు బాధ్యతేమిటిరా?....

వేణు:- ఎప్పుడన్నా దేశాన్ని గురించి ఆలోచించావురా?.... దేశంలో ప్రజలెలాబ్రతుకుతున్నారో ఆలోచించావా!

రఘు:- అంత అవసరం నాకింతవరకు కలగలేదులే!....

వేణు:- దాన్నే బాధ్యత తెలియనితన మంటాను!....నువు Agriculture M. Sc పాసయ్యావ్ కదా! ఏమిటి నీ విద్యవల్ల, విజ్ఞానంవల్ల ఉపయోగం?....

రఘు:- నా విజ్ఞానంవల్ల ఉపయోగమేమిట్రా నీ మొఖం!.... ఎవరికి ఉపయోగ పడాలంటావ్?....

వేణు:- ఎవరికేమిటి!....దేశానికి!....ఆ విజ్ఞానం లేని ప్రజలకు !....

రఘు:- అందుకోసమే నేను చదువు కున్నానంటావ్!.... నా విజ్ఞానం దేశానికి ఉపయోగ పడకపోతే యిప్పుడేంమునిగి పోయింది?....ఏదో నా యిష్టమైంది, నేను చదువుకున్నాను!....దేనికో ఉపయోగపడాలంటావ్!....విజ్ఞానం సద్వినియోగం చెయ్యాలంటావ్! ఇప్పుడు కుళ్లి పోయిందా?....ఎవరికో ఉపయోగ పడాలని ఏమిటి నాకు దురద?....దేశానికి నా విజ్ఞానంతో పనేమిటి అయినా!....కాలేజీలున్నాయ్! ప్రభుత్వముంది....ఉద్యోగులున్నారు....ఫ్యాక్టరీలు. . పరిశోధనా కేంద్రాలూ ఉన్నాయ్!....

వేణు:- అంతే కాని....నీకూ దేశానికి ఏమీ సంబంధం లేదంటావ్!....దేశాన్ని బాగుచేయడానికీ....ప్రజలను అభివృద్ధి పరచడానికీ నీకేమీ బాధ్యత లేదంటావ్!....అంతేనా నీ ఉద్దేశ్యం?....

రఘు:- (విసుగ్గా) ప్చ్!....ఏమిటో!....అంత పెద్ద ఉద్దేశ్యాలేమీ లేవు నాకు!....అయినా....నేనేమీ దేశం చెడిపోవాలని అనడంలేదుగా....బాగు పడితే నాకేమీ అభ్యంతరం లేదే!....

వేణు:- అభ్యంతరం లేదన్నావు బాగానే ఉంది!....కాని దేశాభ్యుదయానికి నీ ప్రయత్నమూ బాధ్యతా లేక పోవడమే...వచ్చిన చిక్కు!....

రఘు:- నా ప్రయత్నమేమిటిరా నీ మొఖం!....పార్టీలున్నాయ్!....ప్రభుత్వముంది....కావలసినన్ని సేవా సంస్థలున్నాయ్....అవి చెయ్యాలిగాని ఆపని!....

వేణు:- పోనీ....నువ్వు కూడా ఒక భారత పౌరుడివేనని ఒప్పుకుంటావా?

రఘు:- (రోషంగా) కాక....!

వేణు:- ఆఁ!....మళ్లీ పౌరసత్వంలో తేడా అంటే రోషం వస్తుంది....కాని ఆపౌరుడికి ఉండవలసిన లక్షణాలంటేనే పాపం....చికాకు!....

రఘు:- నాలో పౌరుడి లక్షణాలెందుకు లేవురా!....నేనెప్పుడూ ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించలేదు!....అతిక్రమించినా పట్టుబడ లేదు!....దొంగతనం చేయలేదు!....మరి....రంకుతనం చేయ లేదు!....

వేణు:- అవన్నమాట....నీకు జ్ఞాపకం ఉన్న Civic responsibilities!

రఘు:- అయ్యో!.... అవేయేం ఖర్మ....యింకా విను! నేనూ సంఘంలోనే జీవిస్తున్నాను!....నావల్ల యితరులకి గాని సంఘానికి గాని హాని జరగడం లేదు! నాకు దేవునిమీద నమ్మకం ఉంది....దేశమంటే భక్తి ఉంది!....పెద్దలంటే గౌరవముంది....దరిద్రులంటే సానుభూతి ఉంది!....

వేణు:- ఊఁ!.... యింకా!....

రఘు:- యింకానా!....(నవ్వుతూ) నీ మొఖం!....

వేణు:- నా మొఖం బదులు 'దేశసేవ' అనే మాట జ్ఞాపకం వస్తే బాగుండేది!....

రఘు:- (నవ్వుతూ) అమ్మ బాబోయ్!....దేశసేవ!....అంటే ప్రజా సేవ!... అదేనా నీ ఉద్దేశ్యం!....నా వల్ల కాదు!... (సీరియస్‌గా) అయినా నేను చేసే దేశ సేవ ఏమిటిరా?... పార్టీల్లో తలదూర్చి కుస్తీ పట్టమంటావా?.... సేవా సంస్థల్లో దూరి చందాలు వసూలు చేయమంటావా?....

వేణు:- అంతే గాని వాటిల్లో ఉన్నమంచిని చూడవు నువ్వు.... పోనీ గాని....దేశసేవ అంటే పార్టీల్లో తల దూర్చడమూ.... సేవా సంస్థలు స్థాపించడమేనన్నమాట!....నువు చేయగలిందేమీ లేదూ....?

రఘు:- ఏమిటో చెప్పు!....

వేణు:- ముందిది చెప్పు...మన దేశాన్నిగురించి నీ అభిప్రాయం ఏమిటి??

రఘు:- అందరికీ తెలుసు!...చాల బీదదేశం!...living standards తక్కువ!...విద్య తక్కువ...జబ్బు లెక్కువ!...ఆదాయం తక్కువ...సంతానం ఎక్కువ! . పార్టీ లెక్కువ.. ప్రజా సేవ తక్కువ...ప్రణాళికలు జాస్తి...ప్రయోజనం నాస్తి! సంస్కృతి పేరుతో అసభ్యకరమైన నాగరికత!... సంఘం పేరు మీద కరడు గట్టిన అనాచారాలు!...

వేణు:- అందుకు కారణమేమిటంటావ్?....

రఘు:- ఆఁ! ఏముంది?.... చదువూ సంస్కారం లేకపోవడమే?....

వేణు:- నేనలా అనను!.... దేశం బాగు పడాలంటే అందరూ చదువు కోవడమే ముఖ్యంగా ముందు జరగాల్సింది కాదు!.... literacy క్రమేణా పెరుగుతుంది!.... దాని కన్నా ముందు.... అభివృద్ధిని గురించి ఆలోచించడానికి కూడా అవకాశమూ అనుభవమూ లేని వాళ్లని గురించి విజ్ఞాన వంతులూ.... అభివృద్ధిని సాధించే శక్తి యుక్తులున్నవాళ్లు ఆలోచించాలి! వాళ్లకి మార్గదర్శకులు కావాలి!..... వాళ్లకి బోధించాలి...నచ్చ చెప్పాలి!.. ఏదైనా విషయాన్ని గూర్చి ఆలోచించి చర్చించగల అలవాటును వాళ్లలో ప్రవేశ పెట్టాలి!...

రఘు:- బాగుంది! బాగుంది!... వాళ్లందరికీ క్లాసులు పెట్టి పాఠాలు నేర్పమంటావేమిట్రానన్ను?...

వేణు:- అంత ఘనకార్యం చెయ్యనవసరం లేదోయ్ నువ్వు!...ఒరేయ్!....చూడు!... నేర్పడం రెండు విధాలు!...చెప్పి చేయించడం ఒకటి... చేసి చూపించడం యింకొకటి!...

రఘు:- అలాగా!....ఏదీ!....ఆ రెండో పద్ధతి ఒకటి చెప్పు! విందాం!...

వేణు:- (ఆలోచించి) మీ పొలం ఎకరానికి ఎంత పండుతుందిరా?

రఘు:- ఇరవై బస్తాలు పండుతుందనుకుంటాను...

వేణు:- నువ్వు ఎమ్.ఎస్సీ. అగ్రికల్చర్ ప్యాసయ్యావ్!...మీ భూములన్నీ చూచావు కదా!... ఆ భూమిలో ఎంత పండించ వచ్చునినీ ఉద్దేశం?...

రఘు:- శ్రద్ధగా వ్యవసాయం చేస్తే పాతిక నుండి ముప్పై దాకా పండించ వచ్చు ఎకరానికి!...

వేణు:- అవునా!.... అలాగనక నువు పొలంలో అధిక పంట పండిస్తే నీ చుట్టూ ఉన్న రైతులు కూడా ఆ పద్ధతి చూచి అంతే శ్రద్ధతో వ్యవసాయం చేసివాళ్ల భూముల్లో కూడా అధిక పంట పండిస్తారంటావా లేదా ?...

రఘు:- కావచ్చు!...అయితే యింతకీ నన్ను వ్యవసాయం చెయ్యమంటావ్?...

వేణు:- ఏం! తప్పా?....యిప్పుడు నువ్వూ రైతువేకదా!.... అందులోనూ highly educated farmer వి!.... ఎందుకు చెయ్యవు?....మన దేశంలో రైతు అందరికీ యిదొక జబ్బు!.... భూమివాళ్ల స్వంతం అనీ....దాన్ని సాగు చేయడం చేయక పోవడం వాళ్ల యిష్టమనీ....దాని మీద లాభనష్టాలు కేవలం వాళ్లకి సంబంధించినవే ననీ అనుకుంటుంటారు!.... కాని....వ్యవసాయం రైతుకు వృత్తి అనీ....దేశంలోని ప్రజలకు చాలినంత తిండిని పండించి పెట్టడం వాళ్ల బాధ్యత అనీ అనుకోరు!.... నీయిస్త్రీ చాకలి గుడ్డలు సరిగా చేయకపోతే ఊరుకుంటావురా?...నీ మంగలి గడ్డం సరిగా గీయక పోతే క్షమిస్తావురా?.... నీ బిడ్డకు ఉపాధ్యాయుడు పాఠాలు సక్రమంగా చెప్పకపోతే హర్షిస్తావురా?...అలాగే శ్రద్ధగా వ్యవసాయం చేయడం తనవృత్తి అనీ... అధిక పంట పండించడం తన బాధ్యత అనీ గుర్తించకుండా తన వృత్తి ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించని రైతును మాత్రం ఎందుకు క్షమించాలి?... నువ్వూ, నీ చుట్టూ ఉన్న రైతులూ ఎకరానికి ఐదు బస్తాల అధిక పంటను పండించి దేశానికి అప్పజెప్పగలిగితే...దేశంలో ఉన్న తిండి చాలకా... యితర దేశాలనుండి కొనుక్కోడానికి డబ్బు చాలకా...ఆకలి చావులు కూడా occur అవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అంతకన్నా మహత్తరమైన దేశసేవ ఏముంటుంది చెప్పు!...

రఘు:- (నవ్వుతూ) అయితే వ్యవసాయం చేయడమే దేశసేవ అంటావ్!

వేణు:- అది బాధ్యతరా భాయ్! ... దాన్ని కేవలం వ్యవసాయం చెయ్యడమేనని నేనను!.... దేశ సేవ అంటే నీ బుర్రలో పాతుకు పోయిన ఉద్దేశాలున్నాయ్!.... నాకు తెలుసు!.... రాజకీయాలూ.... మీటింగులు పెట్టడం.... జండాలు పట్టుకు తిరగడం ... అవే దేశసేవ అని నీ ఉద్దేశ్యం!.... కాని అదికాదు!.... బాధ్యతను గుర్తించి నిర్వర్తించడమే దేశసేవ!.... బాధ్యతను గురించి బాపూజీ ఏమన్నాడో వినలా!....

బాబు:- (బయటి నుండి ప్రవేశిస్తూ) నాకు తెలుసు వేణు మామయ్యా!.... చెప్పనా? ...

వేణు:- ఊఁ!.... చెప్పు!....

బాబు:- 'బాధ్యత మనిషికి మొదటి హక్కు!'

వేణు:- అలా చెప్పరా బాబూ!.... ఆ మొఖానికి చెప్పు!....

బాబు:- వేణు మామయ్యా.... మొన్న నువ్వు మా బళ్లో జండాపాట నేర్పావు కదూ!.... అది నాకప్పుడే వచ్చేసింది!.... పాడనా?...

వేణు:- ఊఁ? పాడు!....

బాబు:- (హుషారుగా పాడుతాడు)

(పాట) ఎగిరింది! ఎగిరింది! జాతీయ జండా....
ఎప్పుడూ యీ రీతి ఎగరాలి- మా జండా ॥ఎగి॥
ఐకమత్యమె జాతి ఐశ్వర్య మనిచాటి
భారతీయుల శక్తి ప్రకటింప-నినదింప ॥ఎప్పు॥
పొరుగు దేశాలందు పరువు నిల్పిన తల్లి
తన దేశ ప్రజలలో ధర్మ చిహ్నము కాగ॥ఎప్పు॥

రఘు:- (విసుగ్గా) ఒరేయ్ బాబూ!....

బాబు:- (పాట ఆపి రఘువంక చూచి) ఏం!.... పాడుకుంటే తప్పా?.... దానికి కూడా విసుగే.. పాపం అయ్య గారికి!....

రఘు:- ఏడ్చావ్‌లే!.... యింట్లో పెద్దగా అరవ్వద్దని ఎన్ని సార్లు చెప్పాను!....

బాబు:- (సీరియస్‌గా ఎగతాళిగా) అ-పేకాట క్లబ్బుకి వెళ్ల వద్దని నీకెన్నిసార్లు చెప్పాను రోడ్డు మీద!....

రఘు:- (కోపంగా) నోర్మూయ్!....

బాబు:- యిప్పుడు కాదు!.... మళ్లీవచ్చి మూస్తాలే!....

రఘు:- (లేవబోతూ) తంతాను! వెధవాయ్!....

బాబు:- అమ్మోయ్!... చూడవే!....(లోపలికి పారిపోతాడు)

రామ:- (లోపలినుండి ప్రవేశిస్తూ) అదేమిట్రా వాడి మీద కేక లేస్తున్నారు!...

(రఘూ వేణూలు కుర్చీల్లో నుండి లేస్తారు— రఘు కుర్చీలో రామయ్య కూర్చుంటాడు- వేణు మళ్లీ తన కుర్చీలో కూర్చుంటాడు)

రామ:- (రఘూతో) అర్జంట్‌గా ఎక్కడికో వెళ్లాలని యింకా యిక్కడే వున్నావేంరా?....

రఘు:- (నసుగుతూ) డబ్బు కావాలన్నానుగా!....

రామ:- అవునవును!....ఇదిగో .... (జేబులోనుండి డబ్బు తీసి యిస్తాడు-రఘు అందుకుంటాడు).... ఊఁ!.... త్వరగా వెళ్లిరా!....

వేణు:-(ఎగతాళిగా)....ఆలస్యమై పోతుంది!....పాపం!.... త్వరగా వెళ్లిరానాయనా!....

రఘు:-(వేణువంక కొంటెగా చూస్తూ నవ్వుతూ మెల్లిగా బయటికి జారుకుంటాడు).

వేణు:- (రామయ్యతో) ఏది బాబాయ్!...ఆ చేత్తోనే మరొక వంద యిటు పారెయ్!....

రామ:- ఎందుకురా?....

వేణు:- చెప్తాగా!....

రామ:- (జేబులో నుండి డబ్బు తీసి యిస్తూ) మీ ఆఫీసులో యింకా జీతం డబ్బు లివ్వలేదట్రా?...

వేణు:- (డబ్బు అందుకుంటూ) యివి నాకు కాదు బాబాయ్!

రామ:- మరి?...

వేణు:- మొన్న చెప్పానుగా!... మనహరిజనపేటలో, యిళ్లు కట్టడానికి చందాగా...!

రామ:- (సీరియస్‌గా) ఒరేయ్ వేణూ...!

వేణు:- ఏం బాబాయ్?....

రామ:- ఆడబ్బిలా తే!...

వేణు:- (జాలిగా) అదేమిటి బాబాయ్!...యిచ్చిన డబ్బు తిరిగి తీసుకుంటావా?"

రామ:- ముందిటు యివ్వరా అంటే!...

వేణు:- (డబ్బు తిరిగి యిస్తూ...(బతిమిలాడుతూ) బాబాయ్! బాబాయ్!...నువు కూడా యియ్యక పోతే ఎలా బాబాయ్?...

రామ:- నీకు డబ్బంటే ఎగతాళిగా ఉందేంరా వేణూ?...

వేణు:- దీంట్లో ఎగతాళేముంది బాబాయ్!...నీకు సాయం చేయగల తాహతు ఉంది కాబట్టి త్యాగం చెయ్య మంటున్నాను-

రామ:- త్యాగం సంగతి తరువాత ఆలోచిద్దాం గాని... ముందీ సంగతి చెప్పరా!...పాటక జనానికి యిళ్లూ వాకిళ్లూ తేరగా కూర్చిపెడితే యింకా మనమాట వింటార్రా? నెత్తికెక్కరూ?.... ఎవర్ని ఎంతలో ఉంచాలో అంతలోనే ఉంచాల్రా!...

వేణు:- అలాగనుకుంటూనే యిన్నాళ్లూ వాళ్లని అధోగతి పాలు చేశాం బాబాయ్!....

రామ:- ఎవరు చేశార్రా?...

వేణు:-ఎవరేమిటి?...మనమే!...మన సంఘం!... మన సంస్కృతి!...మన ఆచారాలూనూ!...మని షిని మనిషిగా చూడనివ్వని మనసమాజపు మాన వత్వంలేని నిరంకుశత్వం!...

రామ:- నోరు ముయ్యరా అబ్బాయ్! . నీకు నిండాముప్పై ఏళ్ళు లేవు...సమాజపు కట్టు బాట్లనీ... నీతి నియ మాల్నీ సంస్కరించేంత వాడివయ్యావ్?....యింతకీ అవన్నీ ఏర్పాటు చేసిన పెద్దలు నీకన్నా దద్దమ్మలం టావ్? అంతేనా?

వేణు:- దద్దమ్మ లెందుకౌతారు! అతి మేధాసంతులు!...కాని అతి స్వార్థపరులు!...సమాజంలో ఒక వర్గం సుఖ భోగాలకు మరొక వర్గం జీవితాలనే నేల బెట్టి కాల రాయడానికి కూడా వెనుకాడని కటికి వాళ్లు ...

రామ:- యింతకీ నీకేమిటిరా బాధ!...కూలీ నాలీ చేసుకొనే వాళ్ల పూసుకుని రాసుకోని తిరగ మంటావా? అంత చదువు యిస్తే యింకావాళ్లకు వినయ విధేయత లుంటాయిరా?....సక్రమంగా పనిచేస్తారనేనా నీ ఉద్దేశ్యం?....

(సశేషం)

ప్రభుత్వ నిర్ణయాలు

వరంగల్ వైద్య కళాశాల

వరంగల్ ప్రాంతీయ వైద్య కళాశాలలోని 100 స్థానాలలో 50 స్థానాలను, రూ. $2\frac{1}{2}$ లక్షల, వార్షిక గ్రాంటు ఇవ్వడం ద్వారా సబ్సిడైజ్ చేయడానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నిశ్చయించింది. హైద్రాబాదులోని ఉస్మానియా వైద్య కళాశాల, గాంధీ వైద్య కళాశాల వంటి ప్రభుత్వ కళాశాలలకై ప్రభుత్వం ఏర్పరచిన ప్రవేశ నిబంధనలను అనుసరించి ఈ స్థానాలకు ప్రభుత్వం అభ్యర్థులను ఎన్నిక చేస్తుంది.

'ఎల్లో జర్నలిజం'ను అరికట్టేందుకు బిల్లు

'ఎల్లో జర్నలిజం'నూ, అసభ్యకరమైన వ్రాతలను అరికట్టడానికి ఉద్దేశింపబడిన ఒక ముసాయిదా బిల్లును రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈ బిల్లు మద్రాసు శాసనాన్ని పోలి వున్నది.

అసభ్య, నిందాపూరిత వ్రాతలకు గురి అయ్యే వారు, తమ అపఖ్యాతికి కారకమైన వ్రాతలకు అనవసర ప్రచారం లభిస్తుందేమోనన్న భయంతో వాటిని ప్రచురించిన పత్రికలపై చట్టబద్ధంగా చర్య తీసుకోవడానికి అయిష్టత చూపుతున్నందువల్ల, ఈ ముసాయిదా బిల్లులో సి.పి.సి, భారతీయ శిక్షాస్మృతులకు తగు సవరణలు సూచించ బడినవి.

భారతీయ శిక్షాస్మృతి 293వ సెక్షను క్రింద విధించదగిన శిక్షను పెంచడానికీ, అసభ్య వ్రాతలు గల ప్రచురణల విక్రయాన్ని నిలిపి వేయడానికీ, ప్రచురణ కర్తల నుండి హామీని కోరడానికి కూడా ఈ బిల్లులో అవకాశం కల్పించ బడినది.

"హైద్రాబాదుకు ఇతోధిక పాల సరఫరా"

"ఆంధ్ర ప్రదేశ్", 1960 మే నెల సంచికలో పై శీర్షికతో ప్రచురింపబడిన వ్యాసంలో ఏకీకృత పాల సరఫరా పథకం విషయమై ప్రస్తావించడమైనది. దీనికి సంబంధించిన తాజా సమాచారం దిగువ ఇవ్వ బడినది:—

హైద్రాబాదు, విజయవాడలలో పాల సరఫరా నిమిత్తం, ఏకీకృత పాల సరఫరా పథకం ఒకటి రూపొందించ బడినది. దీనిని 'యునిసెఫ్' సహాయంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తుంది. సహాయం లభింప జేయడానికిగాను అనుసరింపబడే సూత్రాల విషయంలో అంగీకారం కుదిరింది. ఇంకా పథకానికి సమగ్ర స్వరూపం ఇవ్వవలసి వున్నది. హైద్రాబాదుకు చుట్టు ప్రక్కల గల గ్రామాలలో లభించే పాలు గాక, విజయవాడ, గుంటూరులలో సరఫరా చేసిన తరువాత మిగిలిపోయే పాలు కూడా విజయవాడ నుంచి మంచి స్థితిలో రైలులో హైద్రాబాదుకు పంపించబడి అక్కడ సరఫరా చేయబడతాయి.

కథానిక:

పుత్ర సంతానం

—బి. విద్యాసాగర్

సాయంత్రం అయిదు గంటలయింది. దేవాలయంలో గంటలు వినిపిస్తున్నాయి. కొబ్బరికాయలు, పళ్లు చేత పుచ్చుకుని భక్తులు గుళ్ళోకి వెళ్ళి దైవ దర్శనం చేసుకుంటున్నారు కొందరు తీర్థ ప్రసాదాలు స్వీకరించాక బయటికి వస్తున్నారు. ఆలయ ప్రాంగణానికి వెలుపల కొద్ది దూరంలో కొంత మంది పిల్లలు ఆడుకుంటున్నారు. వాళ్ళలో వారికి యేదో పోట్లాట వచ్చినట్లుంది! ఒక పెద్ద కుర్రాడు, వొక చిన్న పిల్లవాడిని క్రిందకు పడత్రోసి వాడి మీద యెక్కి చేతితో బలంగా గుద్దుతున్నాడు,

గుళ్ళో నుంచి బయటికి వస్తూ, ఈ దృశ్యాన్ని తిలకించిన రుక్మిణమ్మకు గుండె తరుక్కుపోయింది. తన కుమారుడి మీద యెవరో బలప్రయోగం చేసినట్లు బాధపడింది. నిజానికామెకు పిల్లలు లేరు! అందుకే ఈ దృశ్యం చూశాక మరింత బాధ కలిగిందేమో!

రుక్మిణమ్మ, ఆమె భర్త హనుమంతరావు గబగబా నడుస్తూ అక్కడకు చేరుకున్నారు. రుక్మిణమ్మ ఆ కుర్రవాళ్ళను కేకలేసింది.

"ఎంత కోపం వస్తే మటుకు, అ చంటి వెధవను దెబ్బలు కొట్టి చంపుతావుటరా! నువ్వు మనిషివా! పశువువా!!" అంది కేకలు పెడుతూ.

ఆ వెధవ యింకా ఆ కుర్రవాడిని వదిలిపెట్టలేదు. మిగతా కుర్రవాళ్ళు ఈ తమాషా చూసి చప్పట్లు కొడుతున్నారు. అంతవరకూ కేకలు వేస్తున్న హనుమంతరావు యికచూస్తూ వూరుకోలేక, కలుగచేసుకుని, కుర్రవాడిని విడిపించాడు.

''వెధవా! చిన్న పిల్లవాడిని చూసి, నీ యిష్టం వచ్చినట్లు కొడతావా! ఉండు! నిన్ను పోలీసులకు అప్పగిస్తాను" అన్నాడు హనుమంతరావు.

'పోలీసులు' అనే మాట వినగానే ఆ చిన్న పిల్లవాడు తప్ప మిగతా వాళ్ళంతా యెక్కడి వాళ్లు అక్కడ పారిపోయారు.

''అయ్యో! అయ్యో! మనం రాకపోతే, ఈ చంటివాడిని వాళ్లు అన్యాయంగా చంపేసి వుందురు" అంది రుక్మిణమ్మ.

"ఏమీ చంపరు! కాసేపు తమాషాగా ఆడుకుని విడిచిపెట్టే వాళ్లేమో!" పరధ్యాన్నంగా, ఏమిటో ఆలోచిస్తూ అన్నాడు హనుమంతరావు.

''విడిచిపెట్టే వాళ్ళయితే, అలా బలంగా గుద్దుట గుద్దుతాడా! వెధవ!"

''చిన్న పిల్లల పోట్లాటలు తమాషాగా వుంటాయి! నిముషంలో కోపం వస్తుంది. మళ్ళీ కాసేపటిలో అన్నీ మరచిపోయి హాయిగా ఆడుకుంటారు''

''ఏమోనండి! ఈ పిల్లాడిని చూస్తే ముచ్చటేస్తున్నది. మన వెంట తీసుకువెళ్దాము. ఏమంటారు!'' అంది రుక్మిణమ్మ.

''సరే కానీ...." అంటూ నడక సాగించాడు హనుమంతరావు. రుక్మిణమ్మ పిల్లవాడి చెయ్యి పుచ్చుకుని వెమ్మదిగా అడుగులు వేస్తూ ఆయినను అనుసరించింది. దోవలో పిల్లవాడిని కొన్ని ప్రశ్నలు వేసింది.

''నీ పేరేమిటమ్మా!"

"రవి" ముద్దుగా చెప్పాడు.

''ఎందుకు నాయినా! ఆ వెధవ నిన్ను కొడుతున్నాడు?"

"ఏమి లేదండి! నేనేమో, ప్రసాదం కోసం ముందుగా పరుగెత్తాను ఎవరో గుళ్ళో నుంచి వస్తూ, నా చేతిలో ప్రసాదం పెట్టారు. అది నేను గుటుక్కున మింగేశాను. మిగతా కుర్రవాళ్ళు వచ్చేటప్పటికి నా చేతిలో యేమి మిగల లేదు. అందుకని ఆ వెధవకి కోపం వచ్చి నన్ను క్రిందకు పడత్రోసి కొట్టాడండి" చెపుతుంటే ఏడ్పు వచ్చింది.

"ఏడవమాకు నాయినా! నీకేమీ భయం లేదు. నేను నిన్ను కాపాడుతాను" అంది రుక్మిణమ్మ ఆవేశంతో

ఇంతలో వాళ్ళు యింటికి చేరుకున్నారు. రుక్మిణమ్మ తాళం చెవులు భర్తకు యిచ్చి

"నాయినా! ఆ కుళాయి దగ్గర కాళ్ళు చేతులూ శుభ్రంగా కడుక్కురా! నీకు ప్రసాదం పెడతాను" అంది.

హనుమంతరావు గది తలుపు తీశాడు. రవి కుళాయి దగ్గరకు వెళ్ళి కాళ్ళూ, చేతులూ కడుక్కుని, వొక్క పరుగులో మళ్ళీ అరుగు మీదకు వచ్చాడు

"ఇదిగో ప్రసాదం! ఇది తిని యిక్కడే కూర్చో! .... నేను వంట పని చూసుకుంటాను" అంటూ రుక్మిణమ్మ లోపలకు వెళ్లింది.

హనుమంతరావు అరుగుమీద కూర్చుని, పరధ్యాన్నంగా యేమిటో ఆలోచిస్తున్నాడు. రవి అరుగు మీద నుంచి క్రిందకు దిగి, రెండు గోళీలు బయటికి తీసి వాటితో ఆడు కుంటున్నాడు హనుమంతరావు వున్నట్లుండి జేబులు రెండూ తడుముకుని, సిగరెట్లు అయిపోయినావని తెలుసుకుని, రవిని దగ్గరకు పిలిచాడు.

"ఇదిగో! ఈ రూపాయి తీసుకుని వెళ్ళి 'సిజర్సు' సిగరెట్లు పట్టుకురా!" అంటూ రూపాయి నోటు ఆ కుర్రవాడి కిచ్చి పంపాడు వాడు వెళ్ళబోతుంటే

"ఏమి సిగరెట్లు!........ సిజర్సా!" అన్నాడు రావు.

"నాకన్నీ తెలుసులెండి" అంటూ కుర్రవాడు వెళ్ళి పోయాడు. ఈ వెధవకి సిగరెట్లలో రకాలు కూడా తెలుసే! వీడికికూడా పొగ త్రాగటం అలవాటు వుందేమో!' అంటూ ఆశ్చర్యపోయాడు.

ఇంతలో రుక్మిణమ్మ వాకిట్లోకి వచ్చి "రవి యేడండి?" అంది.

"సిగరెట్లకోసం బజారుకు పంపించాను" అన్నాడతను.

"వాడి నెందుకు పంపించారండి! మీరే తెచ్చుకుంటే పోయేదిగా!"

"వాడికి సిగరెట్ల సంగతి తెలుసులే! అందుకే పంపించాను...... సరే కానీ, ఈ వెధవ యింకా రాలేదే! ఆ రూపాయి చేతపుచ్చుకుని, యెటో పోయాడేమో!"

"రవి అలాంటివాడు కాదండి! చూడటానికి చాలా అమాయికుడిలా కనిపిస్తున్నాడండి"

"ఆ, ఆ, నీ కళ్ళకు అందరూ అమాయికులు లాగానే కనిపిస్తారు! నీ కసలు లోకం సంగతి బొత్తిగా తెలియదు... ఈ కుర్ర వాడేదో మంచివాడంటున్నావు కదా? ఇప్పుడే తెలిసిపోతుంది. వాడి మంచితనమేమిటో?" అన్నాడు నవ్వుతూ.

ఇంతలో రవి, సిగరెట్లు, చిల్లర చేత పుచ్చుకుని వచ్చి హనుమంతరావుకు యిచ్చాడు. అతని ముఖం చిన్న పోయింది ఆ కుర్రవాడి సంగతి సరిగా తెలుసుకోకుండానే తాను వొక దురభిప్రాయం కలిగించుకోవటం ఆ పైన తన అభిప్రాయం భార్యకు కూడా చెప్పటం, రెండూ అవివేకంగా గోచరించాయి.

"చూశారా! రవి మంచివాడు కాదన్నారే!" అంటూ రుక్మిణమ్మ నవ్వుతూ లోపలకు వెళ్ళింది.

హనుమంతరావుకు బాధ కలిగింది. తమకు యెలాగూ సంతానయోగం లేదు. పరాయి పిల్లలను చూచయినా, తను యెందుకు ఆనందించలేడు? ఈ విషయంలో తన భార్య, తనకంటే నయం! సంతానం లేదనే బాధను ఆమె మరచిపోయి, చిన్న పిల్లలను దగ్గరకు తీసి ఆప్యాయంగా మాట్లాడుతుంది........ఈ చిన్న పిల్లవాడిని చూస్తే ముద్దొస్తున్నది. ఈ కుర్రవాడి తల్లిదండ్రు లెవరో! ఎందువలన, యితను యిలా పిచ్చిగా రోడ్లవెంట తిరుగుతున్నాడో! ఈ పిల్లవాడిని తను దగ్గరకు తీసి పెంచుకుంటే బాగానే వుంటుంది. అయినా, ఈ కుర్రవాడు యే కులం వాడో! ఏమో! అడిగితే కాని తెలియదు.

"అబ్బాయి! నీ యిల్లెక్కడ?"

"నాకు యిల్లంటూ వొకటి లేదండి. సినిమా హాలు దగ్గరో, పార్కు దగ్గరో, రాత్రిళ్ల పడుకుని నిద్రపోతాను"

"అంటే, మీ అమ్మ, నాన్న యెవరూ లేరా!"

"లేరండి!" ఏడుస్తూ అన్నాడు రవి.

"ఏమిటి! చచ్చిపోయారా!"

"అవునండి! నా చిన్నప్పుడే యిద్దరూ పోయారు. అప్పటినుంచి యిలా పిచ్చిగా తిరుగుతున్నాను."

"అయితే, నీకు భగవంతుడే దిక్కన్నమాట!" సానుభూతితో హనుమంతరావు అన్నాడు.

అవునన్నట్లు రవి తల వూపాడు. అతని ముఖంలో విచార ఛాయలు స్పష్టంగా గోచరిస్తున్నాయి. చొక్కా చిరిగిపోయి వుంది. జుట్టు చిందరవందరగా వుంది.

ఇంతలో "వంటయిందండి! లోపలకు రావచ్చును" అనే కేక విని హనుమంతరావు "నాయనా! నువ్వు యిక్కడే కూర్చో! నేను భోజనం చేసి వస్తాను" అంటూ లోపలకు వెళ్ళాడు

"రవి యేడండి! వాడిని కూడా పిలవండి. భోజనం చేస్తాడు" అంది రుక్మిణమ్మ

"నాయనా, రవి! నువ్వు కూడా రా! భోజనం చేద్దువుగానీ...." అంటూ గావు కేక పెట్టాడు.

రవి వొక్క పరుగులో వంటింట్లోకి వచ్చాడు. రుక్మిణమ్మ అతన్ని చూసి

"మా నాయిన కదూ! కాళ్ళూ, చేతులూ మళ్ళీ వొక్కసారి కడుక్కురా నాయినా! చూడు! ఎలా దుమ్ము కొట్టుకుని వున్నాయో!" అంది

రవి వెళ్ళి కాళ్లూ, చేతులూ కడుక్కుని వచ్చాడు. అతను వచ్చేటప్పటికి అరిటాకులో అతనికి అన్నం వడ్డించి వుంది. రవికి బాగా ఆకలిగా వుంది. అందువలన గబ గబా తినటం మొదలు పెట్టాడు. రుక్మిణమ్మ స్వయంగా కనుక్కుని ఆ పిల్లవాడికి వడ్డన చేసింది.

అందరి భోజనాలు కాగానే, రుక్మిణమ్మ త్వరగా వంటింట్లో పని ముగించుకుని, కాసేపు యేదో పురాణగ్రంథం చదువుకుంటూ కాలం గడిపింది. రవి ఆమె ప్రక్కన కూర్చుని, ఆమె చదువుతుంటే, శ్రద్ధగా వింటున్నాడు. అతనికి యేమి అర్థం కావటం లేదు. అయినా బుద్ధిమంతుడిలాగా అక్కడే కూర్చున్నాడు.

"ఆడుకోవటానికి వెళ్ళలేదేమి నాయినా!" అంది రుక్మిణమ్మ.

"ఆడుకోవటానికి వెళ్తే, వాళ్ళు తంతారు, వాళ్ళు మంచివాళ్ళు కారు....వాళ్ళతో నేను ఆడుకోను"

"సరేకానీ, మీ అమ్మ, నాన్న యెక్కడున్నారు?"

"ఎవ్వరూ లేరండి!"

"ఏమిటి! ఎవరూ లేరా! అంటే...."

"చిన్నప్పుడే చచ్చిపోయినారండి." బిక్క మొహం వేశాడు.

"అయ్యో! పాపం!" అంది రుక్మిణమ్మ.

ఇంతలో హనుమంతరావు సిగరెట్ కాల్చుకుంటూ అక్కడకు వచ్చాడు,

"ఈ అబ్బాయికి తల్లిదండ్రులెవరూ లేరుటండీ!" అంది రుక్మిణమ్మ.

"అంతా విన్నాను." అన్నాడు హనుమంతరావు.

రవి యిక అక్కడ వుండటం యిష్టంలేక, ఆడుకుంటానని చెప్పి బయటకు వెళ్ళాడు

"ఈ పిల్లవాడిని చూస్తే, ముచ్చటేస్తున్నదండి. మనం వాడిని పెంచుకుంటే బాగుంటుందేమోనని నాకనిపిస్తోంది. ఏమంటారు?" అంది రుక్మిణమ్మ

"బాగానే వుంటుంది కానీ, ఈ పిల్లవాడు యే కులంవాడో మనకు తెలియకుండా వుందే!"

"ఏదో వొక కులం! బ్రాహ్మణుల పిల్లవాడనే అనుకుందాము. ఎవరన్నా అడిగితే ఆమాటే చెబుదాము! ఇందులో పెద్ద చిక్కేమివుంది!"

"చిక్కేమిలేదు కానీ, యింత బ్రదుకూ బ్రతికి, ఒక పిల్లవాడికోసం కుల భ్రష్టులము కావటం దేనికని..."

"ఏమిటండీ ఈ కులాలు!....భగవంతుడి దృష్టిలో అందరూ సమానులే కదా!"

"పిల్లలు లేరనే బాధలో నువ్వు అలా అంటున్నావు కానీ, ఈ కుర్రవాడు నిజంగా పరాయికులం వాడయితే, నువ్వు పెంచుకోవటానికి యిష్టపడుతావా?"

"ఆ! తప్పకుండా యిష్టపడతాను" అంది ఆవేశంతో

"ఈ కబుర్ల కేమికానీ, ఆ కుర్రవాడి సంగతి సరిగా తెలుసుకోకుండా, మనం తొందర పడటం మంచిది కాదు. పిల్లలు లేరనే బాధ నీకే కాదు; నాకూ వుంది. కానీ యేమి చేస్తాం చెప్పు!...అయినా భగవంతుడు కనికరించి, మనకే సంతానం యివ్వ కూడదా!"

"ఏమో! నాకు నమ్మకం లేదు!....నేను పాపిష్టిదాన్ని! గొడ్రాలును" అంది కంట తడిపెడుతూ

"ఊరుకో!....ఎందుకు కంట తడిపెడుతావు?" అన్నాడు హనుమంతరావు.

ఇంతలో వాకిట్లో యెవరో పిల్లవాడి యేడుపు విని పించింది. హనుమంతరావు హడావుడిగా వాకిట్లోకి వెళ్ళాడు. రవిని యెవరో కొడుతున్నారు. వాడు పెద్దగా యేడుస్తున్నాడు.

"వెధవా నీకోసం యెన్ని వూళ్ళు గాలించానురా! ఎక్కడ తిరుగుతున్నావురా యిన్నాళ్ళు!" అంటున్నాడు ఆ మనిషి.

"కొట్టమాకునాన్నా! నిజం చెపుతాను! నువ్వు ఆ రోజు నన్ను యింట్లోనుంచి తరిమేశాక, రైలెక్కి బయలు దేరాను. అప్పటి నుంచీ అన్ని వూళ్ళూ తిరుగుతున్నాను." అంటున్నాడు రవి.

"ఏదో కోపంలో రెండు దెబ్బలు వేస్తే, యింట్లో నుంచి పారిపోతావా! వెధవా!" అంటూ రవి వీపు మీద మరొక రెండు గుద్దులు గుద్దాడు ఆ పెద్ద మనిషి. అయినా, అయన కోపం చల్లార లేదు. దబదబా, మరో నాలుగు దెబ్బలు కొట్టాడు.

హనుమంతరావు యిదంతా చూసి వూరుకోలేక, రవిని ఆయన చేతుల్లోనుంచి విడిపించాడు. రుక్మిణమ్మ అప్పటికే వాకిట్లోకి వచ్చి, జరిగిన సంభాషణ అంతా విన్నది. ఆమె ఆశ్చర్యపోయింది. రవికి తల్లిదండ్రులు వున్నారా!! మరి లేరని చెప్పాడే!...అయితే, ఈ పిల్లవాడు. దేవాంతకుడులాగా వున్నాడు! ఎంత వినయంగా తన దగ్గర మాట్లాడాడు! తల్లిదండ్రుల సంగతి అడిగితే, ఏడుస్తూ లేరని చెప్పాడు. తను నిజమే కాబోలుననుకుని, ఆ కుర్రవాడి మీద ఆశలు కల్పించుకుంది.... వెధవ! వేలెడు లేడు మోసం చేయడం కూడా నేర్చుకున్నాడు. ఇంట్లో నుంచి పారిపోయి వచ్చింది చాలక, తల్లిదండ్రులు కూడా లేరని అబద్ధం చెప్పటం నేర్చుకున్నాడు. ఈ పిల్లవాడికి అమోఘమైన తెలివి తేటలు వున్నాయి....ఇంకానయం! ముందే తెలిసింది! తమ తొందరబడి, ఈ పిల్లవాడిని తమవూరు తీసుకు వెళ్ళి దత్తత చేసుకోలేదు.

హనుమంతరావు రవిని విడిపించటానికి వెళ్ళేటప్పటికి, యింకా నలుగురు పోగయారు.

"ఏమండీ! ఈ పిల్లవాడు మీవాడేనా!" ఆశ్చర్యపోతూ అడిగాడు హనుమంతరావు.

"అవునండి, మా పిల్లవాడే! నెల రోజుల క్రితం, యింట్లోనుంచి పారిపోయాడు. అప్పటినుంచీ, వీడికోసం వెతుకుతున్నాము"

"అదృష్టవంతులు! ఇప్పటికయినా, మీ పిల్లవాడు మీకు దొరికాడు!"

"ఏమి అదృష్టం లెండి! బడికి సరిగ్గా పోడు. ఊళ్ళో నానా అల్లరీ చేస్తాడు.....వీడు యెలా పైకి వస్తాడో యేమో భగవంతుడికే తెలియాలి!" దిగులుగా అన్నాడాయన

"మరేం భయంలేదు లెండి! కాస్త పెద్దవాడయితే, దోవకు వస్తాడు"

"ఏమో! అంతా ఆ భగవంతుడి దయ!" అంటూ కుర్రవాడిని తీసుకుని ఆయన వెళ్ళిపోయాడు.

హనుమంతరావు ఒక క్షణంపాటు. అలాగే నిలుచుండి పోయాడు. ఎంత విచిత్రమైనది ఈ లోకం! పిల్లలు కావాలని తాపత్రయం పడేవాళ్ళకు సంతానమే వుండదు. "వద్దు బాబూ!" అనుకునే వాళ్ళకు, వద్దన్నా పిల్లలు కలుగుతూ వుంటారు. గంపెడు పిల్లలతో సంసారం చేయలేక, వాళ్ళు సతమత మవుతూ వుంటారు. వాళ్ళ అదృష్టం బాగుండక, పిల్లలు పెడదోవన పడితే, అదొక బాధ! పిల్లలు యింట్లో నుంచి పారిపోతే, వాళ్ళకోసం గాలించలేక ఒక బాధ! పిల్లవాడికి చదువు సంధ్యలు అబ్బక అల్లరి చిల్లరగా తిరుగుతుంటే, వాడి భవిష్యత్తు ఏమవుతుందోనని బాధ!!........ ఏమిటో! అన్నీ బాధలే! పిల్లలు లేని వాళ్ళకు ఈ బాధలు వుండవు... .... పిల్లల సంఖ్య అధికమయిన కొద్దీ, కుటుంబ నిర్వహణ కష్టమయి పోతుంది. ఇంటి యజమాని సంపాదించే డబ్బు యింటి ఖర్చు క్రింద చాలదు. ఆపైన పిల్లలకు, కుటుంబానికి కడుపునిండా తిండి వుండదు. అందుకే కొంత మంది పిల్లలు యింట్లో నుంచి పారిపోతూ వుండవచ్చును.... ప్రభుత్వం యిలాంటి అనర్థాలు నివారించటానికి కుటుంబ నియంత్రణ పథకం అమలు జరుపుతున్నది అయినా జనాభా యేమి తగ్గటంలేదు ....హనుమంతరావు ఆలోచిస్తూ వుండిపోయాడు.

"ఏమండీ! అలా రోడ్డు మీద నిలుచుండి పోయారే!" అంది రుక్మిణమ్మ.

"ఇదిగో వస్తున్నా!"

"ఏమిటి ఆలోచిస్తున్నారు?"

"అహ... ఏమీ లేదు. పిల్లల వలన యెంత ఆనంద పడతామో, అంతకు రెట్టింపు వొక్కొక్కసారి వాళ్ళకోసం బాధ పడవలసి వస్తుంది. రవి తండ్రి చూడు! పిల్లలతో యెంత అవస్థపడుతున్నాడో!"

"మనకెందుకా ఆలోచన! మనకు పిల్లలు లేరుగా!" అంది రుక్మిణమ్మ బాధగా.

"ఎందుకు రుక్మిణీ! ఊరికె బాధపడతావు! మనకు పిల్లలు లేకపోతే వచ్చిన లోటేమిటి! ఇప్పుడు మాత్రం హాయిగా లేదూ!.... దేశంలో నానాటికీ జనాభా పెరిగి పోతుంది. అందువలన మనకు పిల్లలు లేరని బాధపడటం అర్థం లేదు" అన్నాడు హనుమంతరావు.

నావలో నీరు నిండినప్పుడు మనం ఒక్క చేతితో కాక, రెండు చేతులంతో ఆ నీటిని బయటికి నెట్టినట్లే, ఇంట్లో పెరిగిన ధనాన్ని ఇంటి బయటికి పంపి, ఇంటిని రక్షించుకోవాలి. గ్రహీతలెవరైనా మనకు లభిస్తే వారికి మనం కృతజ్ఞులం కావాలి. ఫుట్‌బాల్ వలే ధనం ఆట సాగాలి. బంతిని ఎవ్వరూ తన వద్దనే అట్టే పెట్టుకోరు. అది తమ వద్దకు చేరిన వెంటనే మరొకరికి విసిరి వేస్తారు ధనమునూ ఈ విధముగానే బయటకు పంపుతూయుంటే సమాజ శరీరంలో అది ప్రవహిస్తూ వుంటుంది. దానివల్ల సమాజ ఆరోగ్యం చక్కగా వుంటుంది. సంస్కృతంలో ధనమును ద్రవ్యము అంటారు అది స్థిరంగా ఉండి పోతే నిలిచిన నీటివలె దుర్వాసనకొడుతుంది.

— వినోబా

* * *

ఆంధ్ర దేశములో బ్రహ్మ సమాజమనగానే, తాను పెదవి విప్పిన సత్యవాదియై తాను ప్రబోధించిన వివేక సిద్ధుడై, తాను ఆచరించినవి హితకారులై, ఉపదేశించే వేళ ప్ర[illegible]మై, [illegible] ఉభయ [illegible]మై ఉద్యమములకు ఆది పురుషుడై దక్షిణ దేశమునకు రామమోహనుడై వీరేశలింగం వెలుగొందును.

— కృష్ణశాస్త్రి

* * *

లోకం నిన్ను దూషిస్తున్నారా? భూషిస్తున్నారా అనేది ముఖ్యం కాదు. నిన్ను గురించి చర్చిస్తున్నారా లేదా అసలు ముఖ్యం

— చర్చిల్.

జిల్లా వార్తలు

ఆదిలాబాదు

పంచాయతీ సమితి కృషి :- ఆదిలాబాదు పంచాయతీ సమితిలో 1959-60 వ సం|| లో మూడు వ్యవసాయ సంపతి సంఘాలు ప్రారంభింపబడినవి. వాటా ధనంగా రూ. 11,328 ల మొత్తం వసూలు చేయబడినది. ఋణాల క్రింద రూ. 11.361 ల మొత్తం పంపిణీ చేయబడినవి. ఈ సంవత్సరంలో క్రొత్తగా నాలుగు పాఠశాలలు తెరువబడినవి. పదమూడు పాఠశాలలు అభివృద్ధి పరచబడినవి. రెండు సాధారణ పాఠశాలలు ప్రాతిపదిక నమూనా పాఠశాలల క్రింద మార్చబడినవి.

ఆదిలాబాదు జిల్లాలో నూతన పాఠశాలలు :- చిట్యాల, మంజ్లాపూర్ వెంగపేట, లెహెగ్రు, చించోలి, ఎల్లారెడ్డి పేట, భీమ్ని, నర్సాపూర్- గడెహాంద గ్రామాలలో పాఠశాలల భవనాలను నిర్మించడానికి రూ. 62703 ల మొత్తాన్ని 21 బావులను నిర్మించడానికి రూ. 70,000 ల మొత్తాన్ని ఆదిలాబాదు జిల్లా పరిషత్తు ఆర్థిక, పన్ను విధింపుల స్థాయీ సంఘం మంజూరు చేసింది.

అనంతపురం

నూతన సమితి ప్రారంభం :- టనకల్ సమితి మొదటి అంచె బ్లాకు 1960 మే 7 వ తేదీన ప్రారంభింపబడినది.

కంబళి నేత శిక్షణ కేంద్రం :- ఆత్మకూరులో 1960 మే 6 వ తేదీన కంబళి నేత శిక్షణ కేంద్రానికి ప్రారంభోత్సవం జరిగినది.

యువజన నాయకుల శిక్షణ శిబిరం :- సింగనమలలో 1960 ఏప్రిల్ 25 నుంచి 29 వ తేదీ వరకు యువజన నాయకుల శిక్షణ శిబిరం నిర్వహింపబడినది. ఈ జిల్లాలో ఇటువంటి శిబిరం నడపబడటం ఇదే మొదలు.

గుంటూరు

మధ్యాహ్న భోజన పథకం :- బీద పిల్లల నిమిత్తం మధ్యాహ్న భోజన పథకాన్ని సమితి విరాళములతో అమలు పరచడానికి సంతమాగులూరు బ్లాకులోని పది పంచాయతీలు, 1960 మార్చిలో తీర్మానించినవి.

ఉడుపుల తయారీ కేంద్రం :- ఎల్లమందలో 1960 మార్చిలో ఉడుపుల తయారీ కేంద్రం ఒకటి తెరువబడినది.

ఖమ్మం

విద్యార్థులచే రోడ్డు నిర్మాణం :- తిరుమలాయపాలెం బ్లాకులోని వెంకటాయపాలెం గ్రామంలో 1960 మే నెలలో భారత్ సేవక్ సమాజ్ వారు విద్యార్థుల శిబిరాన్నొకదానిని నిర్వహించారు.

ఖమ్మంలోని ప్రభుత్వ బహూళార్థ సాధక ఉన్నత పాఠశాలకు చెందిన 60 మంది విద్యార్థులు దీనిలో పాల్గొన్నారు. వీరు సుమారు ఒక మైలు పొడవుగల అప్రోచ్ రోడ్డు నిర్మించారు. స్థానిక పాఠశాల ఆవరణలో ఒక బావి త్రవ్వారు.

కృష్ణా

కుటుంబ నియంత్రణపై గోష్ఠి :- బంటుమిల్లి గ్రామంలో 1960 జూన్ 12 వ తేదీన కుటుంబ నియంత్రణపై జరిగిన గోష్ఠి ప్రారంభించబడినది. ఈ గోష్ఠి మూడు రోజుల పాటు జరిగినది. ఈ సందర్భంలో కుటుంబ నియంత్రణ పద్ధతులను వివరించు ఒక చలన చిత్రం ప్రదర్శించబడినది. ఒక వస్తు ప్రదర్శనం కూడా ఏర్పాటు చేయబడినది.

ఉచిత మధ్యాహ్న భోజనం :- గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న బీద విద్యార్థుల నిమిత్తం నూజివీడు పంచాయతీ సమితి బ్లాకు ఆధ్వర్యాన అచ్చట ఉచిత

మధ్యాహ్న భోజన కేంద్రం ఒకటి తెరువబడినది. కృష్ణా జిల్లాలో ఇదే తొలి కేంద్రం. దీనిలో రోజూ 90 మంది బడిపిల్లలకు భోజనం పెట్టబడుతున్నది. ఇందుకు అయ్యే వ్యయంలో నూటికి 50 వంతులు కేంద్రం, 25 వంతులు రాష్ట్రం, మిగతా దాన్ని సమితి, గ్రామ పంచాయతీ, గ్రామస్థులు భరిస్తున్నారు.

బందరు కాలువపై కాలిబాట వంతెన నిర్మాణానికి శంకుస్థాపన :- విజయవాడ తాలూకా ఎనమలకుదురు గ్రామంలో బందరు కాలువపై కాలిబాట వంతెన నిర్మాణానికి 1960 మే 15 వ తేదీన శంకుస్థాపన జరిగినది. దీని వ్యయం అంచనా రూ. 30,000 లు. మొత్తం వ్యయంలో రూ. 15,000 లు మొత్తం రాష్ట్ర నిధుల నుంచీ, నాలుగింట ఒక వంతు గ్రామ ప్రణాళికా పథకాల క్రింద జిల్లా పరిషత్తు నిధుల నుంచీ భరించబడతాయి. మిగిలిన దానిని పంచాయతీ, గ్రామస్థులు భరిస్తారు.

ప్రజలచే రూ. 4,000 ల విరాళం :- ముక్కొల్లుపాడు పంచాయతీ సమితి పాఠశాల భవనం, 1960 మే 14 వ తేదీన తెరువబడినది. దీని నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2530 ల గ్రాంటు ఇవ్వగా గ్రామస్థులు రూ. 4,000 ల విరాళం ఇచ్చారు.

కర్నూలు

సహకార నూనె మిల్లులు :- ఆదోనిలో 1960 జూన్ 6వ తేదీన సహకార నూనె మిల్లులకు శంకుస్థాపన జరిగినది

మహబూబ్‌నగరం

గ్రామ రోడ్లు అభివృద్ధి :- ఈ సంవత్సరంలో, గ్రామ రోడ్ల అభివృద్ధి సహకార పథకం క్రింద ఈ దిగువ పేర్కొనబడిన రోడ్డు పనులు మంజూరు చేయబడినవి:-

1. ఇటిక్యాల్ నుంచి ఇటిక్యాల్ రైలు స్టేషను వరకుగల రోడ్డు (అంచనా వ్యయం రు. 15,000)
2. మన్యంకొండ రైలు స్టేషను నుంచి రామచంద్రాపురం వరకు గల రోడ్డు (అంచనా వ్యయం రూ. 10,000)
3. ధారూర్ నుంచి ఆలోపాడు వరకు గల రోడ్డు (అంచనా వ్యయం రూ. 40,000)

మొదటి రెండు పనులూ 1959 డిశెంబరులో ప్రారంభింపబడినవి. మిగతా పని ఇటీవల చేపట్టబడినది.

గ్రంథాలయ వార్షికోత్సవం : మక్తల్‌లోని శ్రీ కృష్ణ గ్రంథాలయం ద్వితీయ వార్షికోత్సవం 1960 జూన్ 12 వ తేదీన జరిగింది. మక్తల్ తాలూకా హెడ్‌క్వార్టర్స్‌లో ఇదే మొదటి గ్రంథాలయం. దీనిని కొందరు ఉత్సాహపరులైన యువకులు స్థాపించారు.

సంగీత, నాటకోత్సవాలు :- దేవరకదర పంచాయతీ బ్లాకు ఆవరణలో 1960 మే 31 వ తేదీన సంగీత, నాటకోత్సవం జరిగినది. "యమలోకంలో భూలోకం" ఉత్తమ నాటకంగా, "రామయ్య రైతు కథ" ఉత్తమ బుర్రకథగా నిర్ణయించబడినవి. ఉత్తమ నర్తకులకూ, ఉత్తమ భజన దళముల వారికీ కూడా బహుమతులు ఇవ్వబడినవి.

వృద్ధ గ్రామస్థుడిచే పాఠశాల భవనానికి శంకుస్థాపన :- చాత్రపెల పంచాయతీ రేవలపల్లి గ్రామానికి చెందిన కురువృద్ధు శ్రీ బి. హనుమయ్య, 1960 జూన్ రెండవ వారంలో తమ గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవనానికి పునాదిరాయి వేశారు. ఈ భవనాన్ని శ్రమదానం ద్వారా త్వరలో నిర్మించవలసిందిగా ఆయన గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు.

నల్గొండ

సాంఘిక, ఆర్థిక సర్వే :- నల్గొండ నాగార్జున కళాశాలలో, విద్యార్థులలో ప్రణాళికా చైతన్యాన్ని కలిగించే నిమిత్తం కళాశాల ప్రణాళికా ఫోరం స్థాపించబడింది. బ్లాకు ప్రాంతంలోని ఒక గ్రామంలోనూ, బ్లాకు ఏర్పడని ప్రాంతంలోని ఒక గ్రామంలోను సాంఘిక, ఆర్థిక సర్వే జరపడానికి ఈ ఫోరం వారు నిశ్చయించారు. జిల్లా పరిషత్తు ఆర్థిక పన్ను విధింపుల స్థాయీ సంఘం వారు దీనికి రూ. 300 ల గ్రాంటు ఇవ్వడానికి సూత్రప్రాయంగా తీర్మానించారు.

కర్షకుడికి బహుమతి :- పెద్ద ఊర పంచాయతీ సమితి బ్లాకులోని వెలమగూడ కాపురస్థుడైన శ్రీ కటికినేని నరసింహారావు ఈ బ్లాకు ప్రాంతంలో కల్లా ఒక ఎకరం భూమిలో అందరికంటే ఎక్కువ ధాన్యం పండించిన ఖ్యాతి తెచ్చుకున్నాడు. ఈయన తన పొలంలోని ఒక ఎకరం భూమిలో

10120 పౌనుల వరి పండించాడు. బ్లాకు మేలా సందర్భంలో జరిగిన సభలో ఈయనకు మేలిరకం వ్యవసాయ పనిముట్లు బహూకరించబడినవి.

మట్టంపల్లిలో యువజన క్లబ్బు :- హుజూర్‌నగరం పంచాయతీ సమితి బ్లాకులోని మట్టంపల్లి గ్రామంలో 1960 మే చివరి వారంలో 150 మంది సభ్యులతో ఒక యువజన క్లబ్బు స్థాపించబడినది. మట్టంపల్లిని ఒక ఆదర్శ గ్రామంగా రూపొందించడానికి క్లబ్బు సభ్యులు దీక్షబూనారు. రాష్ట్రం లోని ప్రముఖ స్థలాలను సందర్శించడానికి గాను అభ్యుదయ రైతులతో విజ్ఞానయాత్ర ఏర్పాటు చేయడానికి కూడా వీరు నిశ్చయించారు.

మారుమూల గ్రామాలకు పాఠశాలలు :- వెంకటాపురం బ్లాకు చేకులగూడెం.గ్రామస్థులు, 1960 మే నెలలో ఒక పాఠశాలనూ, ఉపాధ్యాయులకు ఇండ్లను నిర్మించారు. చింతూరు కొండజాతుల వారు కూడా ఒక పాఠశాలను నిర్మించడానికి సంసిద్ధులైనారు. ఈ రెండు గ్రామాలు కూడా భద్రాచలం తాలూకాలో మారుమూలగా వున్నవి.

కుటుంబ నియంత్రణపై గోష్ఠి:- పెద్ద ఊరలో, 1960 మే చివరి వారంలో మూడు రోజులపాటు కుటుంబ నియంత్రణపై గోష్ఠి జరిగినది. ఈ జిల్లాలో ఇటువంటి గోష్ఠి జరగడం ఇదే మొదలు. పెద్ద ఊర సమితి నుంచి 50 మంది ప్రతినిధులు గోష్ఠికి హాజరైనారు.

ఎరువు గుంటలు :- నల్గొండ జిల్లాలోకెల్లా అత్యధికంగా ఎరువు గుంటలను త్రవ్వడంవల్ల చౌటుప్పల్ పంచాయతీ సమితికి బహుమతి లభించింది.

బీబీ గూడాకి మంచినీటి సరఫరా :- సూర్యాపేట పంచాయతీ సమితి బ్లాకులోని బీబీగూడా గ్రామంలో మంచి నీటి సరఫరా పథకానికి 1960 మే నెలలో శంకుస్థాపన జరిగినది.

నిజామాబాదు

లక్ష్యాన్ని మించి వసూళ్లు :- నిజామాబాదు జిల్లాలో 1959—60 వ సం.లో చిన్న మొత్తం పొదుపు వసూళ్ళు లక్ష్యానికంటే నూటికి 28 వంతులు అధిగమించినవి.

చిన్న మొత్తాల పొదుపు :- నిజామాబాదు పంచాయతీ సమితిలో ఇటీవల పొదుపు పక్షం జరిగినప్పుడు రూ. 13,000 ల మొత్తం వసూలైనది.

మంచి రోడ్లు :- ఈ సంవత్సరంలో జిల్లా పరిషత్తు రోడ్ల నిర్వహణకు రూ. 1,08,000 ల మొత్తం ఖర్చు చేయబడుతుంది.

మంచి నీటి బావుల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 54,000 ల మొత్తం మంజూరు చేసింది. పంచాయతీలూ, గ్రామస్థులు కొత్త బావులు త్రవ్వకానికి అయ్యే ఖర్చులో సగం భరిస్తారు.

వరంగల్

వరదన్నపేట బ్లాకు మేలా :- వరదన్నపేట పంచాయతీ సమితి బ్లాకు మేలా, వరదన్నపేటలో 1960 మే 27 నుంచి 29 వ తేదీ వరకు జరిగినది. ఈ సందర్భంలో మేలా టోర్నమెంటు కూడా జరిగింది.

శిక్షణ శిబిరం :- వరదన్నపేట సమితి బ్లాకులోని రాయపర్తి గ్రామంలో 1960 మే 12 నుంచి 14 వ తేదీ వరకు గ్రామ నాయకుల శిక్షణ శిబిరం నిర్వహించబడినది. రాయపర్తి, చన్నూరు పరిసరాలకు చెందిన ఎనిమిది గ్రామాల నుంచి 50 మంది శిక్షితులు హాజరైనారు.

మానవుని ప్రధాన స్వభావం, సత్యాన్వేషణ లోను, ప్రేమ భావ వ్యాపనం లోను వ్యక్తం కావాలి. వస్తు సంపాదనలోగాని, మానవ జాతిని జయించటంలోగాని కాదు.

— టాగూరు.

వన మహోత్సవం

ఇ. వేణుగోపాల రావు

భూసార సంరక్షణ, జలాధారాలరక్షణ, స్థానిక భౌతిక, వాతావరణ పరిస్థితులను మెరుగు పరచడంలో చెట్లు ప్రధానపాత్ర నిర్వహిస్తున్నవి. భూమి బీటలు వారటం. వరదలు ఎడారుల నివారణలో వాటి ప్రాధాన్యం కూడా యిప్పుడు పూర్తిగా గుర్తించ బడింది. వర్షపాతం మీద. భూమి ఉపరి భాగంలోనూ. లోతట్టున వావ నీటి ప్రవాహం మీద చెట్లు తమ ప్రభావం ప్రసరింపజేస్తాయి. వాతావరణంలో మార్పులు కలగడంలో కూడా చెట్లు ప్రమేయం వుంటుంది. అవి గాలిని పరిశుభ్ర పరచి మానవ దేహారోగ్యానికి అమూల్యమైన సేవ చేస్తున్నవి చెట్ల ఉనికి ఆహార పదార్థాలు. వంటచెరుకు, పశుగ్రాసం ఉత్పత్తికి దోహదకరం. భూమిని సక్రమంగా, ప్రయోజనాత్మకంగా వినియోగించుకో దలచిన ఏ పథకంలోనైనా చెట్లునాటే కార్యక్రమానికి ప్రాధాన్యం లభించక తప్పదు. కొద్దిలో చెప్పాలంటే సంక్షేమ రాజ్యంలో ప్రజల యోగక్షేమాల సంరక్షణకు చెట్లునాటే కార్యక్రమం అత్యవసరం.

పూర్వకాలంలో దయాశీలులైన రాజులు చక్రవర్తులు దారుల వెంటచెట్లు నాటించే వారు. బాటసారుల పథి శ్రమ బాపటమే వారి ప్రధాన లక్ష్యం. అశోక చక్రవర్తి రోడ్ల వెంట చెట్లు, ఉద్యానవనాలు ఏర్పాటు చేశాడని మనకు తెలుసు. అడవులను, వాటిలోని మూగ జీవాలకు సంరక్షణ కల్పించాడు. కౌటిల్యుని అర్థశాస్త్రంలో అడవుల సంరక్షణ, వన్యమృగ సంరక్షణను గురించిన ప్రసక్తి వుంది.

జపాను దేశస్థులకు అడవులంటే ప్రాణం. కొద్ది చోటులోనే ప్రకృతి దృశ్యం కండ్ల పండువుగా కనిపించటానికి ఉద్యానవనాల్లో చిన్న చిన్న చెట్లు పెంచుతారు. జర్మనీదేశీయులు కెలవు రోజున చెట్లతోనే కాలంగడుపుతారు. మన దేశంలో, మన కాలంలోనే విశ్వకవిటాగూరు తనకు చెట్లంటే ఎంత యిష్టమో విశ్వభారతిలో "వృక్షారోహణ" ఏర్పాటు చేసి చూపించాడు. సమీప గ్రామాలకు కూడా చెట్లు నాటే పవిత్ర కర్తవ్యాన్ని ఆయన వ్యాపింప జేశాడు 1950లో అప్పటి భారత ప్రభుత్వపు ఆహార శాఖ మంత్రి శ్రీ కె. యం. మున్షీ చెట్లు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ప్రారంభించి, దానికి అఖిలభారత జాతీయ స్థాయి కల్పించి "వనమహోత్సవ" ఆదర్శాన్ని ఆచరణలో పెట్టి చూపించారు. ఆనాటి నుండి మన జాతీయాభివృద్ధి కార్యక్రమంలో వనమహోత్సవం ప్రముఖ స్థానమాక్రమించింది.

ముఖ్య కార్యక్రమం

వనమహోత్సవం 1950 జులైలో ప్రారంభమై. నాటి నుంచి ఏటేటా జరుగుతున్నది. క్రమంగా యీ కార్యక్రమంలో ప్రజోత్సాహం వెల్లి విరిసింది. ప్రకృతి దృశ్యా రామణీయకత వైపు ప్రజల మనస్సు పరుగులు పెట్టింది. వృక్షములన్నా, మొక్కలన్నా ప్రేమ, అభిమానం, గౌరవం ప్రజలు చూపుతున్నారు. ప్రజలలో వృక్ష చైతన్యం పూర్తిగా కల్గించనని చెప్పవచ్చు. భూమి మార్పుల కార్యక్రమంలో ముఖ్య భాగంగా యిప్పుడు వనమహోత్సవం నిర్వహించబడుతున్నది. అడవులు. వ్యవసాయం, పట్టు ఉత్పత్తి, ఉద్యాన కృషి. భూసార రక్షణ, జలాధార రక్షణ. భూమి వినియోగం, బీటలు వారటం, వరదలు. ఎడారులు. క్రొత్తసాగు మొదలగు వాటిపై వనమహోత్సవ ప్రభావం, బహుళార్థసాధక ప్రాజెక్టులలో దాని స్థానం, ఆహారం. వంటచెరుకు.పశుగ్రాసం ఉత్పత్తిలో దాని ప్రాధాన్యం నిర్వివాదమైన అంశాలు. వనమహోత్సవాన్ని రూపొం

దించిన ప్రాథమిక లక్ష్యం జాతీయ జీవితంలో ప్రధానాంగంగా అల్లుకు పోవడం అవసరం. అంటే యిదొక ప్రజోద్యమంగా రూపొందాలి. ప్రకృతికాంత ధరించిన ఆకుపచ్చని చీరలో వనమహోత్సవ కార్యక్రమం ఒక బంగారు జరీపోగు. ఇది మన జాతి ప్రపంచానికి యిచ్చిన కానుక, వనమహోత్సవం భూమండలంలోని మానవ జాతికి సహోదరి వంటిది. సంరక్షకురాలు జాతీయ సంస్కృతిలోని యీ ప్రధాన విభాగాన్ని సంరక్షించుకుని, అభివృద్ధి చేసుకోమని ప్రకృతిమాత యిచ్చిన ఆదేశం వనమహోత్సవం.

అటవీశాఖ విధానం

ప్రకృతి మనిషికి ప్రసాదించిన సహజవనరాలలో వృక్షాచ్ఛాదన ముఖ్యమైంది. దీని ప్రయోజనాలు పరిసర ప్రాంతాలపై దీని ప్రభావం గురించి విరివిగా తెలుసుకుంటే, దీనిని ఎంత భద్రంగా రక్షించుకోవాలో, సాధ్యమైనంత త్వరలో మన చుట్టు ప్రక్కల ప్రాంతాలను ఎంత కళకళలాడుతూ వుండేటట్లు చేసుకోవాలో అర్థమవుతుంది.

అడవుల పెంపకం విషయంలో ప్రభుత్వం చేస్తున్న పని చాలదు. అటవీశాఖ వారి కార్యక్రమంలో తిరిగి మొక్కలు నాటి అడవులను పెంచటం ప్రధానాంశం. దీనికి సంబంధించిన అనేక పథకాలు తయారై సిద్ధంగా వున్నాయి. భూమి ఖిల్గుల్ను వారిన ప్రాంతాలలోనూ, కొండ ప్రాంతాలలోనూ కష్టసాధ్యమైన పథకాలు కూడా అమలు పరుస్తున్నారు. అటవీశాఖ, వ్యవసాయ శాఖవారు భూసార సంరక్ష పథకాలను కూడా చేపట్టి పని చేస్తున్నారు.

అటవీ, వ్యవసాయ, హైవేస్ శాఖలవారు మామూలు కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే పని చేస్తూనే వుంటారు. దానికి ప్రోద్బలంగా వనమహోత్సవ కార్యక్రమం జరగాలి. ఈ ఉద్యమం దేశం మారుమూల గ్రామాలకు కూడా ప్రాకి యింటింటా విలసిల్లాలి.

ఏ మొక్కను ఎక్కడ వేసినా బతుకుతుందని అనుకోటానికి అవకాశం లేదు. ప్రతి మొక్కకు ప్రత్యేక లక్షణాలు వుంటాయి దానికి కొన్ని అలవాట్లు, అనుకూల వాతావరణాభిలాష వుంటుంది. అందువల్ల ఆయా ప్రదేశాలకు తగిన చెట్లను ఎన్నుకోవడం అనే విషయానికి చాలా ప్రాధాన్యం వుంది. ఇది శాస్త్రీయ పద్ధతిలో జరగాలి. సౌందర్య దృష్టి, ఆర్థిక విషయాలు అలా వుంచినా శాస్త్రీయ దృక్పథంతో స్థలానుగుణమైన చెట్లను నాటితేనే వన మహోత్సవం సార్థకమవుతుంది. ఒక మొక్క నాటిన నేల, శీతోష్ణ స్థితి గతులు దాని పెరుగుదలను నిర్ణయిస్తాయి. ముందుగా చెట్లు నాటవలసిన స్థలం నిర్ణయించుకోవడం ముఖ్యం. ఎందుకంటే స్థలాన్నిబట్టి తత్సంబంధ ప్రయోజనాలు కూడా మారుతుంటాయి.

రోడ్డు వెంబడి నాటేచెట్లు బాటసారులకు శ్రమాపనోదనకరంగా వుండాలి. ఆ ప్రదేశానికి దృశ్యమానమైన అలంకరణప్రాయంగా వుండాలి. ఆర్థికంగా అవి ప్రయోజనాత్మకంగా, ఉపయోగకరంగానూ వుండాలి దుమ్ము ధూళి కొట్టుకొని వచ్చి బాటలమీద పడకుండా రక్షణ కవచంగా వుపయోగ పడాలి. నగర మధ్యంలో వుండే రోడ్లు, పల్లె సీమలలో ప్రయాణాలకు గాను వేసే రోడ్లు మొదలగు రోడ్ల రకాలను బట్టి అక్కడ నాట దగిన చెట్ల రకాలను నిర్ణయించుకోవచ్చు. గ్రామసీమలలో నైతే మైళ్ల మైళ్లు నడిచినా బాటసారికి శ్రమ కలగకుండా వుంచగలిగే చెట్లను ఏరి నాటుకోవాలి. అంటే ఏడాది పొడుగునా దట్టంగా వుండే రకం చెట్లు నాడుకోవాలి. రోడ్డుమీద ఎత్తుగా యిరువైపెల తమ శాఖలతో కప్పివేసి బాటసారులు ప్రకృతి పట్టిన ఛత్రాలవలె హాయిగూర్చే చెట్ల నీడలలో ప్రయాణం చేయడం హృదయాహ్లాదకరంగా వుంటుంది.

దిగువ పేర్కొన్న రకాలలో వేటినైనా యిందుకోసం ఉపయోగించుకోవచ్చు.

శాస్త్రీయమైన పేరు	తెలుగు పేరు
అల్బిజియా లెబ్బెక్	దిరిశెన
అజాదిరచ్ఛత ఇండికా	వేప
ఫికస్ గ్లోమెరటా	అత్తి
ఫెరోనియా ఎలిఫాంటమ్	వెలగ
మాంగిఫెరా ఇండికా	మామిడి
పిథెకోలోబియం సామన్	నిద్రగన్నేరు
పొంగామియా పిన్నటా	కానుగ
పెల్‌టొఫోరం ఫెరంగిమ్	కొండచింత
సిజిజియం క్యుమిని	నేరేడు
టామరిండస్ ఇండికా	చింత

టెర్మినేలియా అర్జున	తెల్లమద్ది
హలోప్టేలియా యింటెగ్రిఫోలియా	నమిలినార

తేలిక చెట్లు

నగరాలు, పట్టణాలలో వుండే రోడ్ల విషయంలో మరి పెద్ద చెట్లు, శాఖోప శాఖలుగా పెరిగివుంటే సుందరమైన భవనాల దృశ్యం మరుగున పడిపోతుంది. అన్ని ఋతువులలో అందచందాలతో చిందులాడే తేలిక రకం చెట్లు యిక్కడ నాటుకోవడం ఉచితంగా వుంటుంది. నగరాలు, పట్టణాల్లో పనికి వచ్చే చెట్లు కొన్ని దిగువ పేర్కొనబడినవి.

శాస్త్రీయమైన పేరు	తెనుగు పేరు
బాహీనియా వెరెగాటా	దేవకాంచన
బాహీనియా రాశెమోసా	ఆరె
క్యాసియా ఫిస్ట్యులా	రేల
డిలోనీ రెజియా	ఎర్ర తురాయి లేక పెద్ద తురాయి
దల్బెర్జియా సిస్సూ	....
యూకలిప్టస్ (హైబ్రిడ్ రకం)	....
జాకరండాస్ మిమొసెఫోలియా	....
మిల్లింగ్టోనియా హార్టెన్సిస్	....
పాలియాల్తియా లాంగిఫోలియా	నార మామిడి
ప్లుమేరియా ఆల్టా	గన్నేరు
సారకా ఇండికా	అశోక
తెస్పేసియా పాపుల్నియా	గంగరావి.

రైల్వే ప్లాటుఫారములలోనూ, రైలు స్టేషన్ వెలుపల భాగాలలోనూ రైలు మార్గం వెంబడి నాటే చెట్లు పరిసర ప్రాంతాలకు ఎనలేని సౌందర్యం చేకూర్చి కన్నుల పండువుగా వుంటాయి. పూలు పూసే తరుణంలో ఆ చెట్ల నిండా రంగురంగుల పూలు ఆకర్షణీయంగా ప్రయాణీకులకు పుష్పాంజలులు పడుతున్నవో అన్నట్లు చూపరుల హృదయాలు చూరగొంటుంటాయి. ప్రయాణీకులకు ప్లాట్‌ఫారం మీద చల్లని నీడ సమృద్ధిగా లభిస్తుంది. ఈ చెట్ల వల్ల పండ్లు మొదలైన ఉపయోగకరమైన వస్తువులు లభిస్తే, అప్పుడది రెండందాలా లాభిస్తుంది.

త్వరగా పెరిగేవీ, చాలా కాలంపాటు వుండేవీ, బాగా లోతుకు వ్రేళ్ళు తన్నుకోగలిగేవీ మనం ఏరుకోని నాటడం మంచిది. అటువంటి రకాలు ఏవంటే:

శాస్త్రీయమైన పేరు	తెనుగు పేరు
అల్బిజియా లెబ్బెక్	దిరిశెన
అజాదిర్చత ఇండికా	
అనకోర్డియం ఆక్సిడెంటల్	జీడిమామిడి
బాహీనియా వెరెగాటా	దేవకాంచన
బాహీనియా రాసెమోసా	ఆరె
క్యాసియా ఫిస్ట్యులా	రేల
కాజరీనా ఈక్విసెటిఫోలియా	సరుగు లేకసర్వీ
దల్బెర్జియాసిస్సూ	
డిలోనీరెజియా	ఎర్రతురాయి-పెద్ద తురాయి
యూకలిప్టస్ (హైబ్రిడ్ రకం)	....
ఫెరోనియా ఎలిఫెంటమ్	వెలగ
ఫికస్ గ్లోమేరటా	....
గ్రేవెలియా రోబస్టా	....
హలోప్టేలియా ఇంటెగ్రిఫోలియా	నమలినార
జాకరండ మిమొసెఫోలియా	....
కిగేలియా పిన్నెటా	....
మిల్లింగ్టోనియా హార్టెన్సిస్	....
మాంగిఫెరా ఇండికా	మామిడి
పొంగామియా పిన్నటా	కానుగ
పిథెకొలోబియం సామన్	నిద్ర గన్నేరు
పెల్టోఫోరం ఫెరంగినమ్	కొండచింత
ప్లుమేరియా ఆల్బా	గన్నేరు
పాలియాల్తియాలాంగిఫోలియా	నారమామిడి
సారకా ఇండికా	అశోక
స్పతోడియా కాంపనులటా	
సపిండస్ ఎమర్జినేటస్	కుంకుడు
స్జిజియం క్యుమిని	నేరేడు
సాల్మాలియామ లబారికా	బూరుగు
టెక్టోనా గ్రాండిస్	టేకు
తెస్పేసియా పాపుల్నియా	గంగరాయి
టామరిండస్ ఇండికా	చింత

పార్కులు, ఉద్యానవనాల విషయంలో పుష్ప వికాస

సౌందర్యం, పత్రాలు, దళాల అమరిక ముఖ్యం. ఇటువంటి ప్రదేశాలల్లో నాటడానికి పనికి వచ్చే చెట్లు:

శాస్త్రీయమైన పేరు	తెనుగు పేరు
ఆల్బిజియా లెబ్బెక్	దిరిశెన
ఆర్టోకార్పస్ ఇంటెగ్రిఫోలియా	పనస
బాహీనియా వెరిగాటా	దేవకాంచన
బాహీనియా రాసెమోసా	ఆరె
క్యాసియా ఫిస్టులా	రేల
కాజరీనా ఈక్విసెటి ఫోలియా	సరుగు లేక సర్వీ
డిలోనీరెజియా	ఎర్రతురాయి- పెద్ద తురాయి
యూకలిప్టస్ (హైబ్రిడ్ రకం)	..
గ్రెవేలియా రోబస్టా	....
జాకరండ మిమోసెఫోలియా	....
లగస్ట్రోమియా ఫ్లాస్—రెజినే	....
మిచేలియా చెంపక	....
మిమూసోపస్ ఎలెంగి	పొగడ
మిల్లింగ్ టోమియాహార్టెంటిస్	....
ప్లుమేరియా ఆల్బా	గన్నేరు
పెల్టోఫోరం ఫెరుగినమ్	కొండచింత
పాల్యాల్తియా లాంగిఫోలియా	నారమామిడి
సారకా ఇండికా	అశోక
సపతోడియా కాంపనులాటా	....
టెర్మినేలియా కటప్పా	బాదం

గ్రామాల్లో తోపుల విషయంలో ప్రయోజనం అన్నిటి కంటే ముఖ్యంగా వుంటుంది, అందంగా వుండడం, ఆరోగ్యకరంగా వుండటం తరువాత. అటువంటి రకాలచెట్లు:

శాస్త్రీయమైన పేరు	తెనుగు పేరు
అకేషియా అరాబికా	నల్లతుమ్మ
బొరాసస్ ఫ్లాబెల్లిఫెర్	తాడి
బోసియా లాటిఫోలియా	ఇప్ప
కొకస్ న్యూసిఫేరా	కొబ్బరి
కాజరీనా ఈక్విసెటి ఫోలియా	సరుగుడు —సర్వీ
యూకలిప్టస్ (హైబ్రిడ్ రకం)	....
ఫెరోనియా ఎలిఫెంటమ్	వెలగ
గ్లిరిసీడియా మాక్యులేటా	....
హలోప్టేలియా ఇంటెగ్రిఫోలియా	నమిలినార
మంగిఫెరా ఇండికా	మామిడి
పొంగేమియా పిన్నటా	కానుగ
ఫిలాంతస్ ఎంబ్లికా	పెద్ద వుసిరి
సాల్మేలియా మలబారికా	బూరుగు
సపిండస్ ఎమర్జినేటస్	కుంకుడు
టామరిండస్ ఇండికా	చింత

కాలవగట్ల వెంబడి బాగా ఎత్తుగా పెరిగేవీ వ్రేళ్ళను నలు వైపుల బాగా వ్యాపింప జేసేవి, ఆర్థికంగా కూడా ప్రయోజనకరంగా వుండేవి అవసరం. త్వరగా పెరిగే వంట చెరుకు రకాలు కూడా నాటుకోవచ్చు.

శాస్త్రీయమైన పేరు	తెనుగు పేరు
అకేషియా అరబికా	నల్ల తుమ్మ
క్యాసియా ఫిస్టులా	రేల
కాజరీనా ఈక్విసెటి ఫోలియా	సరుగు లేక సరివి
యూకలిప్టస్ (హైబ్రిడ్ జాతి)	....
అనకార్డియం ఆక్సిడెంటల్	జీడి మామిడి

వచ్చిక మైదానాలలో నల్ల తుమ్మ పెద్ద వుసిరి చెట్లు నాటుకోవచ్చు. వివిధ జిల్లాలలో అటవీశాఖవారి ఆధ్వర్యంలో అన్ని రకాల మొక్కలు దొరికే నర్సరీలు నిర్వహింప బడు తున్నవి. డివిజనల్ అటవీశాఖాధికారులు పైనపేర్కొన్న వివిధ రకాల చెట్ల మొక్కలను సప్లై చేయుటానికి తగు ఏర్పాట్లు చేస్తారు.

హైదరాబాద్, సికింద్రాబాద్ పరిసరాల్లో నాలుగు నర్సరీలు వున్నాయి.

(1) బీబీనగర్ నర్సరీ — నగరానికి 22 మైళ్ల దూరాన, భువనగిరి రోడ్డులో (2) సాహిబ్ నగర్ నర్సరీ — నగరానికి 12 మైళ్ల దూరాన నాగార్జున సాగర్ రోడ్డులో (3) రాజేంద్ర నగర్ నర్సరీ — నగరానికి 12 మైళ్ల దూరాన హిమాయత్ సాగర్ చెరువు వద్ద (4) ముషీరాబాద్ నర్సరీ — నగరానికి 10 మైళ్ల దూరాన విజయవాడ రోడ్డులో ఈ నాలుగు అటవీశాఖ అధ్వర్యాన ఏర్పాటు చేయబడినవి. వివిధ రకాల చెట్ల మొక్కలు వీటినుండి పొందవచ్చు.

మొక్క నాటినాము గనుక పెరుగుతుందని వూరుకో కూడదు. నాటిన తరువాతనే అసలు పని ప్రారంభమవుతుంది. ఆ తరువాత తీసుకోవలసిన శ్రద్ధ చాలా ముఖ్యమైనది. నాటిన తర్వాత ఏ ప్రమాదం జరిగినా నాటిన మొక్క చావడమే కాకుండా, శ్రమంతా కూడా వృథా పోతుంది

వనమహోత్సవం విజయవంతం కావాలంటే ప్రజల దీక్ష, శ్రద్ధ ఎక్కువగా ఉండాలి. చెట్లు పెంచడం మామూలుగా అనుకునేటంత సులభం కాదు అన్ని విధాలా. ఈ ఉద్యమం విషయంలో జాగ్రత్త వహించి సక్రమంగా చేయడం అవసరం. మన ధర్మము చెప్పిన విధంగా మనం తామే చెట్లయందంత ప్రేమాభిమానాలు అలవరచుకోవాలి. చెట్లను "పూజించడం" అలవరచుకుంటే, భూతలంలో మనోహరమైన, దివ్యమైన నందనవనాలు సృష్టించుకోవచ్చు. దివినుండి దేవతలను భూమిమీదకు రప్పించవచ్చు

మానవ జీవితం చెట్లలోనే ప్రారంభమైంది. వాటి సమృద్ధిలో మానవుడికి ఆనందైశ్వర్యాలు లభించాయి. చెట్లు నాటే కార్యక్రమాన్ని సమర్థవంతంగా ఆచరణలో పెట్టుకోలేకపోతే సుఖసంపద మనకు దూరమవుతుంది

బుద్ధ భగవానుని ఉపదేశం మనం మరువగలమా!

"అరణ్యం ప్రాణుల అనంతమైన దయాస్వరూపము. భూమి యొక్క తన ఉనికి నిమిత్తం కోరదు. తన ప్రాణ్యంతమును ఏది బహుమతిగా ప్రయోజనాలను మనకు ఉదారంగా సమకూర్చుతూ ఉంటుంది. సర్వజీవులకు సంరక్షణ కలిగిస్తుంది. పక్షికి నీడ నిచ్చి — చివరకు తన చెట్లను నరికే వానికి కూడా నీడ నిచ్చి నిరుపమానమైన మహౌదార్యం ప్రదర్శిస్తుంది."

(ఆంగ్లం నుండి అనువాదం)

జాతీయ పొదుపు ఉద్యమ సహాయార్థం ప్రదర్శన

జాతీయ పొదుపు ఉద్యమానికి సహాయార్థమై జూన్ 1 వ తేదీన హైదరాబాదులో గాంధీ భవనం ఆడిటోరియంలో "ఝాంసీ రాణి" అను నృత్యనాటక ప్రదర్శన యేర్పాటు చేయబడింది. కొత్త ఢిల్లీకి చెందిన ప్రఖ్యాత భారతీయ కళా కేంద్రం వారు ఈ నాటకాన్ని ప్రదర్శించారు. రాష్ట్ర ఆర్థికమంత్రి, శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, అధ్యక్షత వహించారు.

ఈ ప్రదర్శన మూలంగా సుమారు రు. $4\frac{1}{2}$ లక్షల పెట్టుబడులు లభించాయి.

ముఖ్య వార్తలు

21–5–60

ఆరవ అఖిల భారత గిరిజనుల సమావేశాన్ని ఉదక మండలంలో భారత ఉపాధ్యక్షుడు ప్రారంభించారు.

22–5–60

ఆదిలాబాదు జిల్లాలో ఒక సహకార స్పిన్నింగ్ మిల్లును ప్రారంభించ నిశ్చయించినట్లు కలెక్టరు వెల్లడించారు.

23–5–60

శిఖరాగ్ర చర్చల వైఫల్యాన్ని గురించి అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ పంపిన లేఖ ఒకటి భారతదేశానికందినట్టు ఈ రోజు క్రొత్త ఢిల్లీలో విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉద్యోగి ఒకరు అన్నారు.

24–5–60

చిలీ భూకంపం నుండి బైలుదేరిన భయానకమైన సముద్రపు పొంగు గంటకు 400 నుంచి 500 మైళ్ళ వేగంతో పసిఫిక్ మీదుగా జపాను కోస్తా ప్రాంతాన్ని తాకటంతో, 800 మంది ప్రజలు మరణించారు. వేలాది మంది నివాసం కోల్పోయారు.

25–5–60

క్షయ రోగులకు ప్రత్యేక చికిత్స చేయటానికి, వ్యాధిని శీఘ్రంగా అదుపులో వుంచటానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఆరు క్షయ నిరోధక కేంద్రాలను తెరువబోతున్నట్టు, రాష్ట్ర ఆరోగ్య మంత్రి పత్రికా విలేఖరులకు తెలియజేశారు.

26–5–60

భారత ఎవరెస్టు అధిరోహక ప్రథమ బృందం శిఖరం చేరటానికి ఇంకా 700 అడుగుల దూరంలో వుండగా వారి ప్రయత్నాన్ని మే 25వ తేదీన దట్టమైన మంచు, తీవ్ర వేగంతో కూడుకున్న వర్ష వాయువులు అటకాయించి విరమింప జేశాయని ఆ బృందం నాయకుడు బ్రిగేడర్ గ్యాన్ సింగ్ పంపిన వైర్‌లెస్ వార్త తెలియజేసింది.

27–5–60

జనరల్ జమాల్ గుర్సె నాయకత్వాన జాతీయ యూనిటీ కమిటీ టర్కీలో అధికారాన్ని హస్తగతం చేసుకుంది.

28–5–60

రెడ్ టేపిజాన్ని నిర్మూలించటానికి, ఆఫీసు విధానాన్ని సూక్ష్మీకరించటానికి, ప్రభుత్వ పనిని త్వరగా తెమల్చటానికి అన్ని స్థాయిలలో అధికారాలను ఇవ్వటంతో సహా తగు చర్యలను సూచించటానికి ప్రధాన కార్యదర్శి అధ్యక్షత క్రింద పరిపాలనా సంస్కరణల సంఘాన్నొకదానిని నియమించినట్టు రాష్ట్ర ప్రభుత్వం నేడే ప్రకటించింది.

తెలంగాణా ప్రాంతంలోని రాజకీయ బాధితులకు ప్రభుత్వ ఆధీనంలో వున్న భూములను ఉచితంగా ఒక్కొక్కరికి మెట్టయితే 10 ఎకరాలు మాగాణి అయితే 5 ఎకరాలు మంజూరు చేయవచ్చని ప్రభుత్వం ఆదేశించింది.

29–5–60

రాష్ట్రంలోని మైకా గనులలో పని చేస్తున్న అన్ని తరగతుల ఉద్యోగుల కనీస జీతాలను పునర్నిర్ణయిస్తూ ప్రభుత్వం ఒక ప్రకటన జేసింది.

30–5–60

తుంగభద్ర, కృష్ణా, గోదావరి, ఇతర నదుల తీరాలలో జరిగే ప్రదర్శనల, తిరునాళ్ళ జాబితాను తయారు చేయవలసిందిగా ప్రభుత్వం అన్ని జిల్లాల పోలీసు సూపరింటెండెంట్లకు ఆదేశాలను పంపింది. అంతేగాక అవతల ఒడ్డు నుంచి ప్రజలను ఆకర్షించే తిరునాళ్ళ సందర్భంలో పడవ ప్రయాణాలను అజమాయిషీ చేసే బందోబస్తు యేర్పాట్లను చూడ

వలసిందిగా ఆయాసమీపానగల పోలీసు స్టేషనులకు శాశ్వత ఆదేశాలను సూపరింటెండెంట్లు ఇవ్వవలసిందిగా కూడ కోర బడింది

ప్రపంచ విఖ్యాత సోవియట్ రచయిత బోరిస్ పాస్టర్ నాక్ (70) మాస్కోలో మరణించారు.

31–5–60

ఈ నాడు వెలువడిన ప్రత్యేక గజెటులో శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డి రాజీనామాను గవర్నరు ఆమోదించినట్టు అధికారికంగా ప్రకటించబడింది

1–6–60

తృతీయ ప్రణాళిక క్రింద కేటాయించిన నిధులు ఆంధ్ర, తెలంగాణాలలో ప్రస్తుతంవున్న తేడాలను ముఖ్యంగా విద్యా సదుపాయాల విషయంలో వున్న వాటిని సరిదిద్దటానికి వినియోగించబడుతాయని నేడు పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ ప్రణాళికా మంత్రి అన్నారు.

2–6–60

జెనీవాలో జరుగుతున్న మూడు రాజ్యాల అణుశక్తి సమావేశంలో రష్యా ఏ విధమైన అండర్‌గ్రౌండు పరీక్షలు జరుపదలచలేదని సోవియట్ ప్రతినిధి చెప్పారు.

3–6–60

కాకినాడలోని మత్స్య పరిశ్రమల శాఖ సహాయ డైరెక్టరు, శ్రీ వి. యస్. దేవెంచే నమూనా వేయబడి నిర్మించబడిన భారత అత్యంత ఆధునిక ట్రాలర్ ఈ రోజు జలప్రవేశం చేయబడింది.

4–6–60

ప్రస్తుతం వున్న పోలిటెక్నిక్‌లకు అంతర్భాగంగా ఈ సంవత్సరం మరో మూడు పోలిటెక్నిక్‌లు, మూడు జూనియర్ సాంకేతిక పాఠశాలలు, రెండు ఆంధ్రలో ఒకటి తెలంగాణలో ప్రారంభించ బడుతాయని ప్రణాళిక మంత్రి పత్రికా విలేఖరులతో అన్నారు.

5–6–60

ఆంధ్ర ప్రదేశ్ కెమిస్టులు, డ్రగ్గిస్టుల సంఘం 14వ సమావేశాన్ని హైదరాబాదులో ఆరోగ్యమంత్రి ప్రారంభించారు.

6–6–60

రాష్ట్రమంతటా మహమ్మదీయులు యీ రోజు బక్రీద్ వేడుకగా జరుపుకున్నారు.

7–6–60

పది దేశాలు పాల్గొంటున్న తూర్పు-పశ్చిమ నిరాయుధీకరణ సమావేశం జెనీవాలో నేడే మళ్ళీ ఆరంభమైంది.

8-6–60

గుంటూరు జిల్లాలోని దగ్గుపాడు కాలువ పథకాన్ని చేపట్టే విషయాన్ని పరిశీలించటానికి పబ్లిక్ వర్క్సు మంత్రి అధ్యక్షతన సచివాలయంలో అధికస్థాయిన ఒక సమావేశం జరిగింది.

9–6–60

పాత హైదరాబాదులోని లేడీ హైదరీ మెమోరియల్ శిశు సంక్షేమ కేంద్రంలో ఒక పీడియాట్రిక్ కేంద్రానికి ముఖ్య మంత్రి ప్రారంభోత్సవం జరిపారు. ఈ కేంద్రాన్ని హైదరాబాదు మునిసిపల్ కార్పొరేషనువారు ప్రపంచ ఆరోగ్యసంస్థ సహాయంతో ప్రారంభించారు.

తంగెడ పడవ ప్రమాదాన్ని గురించి విచారించటానికి ముగ్గురు సభ్యులతో ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది.

10–6–60

ప్రభుత్వ ఉద్యోగుల జీతం కొత్త స్కేళ్ళ ప్రకారం నిర్ణయించే పని 70 శాతం వరకు పూర్తి అయిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి పత్రికా విలేఖరులకు చెప్పారు.

11–6–60

ఆంధ్ర నుంచి దక్షిణ ఆహార మండలం వెలుపల ప్రాంతాలకు బియ్యాన్ని ఎగుమతి చేయటం మీద నిషేధం వున్నందువల్ల, బియ్యం అమ్ముకోవటంలో అక్కడి రైతులు రైస్ మిల్లర్లు ఇబ్బందులకు గురవుతున్నట్టయితే, వారి వద్దవున్న మొత్తం బియ్యపు నిల్వలను కొనటానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగావుందని కేంద్ర ఆహార ఉపమంత్రి శ్రీ ఎ. యం. థామస్ నేడు మద్రాసులో అన్నారు.

12–6–60

అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హోవర్ తూర్పు ఆసియా పర్యటనకు బయలుదేరారు.

13–6–60

మెట్రిక్ తూకాలు కాకుండా ప్రస్తుతం అమలులోవున్న తూకపు పద్ధతులు నిర్ణీత ప్రదేశాలలో వచ్చే సెప్టెంబరు 30వ తేదీ నుండి చెల్ల నేరవని ప్రభుత్వం ప్రకటించింది.

14–6–60

కేంద్ర పరిశ్రమల మంత్రి విజయవాడ పారిశ్రామిక ఎస్టేటును నేడే తెరిచారు

15–6–60

కేంద్ర పరిశ్రమల మంత్రి వరంగల్లులో పారిశ్రామిక ఎస్టేటును తెరిచారు.

16–6–60

జపాను ప్రభుత్వం కోరికమీద అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ తన జపాను పర్యటనను వాయిదా వేసుకున్నారు.

17–6–60

తృతీయ పథాకికలో దేశమంతటా 20 లక్షల ఎకరాల భూమి విస్తీర్ణాన్ని కలిపే 20 వేల జాయింటు సహకార క్షేత్రాలు స్థాపించబడుతాయని, పణాళికా సంఘం సభ్యుడు, శ్రీ శ్రీమన్నారాయణ్ శ్రీనగరులో అన్నారు.

18–6–60

జపాను పార్లమెంటు జపాను–అమెరికా రక్షణ సంధిని దృవపరిచింది.

19–6–60

రాష్ట్ర శాసన మండలి ద్వివార్షిక ఎన్నికలలో తెలంగాణాలోని పట్టభద్రుల నియోజక వర్గం నుంచి ముగ్గురు ప్రతినిధులను ఎన్నుకోవటానికి ఈ రోజు పోలింగు జరిగింది.

20–6–60

అధ్యక్షుడు, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సోవియట్ యూనియన్‌లో 15 రోజులపాటు అధికార పర్యటనను జరుపటానికి నేడు మాస్కో చేరగానే బ్రహ్మాండమైన స్వాగతం ఇవ్వబడింది.

శోకభయ కారణమ్ములు లోకమున న
నేకములు దానఁ దలమూవు శోకములకు
భయములకు బుద్ధినెడ యీఁడు పండితుండు
మూఢుఁడవి త్రోవ నేరండు మునుఁగు వగల.

— భారతము (శాంతి)

పాఠకుల లేఖలు

కార్టూన్

"ఆంధ్ర ప్రదేశ్" జూన్ నెల సంచికలోని కార్టూన్‌లో కేవలము ప్రైజ్ కోసరమే ప్రైజ్ బాండ్లు కొనుసట్లు కనుపించుచున్నది. మీ అభిప్రాయం?

రామారావు,
పాత మలక్‌పేట. హైదరాబాదు.

(కళాకారుడి నిశిత దృష్టికు అడ్డేముంది?—సం.)

ముఖ చిత్రం

ముఖచిత్రం విషయంలో ఇతోధికంగా శ్రద్ధ వహించాల్సిన అవసరం కనబడుతూంది. పోతే, సామెతలు పద్యములు చాలా వరకు తగ్గించి విద్యార్థులకు ప్రత్యేకమైన ఒక శీర్షిక వుంచితే పత్రిక మిక్కిలి రాణిస్తుందని ఆశించవచ్చు.

బి. యస్. ఆర్. పంతులు,
పొన్నూరు. (గుంటూరు జిల్లా)

(ముఖ చిత్రంగా ఉపయోగించటానికి ఆకర్షణీయమైన ఫోటోలు చదువరులు గూడా పంపవచ్చు అవి పేజీ కంటే కొంచెం పెద్ద సైజులో ఉంటే మంచిది.....సం.)

"మాస ఫలాలు"

జూన్ నెల ఆంధ్ర ప్రదేశ్ సంచిక చదివాను. "ప్రజారోహణ" నాటికలో ఎడ్డీలకు పైఎడ్డీలు చక్ర ఎడ్డీలు గుంజే ధన మదాంధులకు నీతి తెల్పడం చాలా బాగున్నది. పత్రికలో సినీమా వార్తలు, మాస ఫలాలు లోటు కనుపించుచున్నది. అయినప్పటికీ ఇంత చవకగా యిన్ని విషయాలు చదువరులకు తెలుపుతున్నందుకు సంతోష పడుతున్నాను.

సూరవురెడ్డి అశ్వద్ధరెడ్డి,
కనకాద్రిపల్లె (కర్నూల్ జిల్లా)

(మాస ఫలాలు వారం ఫలాలు మొదలైనవి దిన వార పత్రికల్లో విరివిగా వస్తూనేవున్నవి. ఈ మాస పత్రికలో వాటికి తావుండదు—సం.)

రైతులకు సహాయం

"జొన్నకు వచ్చే తెగుళ్లు- వాటి నివారణ" గురించి విపులంగా వ్రాశారు ఆ విధంగానే ఎప్పుడూ ఏదో ఒక పంటను గురించి వ్రాస్తూ రైతు సోదరులకు సహాయ పడగలరని ఆశించు చున్నాను.

గుత్తాల వెంకట్రావు,
మాధవ రాయుపాలెం, తూ॥గో॥ జిల్లా

(అదీ మా ఉద్దేశమే. ఈ నెలలో కోళ్ల పెంపకాన్ని గూర్చి ఉంది.—సం)

కరుణా స్వభావంబు గల సైనికుండు
క్రూర తాత్వికు కంటె గుణతరుండగును

— దువ్వూరి.


Jalaput Dam.